
ಚ

# చె

ఎర్నెస్టో చె గువేరా

మరియా డెల్ కార్మెన్ ఎరియట్ గార్సియా

ఐజాజ్ అహ్మద్

అనువాదం
**ఎస్. వెంకట్రావు**
**కె. వీరయ్య**


**ప్రజాశక్తి బుక్‌హౌస్**
*విజయవాడ - 520 002.*
*ఫోన్ : 0866 - 2577533*

**నవతెలంగాణా పబ్లిషింగ్ హౌస్**
హైదరాబాద్ -20,
ఫోన్ : 040-27660013

1. Preface- María del Carmen Ariet García, Che Guevara Institute, Havana
2. Introduction- Aijaz Ahmad
3. Chronology.
4. Message to Tricontinental
5. Socialism and Human Beings in Cuba


**ఇ-బుక్**

**ప్రచురణ సంఖ్య** : 1664

**ప్రథమ ముద్రణ** : అక్టోబర్, 2020


**20 అంతర్జాతీయ ప్రచురణ సంస్థలచే సంయుక్తంగా**
**20 భాషలల్లో ముద్రింప బడింది.**
**ప్రచురణ సంస్థల పేర్లు పక్క పేజీలో చూడగలరు.**


**ప్రతులకు**

**ప్రజాశక్తి బుక్‌హౌస్**
27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,
విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**నవతెలంగాణా పబ్లిషింగ్ హౌస్**
యంహెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం
హైదరాబాద్ -20, ఫోన్ : 040-27660013

**ముద్రణ**
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ
website : www.psbh.in
prajasaktipublishinghouse@gmail.com

Batalla de Ideas (Argentina)
www.batalladeideas.com.ar

Bharathi Puthakalayam (India)
www.thamizhbooks.com

Chintha (India)
www.chinthapublishers.com

Deshar Katha (India)

Editorial Caminos (CMMLK, Cuba)
ww.ecaminos.org

El Colectivo (Argentina)
www.editorialelcolectivo.com

Expressao Popular (Brazil)
www.expressaopopular.com.br

Fondo Editorial Fundarte (Venezuela)
www.fundarte.gob.ve

Gonoprokashon (Bangladesh)

Simón Bolivar Institute (Venezuela)
www.isb.ve

Janashakti Prakashan (India)

Kriya Madyama (India)

LeftWord (India)
www.mayday.leftword.com

Naked Punch (Pakistan)
www.nakedpunch.com

Nava Telangana (India)
www.navatelanganabooks.com

Ojas: Vidyarthi Ni Pahel (India)

Prajasakti (India)
www.psbh.in

Tricontinental. Institute of Social Research
www.thetricontinental.com

Vam Prakashan (India)
mayday.leftword.com/vaam-prakashan/

Založba /*cf (Slovenia)
www.zalozbacf.si

# విషయసూచిక


*10* ముందుమాట
**– మరియా డెల్ కార్మెన్ ఎరియట్ గార్సియా**

15 పరిచయం
***– ఐజాజహ అహ్మద్***

26 చె గువేరా జీవిత సంగ్రహం

30 ట్రైకాంటినెంటల్‌కు చెగువేరా సందేశం (1967)

52 క్యూబాలో సోషలిజం, మానవత్వం
***– ఎర్నెస్టో చే గువేరా***

## 20 వామపక్ష ప్రచురణ సంస్థల ఉమ్మడి కృషి

2020 అక్టోబర్ 9 విప్లవ నేత ఎర్నెస్టో చె గువేరా 53వ వర్ధంతి సందర్భంగా, ఆయన రాసిన రెండు వ్యాసాల సంకలనాన్ని ఆ రోజు సాయంత్రం 6 గంటలకు అంతర్జాతీయంగా 20 వామపక్ష ప్రచురణ సంస్థలు ఆన్-లైన్‌లో విడుదల చేశాయి. 'చె' శీర్షికతో ఈ ఉచిత ఇ-పుస్తకం భారత దేశం నుండి దక్షిణమెరికా వరకు 20 భాషల్లో వెలువడింది. మన దేశంలో మళయాళం, మరాఠీ, తమిళం, కన్నడ, బెంగాలీ, తెలుగు, ఉర్దు, హిందీ, గుజరాతీ ప్రచురణకర్తలతోపాటు ఇంగ్లీషు, స్లోవేనియా, స్పానిష్, పోర్చుగీసు భాషల్లో ఈ పుస్తకాన్ని ప్రచురించారు.

అంతర్జాతీయంగా వామపక్ష ప్రచురణ కర్తలు సంయుక్తంగా ఒకే పుస్తకం బహుభాషల్లో ప్రచురించడం ఇది మూడోసారి. గతంలో లెనిన్ 150వ జయంతి సందర్భంగా 'లెనిన్ 150' పేరుతో ఒక పుస్తకం, 'మారియాటెగుయి' పేరుతో మరో పుస్తకం ఈ విధంగా ప్రచురించడం జరిగింది. గతంలో వామపక్ష ప్రచురణ కర్తలు 'రెడ్ బుక్స్ డే' సందర్భంగా సంయుక్త కార్యచరణ జరిపారు. 2020 ఫిబ్రవరి 21 నాడు వేలాది మంది ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో కమ్యూనిస్టు మ్యానిఫెస్టో చదివారు. ఇకనుండి ప్రతిఏటా రెడ్ బుక్స్ డే జరుపుతారు.

ట్రైకాంటినెంటల్‌కు చె గువేరా రాసిన లేఖనూ, క్యూబాలో సోషలిజం, మానవుడు పేరుతో చె రాసిన ఒక వ్యాసాన్ని 'చె' పుస్తకంలో సంగ్రహం చేశారు. క్యూబా రాజధాని హవానాలోని చె గువేరా ఇన్‌స్టిట్యూట్ స్కాలర్ అయిన మారియా డెల్ కార్మెన్ ఆరియెట్ గార్సియా పుస్తకానికి ముందుమాట రాయగా, ట్రైకాంటినెంటల్: సామాజిక పరిశోధనా సంస్థ సీనియర్ ఫెల్లో, మార్క్సిస్టు మేధావి ఐజాజ్ అహ్మద్ పరిచయం రాశారు.

తెలుగులో చె ఉచిత ఇ–పుస్తకాన్ని ప్రజాశక్తి, నవతెలంగాణా ప్రచురణ సంస్థలు సంయుక్తంగా ప్రచురించాయి. దీంతోపాటు ప్రజాశక్తి ప్రచురణ సంస్థ ఆఫ్‌లైన్‌లో పుస్తకాన్ని ముద్రించింది.

చె గువేరా కవర్ పెయింటింగ్‌ను ట్రైకాంటినెంటల్ లీడ్ డిజైనర్ టింగ్స్ చాక్ రూపొందించారు. రేడియో రిబెల్డెలో చె ప్రసంగిస్తున్న ఫోటో ఆధారంగా ఈ పెయింటింగ్ వేశారు.

39 ఏళ్ల ప్రాయంలోనే, బొలీవియా విప్లవ పోరాటంలో అమెరికన్ సామ్రాజ్యవాదుల అండదండలతో హత్యగావించబడిన చె గువేరా మేధస్సుకు, దక్షతకు ఇందులో పొందుపర్చిన రెండు రచనలు దర్పణం పడతాయి. వీటిలో ఆయన వ్యక్తం చేసిన భావాలు దీర్ఘకాలంగా చె లో రూపుదిద్దుకున్న మేధోమధనానికి వ్యక్తీకరణలు. నేటి తరంలో, ముఖ్యంగా నేటి యువతలో సామ్రాజ్యవాద వ్యతిరేక కసినీ, సామాజిక విప్లవ స్ఫూర్తిని నింపడానికి తోడ్పడే ఈ పుస్తకాన్ని ఆదర్శిస్తారని ఆశిస్తున్నాం.

**– ప్రచురణ కర్తలు**

# ముందుమాట

**మరియా డెల్ కార్మెన్ ఎరియట్ గార్సియా**

***చె గువేరా : సోషలిజం,***
***నూతన మానవుడు,***
***తృతీయ ప్రపంచం***

విప్లవకారునిగా చె పరిణామంలో 1965, 1966 సంవత్సరాలు కీలకమైనవి. ఆ కాలం ఒక పరిణామానికి పరాకాష్ఠ, మరొక పరిణామానికి నాంది. 1959లో క్యూబా విప్లవం విజయవంతమైన నాటి నుండి, 1965లో క్యూబాను వదిలి అంతర్జాతీయ కర్తవ్య నిర్వహణకోసం కాంగొ, బలీవియాలకు ప్రయాణమయ్యేవరకు చె గొప్ప కృషి, ఆలోచనలను అందించారు. క్యూబాలో తన కృషి, వివిధ పాత్రలలో తాను నిర్వర్తించిన కర్తవ్యాల అనుభవాలు ఆధారంగా తృతీయ ప్రపంచ దేశాలని చెప్పబడుతున్న వాటిలో సోషలిజం నిర్మాణం గురించి తన అభిప్రాయాలను, నిర్ధారణలను వ్యక్తం చేయడంపై దృష్టి సారించాడు. అంతేకాదు, ఇప్పటికే సోషలిజం నిర్మాణంలో ఉన్న మిగతా సోషలిస్టు దేశాల, ప్రత్యేకించి సోవియట్ యూనియన్ అనుభవాల నుండి ఆయన స్వీకరించాడు. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ రచనలను విపులంగా అధ్యయనం చేశాడు.

ఈ కాలంలో చె అసంఖ్యాకమైన రచనలు చేశాడు, ఎన్నో వ్యాసాలు రాశాడు, ఉపన్యాసాలు ఇచ్చాడు. ఆలోచనలను పంచుకున్నాడు. మానవజాతి విముక్తి సాధనకు, అభ్యున్నతికి అవశ్యక గమ్యమైన సోషలిజానికి పరివర్తన కోసం చేపట్టవలసిన

కార్యాచరణ గురించి, ప్రణాళికల గురించి, లక్ష్యాల గురించి వీటన్నింటిద్వారా చె వివరించాడు. దాదాపు ఆయన రచనలు, ఉపన్యాసాలు అన్నింటినోను ప్రధాన అంశం, పేద, అభివృద్ధిలో వెనుకబడిన దేశాలను స్వతంత్ర, సార్వభౌమ దేశాలుగా మార్చడానికి చేపట్టవలసిన నిర్దిష్ట కార్యాచరణ ఏమిటన్నదే. ఆయన ప్రధాన కేంద్రీకరణ దోపిడీని, అన్ని రకాల ఆధిపత్యాలను తుదముట్టించకలిగిన మార్పులన్నింటికి వాహకమైన నూతన మానవుని రూపొందించడమే.

1965 తొలిమాసాలలో ఆఫ్రికాకు చె బయలుదేరడానికి ముందు, 1964 డిసెంబరులో ఐక్యరాజ్యసమితిలో ఆయన ఇచ్చిన ఉపన్యాసాన్ని విశ్లేషిస్తే అప్పటికి ఆయన జీవితంలో ఒక దశ ముగిసిందని తెలుసుకోవచ్చు. ఈ ఆఫ్రికా పర్యటనలో చె వివిధ దేశాల నాయకులను, విముక్తి ఉద్యమాల నేతలను కలుసుకున్నాడు. 1965 ఫిబ్రవరిలో ఆల్జీర్స్‌లో జరిగిన ఆఫ్రో ఆసియా సెమినార్‌లో ఆయన ఇచ్చిన ఉపన్యాసం దిగ్భ్రాంతికరమైనదని, వివాదాస్పదమైనదని చాలమంది భావించారు. ఈ ఉపన్యాసంలో చె తృతీయ ప్రపంచదేశాల పాత్ర గురించి, పెట్టుబడిదారీవిధానంతో ఆ దేశాలు తలపడటం గురించి, జాతీయ విముక్తి ఉద్యమాలకు సోషలిస్టు దేశాల సహాయ సహకారాల ఆవశ్యకత గురించి తన అభిప్రాయాలను వెల్లడించాడు.

ఈ మాటలు అప్పుడు ఎదుర్కొన్న విమర్శలు, వైరుధ్యాల సంగతి ఎలా ఉన్నప్పటికీ, చె చెప్పినట్లు సోషలిజాన్ని కలిసికట్టుగా, సమన్వయంతో కూడిన చర్యల ద్వారా పరిరక్షించుకోవడంలో విఫలమవ్వడం మూలంగాను, అస్పష్టమైన, పిడివాదంతో కూడిన వాదోపవాదాలలో కూరుకుపోవడం వలన జరిగిన పూడ్చుకోలేని నష్టం ఎంతటిదో ఇటీవలి చరిత్ర రుజువు చేసింది. చె మార్గం ఎలాంటిదో నిర్ధారించుకోవడానికి ఆ తర్వాత ఆయన చర్యలను గమనంలోకి తీసుకోవాలి. ఆ కొద్దికాలం పర్యటనల తర్వాత చె ప్రజావిముక్తి పోరాటాలను ప్రజ్వలింపచేయడానికి నూతన పోరాటాన్ని చేపట్టాలని నిర్ణయించుకున్నాడు. అదే సమయంలో ఆయన 21వ శతాబ్దాపు నూతన మానవుని సృష్టించడం గురించి తన అభిప్రాయాలను వెల్లడించే 'ప్రయత్నాలను' విరమించుకోలేదు.

అల్జీర్స్‌లో చె క్లుప్తంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఆ తర్వాత ఆయన సైద్ధాంతిక రచనలు 1965లో ***క్యూబాలో సోషలి జం, మానవత,*** 1966లో ***ట్రైకాంటినెంటల్ కు సందేశం: రెండు, మూడు మరెన్నో వియత్నాలను సృష్టించాలి*** లో ప్రతిబింబించాయి.

***క్యూబాలో సోషలిజం, మానవత,*** మొదటిగా 1965 మార్చి 12న ఉరుగ్వే నుండి వెలువడుతున్న **మర్చా** అనే జర్నల్‌లో ప్రచురితమయింది. దీన్ని చె పైన

చెప్పిన ఉపన్యాసాన్ని ఇస్తున్నపుడు అల్జీర్స్ నుండి రాశాడు. అదే సంవత్సరం ఏప్రిల్ నుండి నవంబరు వరకు కాంగో విముక్తి పోరాటంలో పాల్గన్నాడు. చె సహజ పద్ధతిలో తన క్లిష్టమైన, ఎంతో విలువైన అనుభవాలను ***కాంగొ: విప్లవ పోరాట ఘట్టాలు*** అనే శీర్షికతో రాశాడు.

కాంగొ నుండి తిరిగివచ్చిన సమయం చె జీవితంలో ఒక మూలమలుపు. అది ఒక సందేహము, ప్రత్యామ్నాయము. అది ఆయనను లాటిన్ అమెరికా సంపూర్ణ విముక్తి కోసం పోరాటానికి మళ్ళేలా చేసింది. ఇది అందరికి తెలియంది ఏమీ కాదు. ఫైడెల్ నాయకత్వంలో బాటిస్టాకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి మెక్సికోలో శిక్షణ పొందుతున్న సమయంలలోనే చె క్యూబా విముక్తి అయిన తర్వాత, ఈ ప్రాంతంలో ఇతర దేశాల విముక్తికి కదలడానికి నిబద్ధుడైనాడు.

1955, 1956లో విప్లవకారుడు చె గువేరా జీవితంలో ఒక కొత్త అధ్యాయం మొదలయింది. ఈ సమయం మెజారిటీ ప్రజల మద్దతుతో జరిగిన పోరాట ఫలితంగా 1959లో ఒక సాధికార ప్రజా విప్లవం విజయవంతం కావడానికి దారితీసింది. తొలుత చె ఫైడెల్ నాయకత్వంవైపుకు ఆకర్షితుడైనాడు. కాని తర్వాత తొలి ఆలోచనలు, కార్యాచరణకోసం నిబద్ధత ఒక విప్లవ క్రమానికి దారితీసి, చె సోషలిస్టుగా పరివర్తన చెందాడు.

విప్లవానికి తనను తాను సంపూర్ణంగా అంకితం చేసుకున్న చె బహుముఖ కర్తవ్యాలను, బాధ్యతలను స్వీకరించాడు. ఇవన్నీ కూడ సంఘర్షణలలో తలపడి అతి త్వరితంగా పరిష్కరించి ఒక వెనుకబడిన, పరాధీన దేశ పరిస్థితులలో సోషలిజం వైపుకు పయనించేందుకు ఉద్దేశించినవే. బహుముఖ మార్గాలలో సాగిన ఈ కృషి ఆయన నూతన సమాజానికి మౌలిక పునాదులు నిర్మించే కర్తవ్యనిర్వహణకు దారితీసేలా పరివర్తన చెందించింది. ఆయన కృషి ఫలితాల బేరీజు అలా ఉంచితే, రెండు ఫలితాలు మాత్రం ప్రముఖంగా కనిపిస్తాయి. అవి 1, ఎంచుకున్న మార్గంలో సమన్వయంతో, నిరంతరాయంగా సాగిపోయేందుకు పరిస్థితుల అధ్యయనానికి సంపూర్ణంగా అంకితం కావడం, 2, మరింత సంక్షేమం కోసం, సామాజిక అభివృద్ధి కోసం ముందుకు సాగాలని నిర్ణయించుకున్న క్యూబాలో మాదిరి పరిస్థితులున్న ఇతర దేశాలకు దారిచూపే క్యూబా అనుభవాల గురించిన అభిప్రాయాలు.

ఈ నిరంతర అలవాటు, ఆసక్తి చె క్యూబాను వదిలి వెళ్ళడానికి ముందే ***క్యూబాలో సోషలిజము, మానవత*** రాయడానికి పురికొల్పాయి. చె తాను పోరాడిన, కృషి చేసిన నియమాలను మర్చిపోకుండా ఒక చోట క్రోడీకరించాడు. ఇవి క్యూబా విప్లవం తనను తాను పటిష్టపరుచుకోవడానికే కాకుండా ఇతర దేశాలు కూడ సోషలిస్టు

మార్గంలోకి అడుగిడేలా చేసేందుకు దోహదపడతాయి.

అందుచేత, ఈ రచన శీర్షిక కాని, సారాంశం కాని యాదృచ్ఛికంగా ఎంచుకున్నవి కావు. ఈ కృషి ఎవరికోసమైతే ఉద్దేశించబడిందో ఆ మానవులు ఆ కృషిలో భాగస్వాములుగా చురుగ్గా పాల్గని మౌలిక పాత్రను నిర్వహించడం గురించి చెప్పింది ఆ రచన. మానవుని చైతన్యపూరితమైన కార్యాచరణ ఫలితంగా భౌతిక వాస్తవంలో మానవ పాత్ర వ్యక్తీకరణ అతిశయిస్తుందన్నది చె అభిప్రాయం. చె తన సిద్ధాంతాన్ని ఆరంభించడం లోను, కాలం చెల్లిన పెట్టుబడిదారీ విధానం స్థానంలో ప్రత్యామ్నాయ నూతన సమాజపు బృహత్తర నిర్మాణాత్మక మార్పులకు నిబద్ధుడవడం లోను మార్క్స్ చెప్పిన నియమాలను అనుసరించాడు.

ఆ దృక్పథాన్ని అనుసరించి చె వివరించిన అభిప్రాయాలను కొనసాగించి మరింత ప్రగాఢం చేయవలసిన అవసరం అర్థమవుతుంది. చరిత్ర జ్ఞాపకాల నుండి చూసినట్లయితే, ఆ మార్గం అన్ని పరివర్తనా క్రమాల మాదిరిగానే పురోగమన, తిరోగమనాలతో తెనుకపట్లతో ఉంటుంది. ప్రధాన అంశాలను విడనాడకుండా అది ముందుకు సాగుతూ ఉంటుంది. ఇప్పుడు మనముందున్నది మరింత పెద్ద కర్తవ్యం. దీని కేంద్ర స్థానం మానవుడే. మానవుడు తనను తాను మార్చుకొని, మిగతా మొత్తాన్ని మార్చాలి.

మరింత ఉన్నత స్థాయిలో మార్గాలను, సాధ్యమయ్యే పరిష్కారాలను కనుగొనాలి. అది ఎంత కష్టతరంగా కనిపించినప్పటికీ ఈ పరివర్తనా క్రమంలో మానవులే ప్రధాన పాత్రధారులు, వారు ప్రతిమలను తయారు చేసే మెత్తని మట్టిలా ఒదిగి పోవాలి. అయితే ఇది చైతన్యరహితంగా జరిగేది కాదు. మొత్తం మార్పుకు అవసరమైన సాధనాలుగా ఉన్న యంత్రాంగాల అంతర్గత నియమాల పరిజ్ఞానంతో జరిగే కృషి. ఇది ఎంతో సంక్లిష్టమైన, అధిక శక్తిని వినియోగించవలసిన కర్తవ్యం. తక్షణ శక్తిసామర్థ్యాలకు అనేక రెట్లు దీనికి అవసరమవుతాయి. అయితే ఈ నూతన మానవుని సృష్టించే కర్తవ్యం అందరూ కలిసి నిర్వహించాల్సినది.

చె నిరంతర మార్గమైన నూతన మానవుని సృష్టి, ఒక పరాధీన, వెనుకబడిన దేశమైన క్యూబాలో మాదిరిగా అలాంటి ఇతర దేశాలలో కూడ సోషలిజం సాధన సాధ్యమేనని చెప్పడంలోనే మునిగిపోలేదు. ప్రపంచంలో అత్యంత ప్రతికూల పరిస్థితులు కలిగిన దేశాలలోని ప్రజానీకం గురవుతున్న దోపిడీ, వారి దయనీయమైన పరిస్థితి నుండి చె తన దృష్టిని మళ్ళించలేదు. 'తృతీయ ప్రపంచం' అని చెప్పబడుతున్న ఈ దేశాలు మేల్కొని నిజమైన మార్పు కోసం పోరాడటం ఇప్పుడు చె కు ఒక నూతన లక్ష్యంగా మారింది. ఆ దేశాల ప్రజానీకం చైతన్యవంతమై ఆ లక్ష్యాన్ని సాధించే

మార్గాలను తెలుసుకున్ననాడు, వారి మధ్య ఐక్యతను పెంపొందించుకున్న నాడు విజయానికి నిజమైన అవకాశాలు ఉంటాయని ఆయన భావించాడు. అది అంత తేలికైన మార్గం కాదు. అయినప్పటికీ దాని సాధనవైపుకు అడుగులు వేసే అవకాశం ఉంది. అయితే, దీని కోసం సంబంధిత శక్తులు అనివార్యమైన ఫలితాన్ని అంచనా వేసుకొని ఒక నూతన ఆధిపత్య శక్తిని ప్రతిష్ఠించుకోవాలి. ఈ అభిప్రాయాన్ని చె అల్జీర్స్‌లో వ్యక్తం చేశాడు, కాంగోలో ప్రయోగాత్మకంగా పరిశీలించాడు, బలీవియాలో దాన్ని అమలు చేశాడు. చివరికి అక్కడే ఆయన హత్యకు గురయ్యాడు. అలా హత్యకు గురయ్యే పరిస్థితులు ఉన్నప్పటికీ ఆయన ఆ మార్గాన్నే అనుసరించాడు. మెరుగైన ప్రపంచం కోసం, తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకోగలిగిన నూతన స్త్రీ, పురుషులను తయారు చేసేందుకు బీజాన్ని నాటింది ఆ మార్గం.

చె చివరి సూత్రీకరణల సారాంశం ఇది. దీన్నే 'ట్రైకాంటినెంటల్‌కు సందేశం' లో చె పొందుపరిచాడు. ఆ రోజుల్లో అత్యంత క్రూరమైన పోరాటానికి ప్రాతినిధ్యం వహిస్తున్న యుద్ధానికి, అదే సమయంలో సంపూర్ణ విమోచన కోసం, గౌరవం కోసం పోరాటానికి సంసిద్ధులైన ప్రజలను ఏకం చేసే పోరాటానికి ప్రతిస్పందనగా ఈ అభిప్రాయాలను వెల్లడించాడు.

మానవ జాతి గురైన చారిత్రక వెనుకపట్టు అత్యంత విచారకరం. అదే సమయంలో దీనికి కొనసాగింపుగా చె లాంటి వ్యక్తుల పట్ల, వారు చెప్పిన సూత్రీకరణల పట్ల నిబద్ధత పైన దాడి చేస్తున్నారు. చాల మంది ఆ సూత్రీకరణలను నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ చె ఆలోచనల శక్తి, ఆయన కార్యాచరణ శక్తి ఆ సూత్రీకరణలను నూతన పరిస్థితుల్లో ఒక విడదీయరాని అంతర్భాగం చేసింది. చె రచనల ప్రాధాన్యతను అర్థం చేసుకొని, తిరిగి దాన్ని వివరించడానికి పూనుకోవడానికి ఇదే తగిన కారణం. ఇవి రెండు కూడ పరస్పర పూరకాలు. అవి చె ఆలోచనలు. పోరాటం గురించి, దాని విజయం గురించి చెప్పడానికి రాయబడినవి. దీనిలో వివిధ కోణాల్లో మానవుడు కేంద్రంగా ఉంటాడు. మానసిక అభివృద్ధి వైపుకు అన్ని ప్రయత్నాలు లక్షించబడతాయి. ఐక్యత, సమగ్రతల దృష్టిలో చూసినపుడు ఇది ఒక ఆరంభం, అవకాశమున్న నిజమైన మార్గానికి కొనసాగింపు. ప్రపంచపు అంచుల్లోని దేశాలన్నింటితో కూడిన అత్యంత ప్రభావవంతమైన శక్తి. చె మాటలనే వినియోగిస్తే, ఇది విముక్తి సాధించుకోవాలన్న ఆకాంక్షను నిర్మించేది. భవిష్యత్తును వీక్షించకలిగిన యుద్ధాన్ని, విజయాన్ని ప్రతిధ్వనించే పొలికేక.

# పరిచయం

ఐజాజ్ అహ్మద్

**'మానవత్వమే
మా మాతృభూమి'
- జోస్ మార్టి**

***'21వ శతాబ్ది మానవులను
మనం తయారు చేయాలి.
మనమే తయారు చేయాలి'.
- చె గువేరా***

ఈ సంకలనంలో ఎర్నెస్టో చె గువేరా (1928–1967) రచించిన రెండు ప్రధాన రచనలు మీ ముందుకు వస్తున్నాయి. చెగువేరా జీవితమంతా భవిష్యత్తు గురించిన ఆశలు, అంచనాలు, కలలతో కూడింది. పెట్టుబడి సామ్రాజ్యం నిర్మించిన ప్రపంచానికి వ్యతిరేకంగా పోరాడిన నిరంతర విప్లవకారుడు చెగువెరా. ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చటం కోసం పోరాడిన సైనికుడు. నేడు మనం జీవిస్తున్న ప్రపంచం కంటే పూర్తిగా భిన్నమైన ప్రపంచంలో జీవించినవాడు కావటంతో చె గువేరా రచనలు అర్థం చేసుకోవటం కాస్తంత కష్టంగానే ఉంటుంది. చె గువేరా జీవించిన కాలంలో ప్రపంచంలో మూడోవంతు మానవాళి సోషలిస్టు దేశాల్లో నివశిస్తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు, సోషలిస్టు వ్యవస్థకు మధ్య విశ్వవ్యాప్త వ్యవస్థాగత వైరుధ్యం దైనందిన జీవితంలో కనిపించేది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాల్లో జాతీయ

విముక్తి పోరాటాల విస్ఫోటనం కొనసాగుతున్న సమయం అది. సామ్రాజ్యవాద వ్యతిరేక ధీరోధాత్త పోరాటాల దశగా మనం దీన్ని చెప్పొచ్చు. ఆ దశలో విప్లవాత్మక జాతీయవాదానికీ, కమ్యూనిజానికీ మధ్య ఉన్న అవినాభావ సంబంధం కోట్లాదిమంది ప్రజలకు తేలిగ్గా అర్థమవుతుంది. ఈ రకంగా చూసినపుడు చె గువేరా రచనలు విప్లవాత్మకమైన గతం నుండి విప్లవాత్మకమైన భవిష్యత్తులోకి విసిరేసిన సీసాలో పెట్టిన సందేశాల్లాంటివి. వాటిని మనం మధ్యలో పట్టుకుని తెరిచి చదువుతున్నట్లుంది.

చె గువేరా సామ్రాజ్యవాదుల, దాని తొత్తుల చేతిలో హత్యగావించబడే నాటికి ఆయన వయసు 39 సంవత్సరాలు. ఆయన జీవితాన్ని చదువుతుంటే వాయువేగంతో అనేక జీవితాలు ఒకదాని తర్వాత ఒకటిగా సినిమా రీల్ లాగా మారిపోతున్నట్లే అనిపిస్తుంది. సుశిక్షితుడైన వైద్యుడు. వైద్య విద్యార్థిగా ఉన్న సమయంలోనే యావత్ లాటిన్ అమెరికా దేశాలను చుట్టేసి వచ్చాడు. పుట్టుక రీత్యా అర్జెంటీనా వాసి. 1954లో గ్వాటిమాలా ప్రయాణంలోనే తొలిసారి మార్క్సిజాన్ని ఓ అభ్యాసంగా చదివాడు. అక్కడే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేబూనాడు. ప్రగతిశీల అర్బెంజ్ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు సిఐఎ సాయుధ బలగాలు పన్నిన కుట్రకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో చె గువేరా తొలిసారి ఆయుధమెత్తాడు. తర్వాత మెక్సికో పారిపోయాడు. అక్కడే ఫైడల్ కాస్ట్రోను కలిశాడు. ఫైడెల్ నమ్మకాన్ని సంపాదించి క్యూబా విప్లవానికి జీవితాన్ని అంకితం చేశాడు. ప్రవాసంలో ఉన్న విప్లవకారులకు సేవలందించే వైద్యుడిగా ఆ బృందంతో జట్టుకట్టిన చె అతి తక్కువ సమయంలోనే తిరుగుబాటు సైన్యంలో కీలకమైన కమాండర్ స్థాయికి ఎదిగాడు. తర్వాత ఓ ఇతిహాస యోధుడుగా, గెరిల్లా యుద్ధ కళా సిద్ధాంతవేత్తగా ఎదిగాడు.

విప్లవానంతరం క్యూబా ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రిగా, జాతీయ బ్యాంకులకు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాడు. ఈ బాధ్యతలతో పాటు యూరోపియన్, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో క్యూబా రాయబారిగానూ, అల్జీర్స్ మొదలు న్యూయార్క్ వరకు అంతర్జాతీయ వేదికల్లో క్యూబా అధికారిక ప్రతినిధిగానూ వ్యవహరించాడు. ఈ పర్యటనల్లో కొన్ని బహిరంగంగా జరిగిన అధికార పర్యటనలైతే మరికొన్ని రహస్య పర్యటనలు. అధికారిక పర్యటనల్లో దౌత్య వాణిజ్య చర్చలు నిర్వహించాడు. సోవియట్ యూనియన్‌తో పాటు ఇతర సోషలిస్టు దేశాలతో బహుముఖ ఒప్పందాలు ఖరారు చేశాడు. రహస్యంగా సాగిన పర్యటనల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బహుముఖరంగాల్లో పోరాటాలు నిర్మించే దిశగా చర్చలు, సమన్వయం చేశాడు. ఈ రహస్య పర్యటనల్లో అత్యంత సాహసోపేతమైనదీ, చివరిదీ బొలీవియా విప్లవం కోసం సాగించిన చర్చలు. బొలీవియా తర్వాత ఈ విప్లవ జ్వాల అర్జెంటీనాను



ఆవహించాలన్నది వ్యూహం. ఈ వ్యూహం ప్రమాదకరమైనదిగా రుజువైంది. చె నాయకత్వం వహిస్తున్న గెరిల్లా దళాన్ని సిఐఎ నాయకత్వంలోని బలీవియా సేనలు చుట్టుముట్టాయి. చె ను బందీగా పట్టుకున్నాయి.

విప్లవకార్యాచరణ వాదిగా సంచలనాత్మకమైన జీవితాన్ని గడిపిన చె గువేరా విలువైన మేధోవారసత్వాన్ని కూడా మనకు అందిచాడు. ఈ మేధో కృషిలో ఎక్కువ భాగం ఇంకా స్పానిష్ బాష నుండి ఇతర భాషల్లోకి తర్జుమా కానేలేదు. ఈ సంకలనంలో పొందుపర్చిన రెండు రచనలు చెగువేరా మేధస్సుకు, దక్షతకు దర్పణం పడతాయి. ఈ  రెండు రచనలు నిర్ధిష్ట ప్రయోజనాన్ని ఆశించి చేసిన రచనలు. అందువల్ల ఆయా పరిమితులకు లోబడే ఉంటాయి. అయినప్పటికీ ఈ రెండు రచనల్లో ఆయన వ్యక్తం చేసిన భావాలు దీర్ఘకాలంగా చె లో రూపుదిద్దుకుంటున్న మేధోమధనానికి వ్యక్తీకరణలుగా నిలుస్తాయి. ఈ వ్యాసాల్లో ప్రస్తావించిన అనేక

భావనలు అంతకు ముందు 'తిరుగుబాటు సైన్యపు సామాజిక ఆదర్శాలు' (1959) 'విప్లవ వైద్యుడు (1960), 'యువ కమ్యూనిస్టు కావాలంటే' (1962) వంటి అనేక రచనలు, ఉపన్యాసాల్లో అడపాదడపా ప్రస్తావిస్తూ వచ్చాడు.

ట్రైకాంటినెంటల్‌కు సందేశం గురించి ముందుగా చర్చిద్దాం. మొదటిసారిగా ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా ప్రజల ప్రథమ సంఘీభావ మహాసభకు క్యూబా ఆతిథ్యమిచ్చింది. ఈ మూడు ఖండాల తొలి మహాసభ 1966 జనవరి 3–15 తేదీల్లో జరిగింది. ఈ మహాసభకు 82 దేశాల నుండి 512 మంది ప్రతినిధులు, 270 మంది అతిథులు హాజరయ్యారు. ఈ మహాసభ చివరి రోజున అంటే 1966 జనవరి 15న ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల సంఘీభావ సభ జరిగింది. ఈ సంస్థ ట్రైకాంటినెంటల్ బులిటెన్‌ను ప్రచురించింది. ఈ బులెటిన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రజలదగ్గరకు చేర్చింది. ట్రైకాంటినెంటల్ అనే ద్వైమాస సైద్ధాంతిక పత్రిక వర్ధమాన దేశాలకు చెందిన సామ్రాజ్యవాద వ్యతిరేక మేధావుల రచనలతో వెలువడింది.

మొరాకోకు చెందిన మెహ్ది బెన్ బర్కా సామ్రాజ్యవాద వ్యతిరేక వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న మార్క్సిస్టు మేధావి. మొదటి ట్రైకాంటినెంటల్ మహాసభ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు. ఈ వేదిక ప్రాధాన్యతను గురించి ఆయన ఇలా వివరించాడు: "హవానాలో జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక మహాసభ చారిత్ర ప్రాధాన్యత కలిగినది. ఈ మహాసభ ప్రపంచంలోని రెండు అతి పెద్ద విప్లవ స్రవంతులైన అక్టోబరు విప్లవ స్రవంతి, మూడో ప్రపంచ దేశాల జాతీయ విముక్తి విప్లవాల స్రవంతులను ఏకతాటిమీదకు తీసుకు వచ్చే వేదిక. ఈ రెండు స్రవంతులకు చెందిన విప్లవం విజయవంతమైన క్యూబాలో ఈ మహాసభ జరగటం కూడా ఈ వేదికకు వన్నె తెచ్చే పరిణామం." ఈ సంకలనం రూపంలో మీ ముందుకు వస్తున్న చె గువేరా రెండు రచనలను సమకాలీన కమ్యూనిజం–సామ్రాజ్యవాద వ్యతిరేక ధోరణుల మధ్య ఉన్న గతితార్కిక సంబంధాన్ని అర్థం చేసుకుని చదివితేనే వాటి లోతు అవగతమవుతుంది.

హవానాలో ఈ మహాసభ జరుగుతున్న సమయంలో చె ఆఫ్రికా దేశాల్లో విప్లవ సంఘీభావం ప్రకటించటంతో పాటు ప్రత్యక్షంగా యుద్ధక్షేత్రంలో మునిగి ఉన్నాడు. ఇది మహాసభతో పాటు 1967 ఏప్రిల్ 16 నాటి పత్రిక ప్రారంభ సంచికకు ఉద్దేశించినది కూడ. ఆ సంచికలో చే దీనికి "రెండు, మూడు .... అనేక వియత్నాంలను సృష్టించాలి, అదే నేటి అవసరం" అన్న శీర్షిక పెట్టాడు. మార్చ్ (పదండి ముందుకు) అనే చారిత్రక ఉరుగ్వే పత్రిక 1965 మార్చి సంచికకు 'సోషలిజం – క్యూబా ప్రజలు'

అన్న మరో శీర్షికతో వ్యాసం రాశాడు. ట్రైకాంటినెంటల్‌కు సందేశం అన్న శీర్షికతో రాసిన వ్యాసంలో పెట్టుబడి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విశ్వవ్యాప్త సాయుధ పోరాటానికి పిలుపునిస్తూ : "సామ్రాజ్యవాదం ఓ విశ్వవ్యాపిత వ్యవస్థ. పెట్టుబడిదారీ విధానపు చరమాంకం. దాన్ని విశ్వవ్యాప్తంగానే ఓడించాలి. నిజమైన కార్మికవర్గ అంతర్జాతీయతను మనం అభివృద్ధి చేయాలి. అంతర్జాతీయ కార్మికవర్గపు సైన్యాన్ని సిద్ధం చేయాలి" అన్నాడు. 'సోషలిజం – క్యూబా ప్రజలు' అన్న మరో వ్యాసం ఓ రకంగా క్యూబా విప్లవ గమనాన్ని వివరించే వ్యాసం. ఒక మేరకు కమ్యూనిజం అంటే కేవలం ఉత్పత్తి విధానం, వర్గ సంబంధాలు ఉన్నత దశకు తీసుకెళ్లే వ్యవస్థ మాత్రమే కాదనీ, మానవాళి సర్వతోముఖాభివృద్ధికి పునాదులు వేసే వ్యవస్థ కూడా అని చెప్పాడు. "పరాయీకరించబడిన మనిషి తనను తాను స్వంతం చేసుకోవటం, తనను తాను స్వంతం చేసుకోవటమే అంతిమ లక్ష్యం, తుది గమ్యం. ప్రతి వ్యక్తి సంపూర్ణ చైతన్యంతో తనను తాను ఓ సామాజిక అస్తిత్వంగా గుర్తించుకుంటాడు. అంటే ప్రతి మనిషీ తనను పరాయీకరించే బంధనాలు తెగ్గొట్టుకున్నపుడపు తాను సంపూర్ణ మానవునిగా పరివర్తన చెందుతాడు. ఈ ప్రయత్నం విముక్తి పొందిన శ్రమ శక్తి ద్వారా మనిషి తన సహజ స్వభావాన్ని తిరిగి స్వంతం చేసుకోవటంగా ఆచరణలో పరివర్తన చెందుతుంది." అని చెబుతాడు. ఈ వ్యాసంలో కొన్ని పేరాగ్రాఫ్‌లు చదువుతుంటే 1844 నాటి మార్క్స్ రాతప్రతులను తిరిగి రాస్తున్నాడా అనిపిస్తుంది. అయితే చే రచనలకు ఓ తక్షణ నేపథ్యం ఉంది. అదే క్యూబా విప్లవం తీరు తెన్నులు, గమనాగమనాలు. ప్రపంచ వ్యాప్తంగా పురివిప్పుకుంటున్న విప్లవోద్యమాలకు క్యూబా విప్లవం నేర్పే పాఠాలే చె రచనలకు ఉన్న తక్షణ నేపథ్యం.

'ట్రైకాంటినెంటల్‌కు సందేశం' అన్న వ్యాసంలో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1945 నుండి దాదాపు రెండు దశాబ్దాల పాటు ప్రపంచంలో నెలకొన్న శాంతియుత వాతావరణం గురించి చర్చిస్తూ అన్యాపదేశంగానే శాంతియుత సహజీవనం అన్న సిద్ధాంతాన్ని తూర్పారపడతాడు. అమెరికా, రష్యా అగ్రరాజ్యాల మధ్య ప్రత్యక్ష యుద్ధం జరగలేదన్న వాస్తవాన్ని గుర్తిస్తూనే రెండు అగ్రరాజ్యాల మధ్య యుద్ధం జరగకపోవటం అంటే 'శాంతి' సుస్థిరమైనట్లేనా, దాన్నే 'శాంతియుత సహజీవనం'గా భావించాలా అన్న ప్రశ్న లేవనెత్తుతాడు. అంతేకాదు. సామ్రాజ్యవాదంతో శాంతియుత సహజీవనం సాధ్యమా అన్న ప్రశ్నను కూడా లేవనెత్తుతాడు. సామ్రాజ్యవాదం తనంతట తాను ప్రపంచ వ్యాప్తంగా నిరంతర యుద్ధంలో మునిగితేలుతున్న శక్తి కాదా అని ప్రశ్నిస్తాడు. అందుకే తన సందేశాన్ని రెండో ప్రపంచ యుద్ధం ముగిసీ ముగియగానే మొదలైన కొరియన్ యుద్ధం గురించిన

చర్చతో మొదలు పెడుతూ "ప్రతిష్ట కోల్పోయిన ఐక్యరాజ్యసమితి నీడలో అమెరికా నాయకత్వంలో డజన్ల కొద్దీ దేశాల సైన్యం కొరియన్ యుద్ధంలో పాల్గొన్నది" అని గుర్తు చేస్తాడు. కొరియన్ యుద్ధంలో అమెరికా దాదాపు 20 లక్షల మంది సైన్యాన్ని మోహరించింది. 6,35,000 టన్నుల బాంబుల వర్షం కురిపించింది. అందులో 32,557 టన్నులు అత్యంత ప్రమాదకరమైన నాపాం బాంబులు. వియత్నాం యుద్ధం గురించి ప్రస్తావిస్తూ ఏకకాలంలో మూడు ఖండాల నుండి మూడు సామ్రాజ్యవాద శక్తులైన అమెరికా, జపాన్, ఫ్రాన్స్‌లను ఎదుర్కొని వియత్నాం వీరోచిత పోరాటాన్ని సాగించిందని గుర్తు చేస్తాడు. రెండో ప్రపంచ యుద్ధంలో అన్ని దేశాలూ కలిపి ప్రయోగించిన బాంబుల బరువు కంటే వియత్నాం విముక్తి పోరాటంలో అమెరికా ప్రయోగించిన బాంబుల బరువు ఎక్కువ. 'ఇండో చైనా ద్వీపకల్పం, దాని చుట్టుపక్కల ఉన్న కొరియా, వియత్నాం వంటి దేశాలే తాజా వైరుధ్యాలకు కేంద్ర బిందువుగా ఉన్నాయన్న వాస్తవాన్ని గుర్తు చేయటంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పీడిత ప్రజలపై రెండో ప్రపంచ యుద్ధానంతరం అమెరికా దాష్టీకం కొనసాగుతూనే ఉన్న విషయాన్ని కూడా చర్చకు పెడతాడు. అగ్రరాజ్యాలు శాంతియుత సహజీవనం కొనసాగిస్తున్న సమయంలోనే అమెరికా దాదాపు అన్ని వర్ధమాన దేశాల సార్వభౌమతాన్ని మంటగలిపే రీతిలో మోహరించబడుతున్న సామ్రాజ్యవాదపు విశ్వవ్యాపిత యుద్ధతంత్రం మూడో ప్రపంచ యుద్ధాన్ని తలపిస్తోందని స్పష్టం చేస్తాడు.

ఈ వాదన పరోక్షంగానే అయినా నాటి సోషలిస్టు దేశాలపైనా, వియత్నాం యుద్ధంలో సోషలిస్టు దేశాలు అరకొరగా సాయం అందించటానికే పరిమితం కావటంపైనా విమర్శే. వియత్నాంలో సామ్రాజ్యవాదులు సాగిస్తున్న యుద్ధం మధ్యలో చైనా, రష్యాల మధ్య తలెత్తిన విబేధాలు తీవ్రమైన పర్యవసానాలకు దారితీయనున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తాడు. ఈ దిశగా సంధించిన తొలి విమర్శలో ఒక దేశం పేరు ప్రస్తావించకుండా అందరినీ విమర్శించాడు. 'దురాక్రమణకు గురవుతున్న దేశం విజయం సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేయటం మంచిదే. కానీ అటువంటి విజయం సాధించే ప్రయత్నంలో దురాక్రమణకు బలవుతున్న వారితో భుజం భుజం కలిపి చావుకైనా సిద్ధపడి నడవాలి" అంటూ కర్తవ్యబోధ చేస్తాడు. ఈ ప్రతిపాదనను ఆయన ఈ కింది విధంగా మరింత విపులీకరించాడు: "అమెరికా సామ్రాజ్యవాదం దురాక్రమణదారుగా నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాదం సాగిస్తున్న మారణకాండ, ఘోరకలి మాటలకందనిది. ఈ విషయాలన్నీ మనకు తెలిసినవే మిత్రులారా. అయితే అవకాశం వచ్చినప్పుడు వియత్నాంను సోషలిస్టు ప్రపంచంలో అంతర్భాగంగా మార్చుకునే ప్రయత్నం చేయని

వారు కూడా దోషులే అవుతారు. ఆయా దేశాలు నిర్దిష్ట సమయంలో వియత్నాంకు పూర్తిస్థాయి బాసటగా నిలిస్తే మరో ప్రపంచ స్థాయి యుద్ధం జరిగితే జరిగి ఉండేదేమో. అటువంటి దుస్థితికి సామ్రాజ్యవాదాన్ని నెట్టేసే అవకాశాన్ని కూడా మనం కోల్పోయాము. పరస్పరం దూషణలకు దిగిన సోషలిస్టు శిబిరంలోని రెండు అగ్ర దేశాల ప్రతినిధులు కూడా దోషులే అన్నది నిస్సందేహం."

ఈ వివాదాల నడుమ వియత్నాం ఏకాకి అయ్యిందా కాలేదా? కీచులాడుకుంటున్న రెండు సోషలిస్టు దేశాల మధ్య సమాన దూరం పాటించే దుస్థితికి వియత్నాం నెట్టబడిందా లేదా? అన్న ప్రశ్నలకు మనం నిజాయితీగా సమాధానాలు వెదకాలి.

కీచులాడుకుంటున్న శక్తివంతమైన దేశాలు అన్నపుడు సోవియట్ రష్యా, జన చైనాల గురించే చే గువేరా ప్రస్తావిస్తున్నాడన్నది సుస్పష్టమే. చైనా రష్యాల మధ్య మొదలైన ఈ కీచులాట అంతిమంగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి చేటు తెచ్చింది. ఇటువంటి అభిప్రాయం ఉన్న వాళ్లల్లో చే ఒక్కడే కాదు. హవానా విశ్వవిద్యాలయం మెట్ల మీద నిలబడి మాట్లాడుతూ ఫైడెల్ కాస్ట్రో కూడా 1965లో ఇలా అన్నాడు:

**"....సామ్రాజ్యవాద శక్తుల దాడి ఉత్తర వియత్నాంకు విస్తరించిన సమయంలో కూడా సోషలిస్టు శిబిరంలోని కీచులాటలను ముగింపుకు తేలేకపోయారు. సోషలిస్టు దేశాల మధ్య ఉన్న ఈ విబేధాలు సామ్రాజ్యవాదులను మరింతగా ప్రోత్సహించేవిగా ఉన్నాయన్న విషయం ఎవరికి తెలియనిది? సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా సోషలిస్టు దేశాలు ఐక్య సంఘటన కట్టి ఉంటే సామ్రాజ్యవాద దేశాలు వెనకంజ వేసి ఉండేవనే విషయంలో ఎవ్వరికీ సందేహం లేదు. అటువంటి ఐక్య సంఘటన కట్టి ఉంటే సామ్రాజ్యవాద శక్తులు దాడిగి దిగబోయే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించి అడుగేసేవి. ఇతర దేశాల్లో బరితెగించి అడుగు పెట్టడానికి కూడా వెనకాడేవి కాదా?"**

**అమెరికా సామ్రాజ్యవాదపు దాడికి కూతవేటు దూరంలో క్యూబా ఉన్నదన్న విషయం తెలిసి కూడా చె, కాస్ట్రోలు తమ సోదర సోషలిస్టు దేశాలు అనుసరిస్తున్న విధానాలను విమర్శించటం సోషలిస్టు సంఘీభావానికి తూట్లు పొడవటం కాదని బలంగా నమ్మారు కాబట్టే ఈ స్థాయిలో విమర్శ చేయగలిగారు.**

**దురాగతాలకు బలవుతున్న వారి పట్ల సంఘీభావం ప్రదర్శించటం అంటే కేవలం సానుభూతి వ్యక్తం చేయటం మాత్రమే కాదు. భుజం భుజం కలిపి పోరాడటం కూడా. వియత్నాంను కాపాడుకోవాలన్నా, సామ్రాజ్యవాద శక్తులను విశ్వవ్యాప్తంగా మట్టి కరిపించాలన్నా సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా ఐక్య సంఘటన అనివార్యం**

**అన్న ఈ ఆలోచనా ధోరణే ట్రైకాంటినెంటల్ పత్రికకు రాసిన సందేశంలో 'రెండు, మూడు... మరెన్నో వియత్నాంలను ప్రారంభించాలి' అని పిలుపునివ్వటం వెనక ఉన్న ప్రాథమిక అవగాహన. ట్రైకాంటినెంటల్ మహాసభ, అది ఏర్పాటు చేసిన వ్యవస్థల లక్ష్యం, ఉద్దేశ్యం అదే. ఈ మూడు ఖండాల్లో సహకారం, సమన్వయంతో కూడిన సాయుధ విప్లవ పోరాటాలు నిర్మించటం ద్వారా సామ్రాజ్యవాదపు శక్తి సామర్థ్యాలు ఒకచోట కేంద్రీకృతమయ్యే అవకాశం లేకుండా చేసి దానిపై పైచేయి సాధించి, అది మోయలేనంత ఆర్థిక నష్టానికి గురి చేయటమే ట్రైకాంటినెంటల్ మహాసభ పిలుపు వెనక ఉన్న ఉద్దేశ్యం. ఇదేమీ ఆషామాషీ వ్యవహారం అనుకునేందుకు ఏ మాత్రం అవకాశం లేదు. ఈ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట కేంద్రాలు** 'గణనీయమైన ప్రాణనష్టం, అనేక ఇక్కట్లకు గురవుతాయి' అన్న అంచనాలో ఏ రకమైన పొరపాటూ లేదు. ఇటువంటి అభిప్రాయాలు చే గువేరా ఒక్కడివే అనుకోవటానికి కూడా వీల్లేదు. ట్రైకాంటినెంటల్ మహాసభ ముగింపు ఉపన్యాసంలో కాస్ట్రో కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ 'క్యూబా విప్లవకారుల దృష్టిలో ప్రపంచమంతా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట కేంద్రమే. ప్రపంచంలో ఏ మూల ఎవరు విప్లవోద్యమాన్ని నిర్మించాలనుకున్నా క్యూబా వారికి అండగా ఉంటుందని వారు భరోసాగా ఉండొచ్చు. హవానా ప్రకటన చెప్పినట్లుగా ప్రతి విప్లవకారుని కర్తవ్యం విప్లవ క్రమాన్ని పురోగమింపచేయటమే. మనసా వాచా కర్మణా విప్లవ క్రమంలో భాగస్వాములు కావటమే.' అని చెప్పాడు.

అటువంటి సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ పోరాట కేంద్రాన్ని ప్రారంభించటానికి బలీవియా వెళ్లబోయే ముందు చే గువేరా పూర్తి చేసిన రచన అది. తన లక్ష్యాలు, నమ్మకాల కోసం జీవితాన్ని పణంగా పెడుతున్నానని తెలిసీ మొదలు పెట్టిన ప్రయాణం అది. ఈ కింది వాక్యాలు చదువుతుంటే ఆయన తన కంటిముందున్న చావును ఆహ్వానిస్తూ, నవ్వుతూ దాని వైపు అడుగులేస్తున్నట్లుగా కనిపిస్తుంది :

"ఏదో ఒక రోజు ఏదో ఒక దేశంలో మనం తుది శ్వాస విడవాల్సి వచ్చినప్పుడు, మన మాతృభూమిగా మారిపోయిన ఆ దేశంలో మనం రక్త తర్పణం గావించినప్పుడు ఒక్క విషయాన్ని మాత్రం దృష్టిలో ఉంచుకునే ఆ పని చేయాలి. మన కార్యాచరణ లోతుపాతులను, పరిధినీ మనం అంచనా వేసుకుని, మహోన్నత కార్మికవర్గ సైన్యంలో చిన్న పరమాణవులుగా మాత్రమే భావించుకుంటూ ఆ పని చేస్తాము...మా ప్రతి అడుగు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వేసే పొలికేకే. మానవాళిని కబళించనున్న సామ్రాజ్యవాద మహమ్మారికీ, అమెరికాకూ వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యం చేసే



యుద్ధ గీతమే. చావు ఏ మూల నుండి వచ్చి మనలను ఆశ్చర్యంలో ముంచెత్తాలని ప్రయత్నించినా మనం స్వాగతిద్దాం. అయితే షరతు ఒక్కటే. మన ఈ యుద్ధ గీతం కనీసం కొంతమందికైనా చేరేలా చూసుకుందాం. మన చేతిలోని ఆయుధం జారిపోకుండా పట్టుకోవటానికి మరో చేయి ముందుకొచ్చే వరకు జాగ్రత్త తీసుకుందాం. మరో మనిషి మరఫిరంగుల మోత నడుమ యుద్ధం, విజయం కోసం సరికొత్త యుద్ధ నగరాలు మోగిస్తూ మన శవపేటికను మోయటానికి భుజమందించే మరో మనిషి దొరికేలా చూసుకుందాం."

చె రాసిన 'సోషలిజం – క్యూబా ప్రజలు' అన్న మరో రచనలో క్యూబన్ విప్లవ రూపకల్పనకు సంబంధించిన కొన్ని వివరాలు తొలిపేజీల్లో ప్రస్తావిస్తాడు. మిగిలిన విషయాలన్నీ విప్లవ కార్యక్రమానికి కేంద్రకమైన అంశాలుగాచే భావించిన అంశాలకు సంబంధించిన విశ్లేషణలే. కమ్యూనిజం గురించిన విశ్లేషణలే. అంతకు

పూర్వం రాసిన మరికొన్ని రచనల్లో క్యూబా విప్లవానికీ, మార్క్సిజానికీ మధ్య ఉన్న సంబంధం గురించి ఆసక్తికరమైన విశ్లేషణ చేస్తాడు. ఉదాహరణకు 'లాటిన్ అమెరికా తొలి యువజన మహాసభ'లో ఇచ్చిన ఉపన్యాసంలో ఇలా పేర్కొన్నాడు:

"... ఈ విప్లవం మార్క్సిస్టు విప్లవం అయితే – జాగ్రత్తగా వినండి నేను మార్క్సిస్టు అని సంబోధిస్తున్నాను – ఈ విప్లవం తన స్వంత పద్ధతుల్లో మార్క్స్ చెప్పిన మార్గాన్ని ఎంచుకుంది... ఈ రోజు మనం మార్క్సిజాన్ని ఆచరణలో పెడుతున్నామంటే, ఆ సిద్ధాంతాన్ని మనం ఇక్కడే కనుగొన్నాము...ఆ రోజల్లో ... మావో సేటుంగ్ రాసిన ఓ చిన్న కరపత్రం మన చేతికి చిక్కింది...అప్పటికే గెరిల్లా వ్యూహాలు, ఎత్తుగడల గురించి ప్రపంచానికి ఆవలి వైపున వెలువడిన రచనల గురించి తెలియకుండానే మనం ఇక్కడ అవే పద్ధతులను నియంతృత్వానికి వ్యతిరేకంగా జరుపుతున్న ప్రజా పోరాటంలో అమలు చేస్తున్నాం."

'క్యూబా విప్లవం – దాని సిద్దాంతం గురించిన నోట్స్' అన్న మరో రచనలో ఆయన ఇలా పేర్కొన్నాడు:

"ఆచరణవాదులుగా విప్లవకారులమైన మేము శాస్త్రజ్ఞుడైన మార్క్స్ దర్శించిన చలన సూత్రాలను అమలు చేస్తూ మా పోరాటాన్ని నడుపుతున్నాము. తిరుగుబాటు పథాన ప్రయాణం ప్రారంభించిన మేము అనుభవాలకనుగుణంగా సర్దుబాటు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాము... నాయకులు ఏమి చెప్పారు, వారికి మార్క్సిస్టు సూత్రాల గురించి సైద్ధాంతికంగా ఏమి తెలుసు అన్నదాంతో నిమిత్తం లేకుండా క్యూబా విప్లవ గమనంలో మార్క్సిజం చలన సూత్రాలు ఉన్నాయి."

అద్భుతమైన వాక్యాలు ఇవి. చె, ఫైడెల్, వారి సహచరులు ఆచరణాత్మక విప్లవకారులు. వీరు విప్లవ పథంలో అడుగుపెట్టినప్పుడు, గెరిల్లా దళాలను సమీకరిస్తున్న సమయంలో మార్క్స్ ప్రతిపాదించిన కార్మికవర్గ విప్లవ సిద్ధాంతం గురించో మావో ప్రతిపాదించిన గెరిల్లా యుద్ధ తంత్రం గురించో తెలిసి గెరిల్లా యుద్ధం ప్రారంభించిన వాళ్లు కాదు. కార్మికవర్గ విప్లవం అంటే ఏమిటో తెలిసిన వాళ్లు కూడా కాదు. దీనికి భిన్నంగా విప్లవ కార్యాచరణే మార్క్సిస్టు సిద్ధాంతపు వస్తుగత వాస్తవికతను వ్యక్తీకరించేదిగా ఉంది. 'సోషలిజం – క్యూబా ప్రజలు' అన్న రచనలో పాశ్చాత్య దేశాల్లో మార్క్సిజం, కేవలం అభివృద్ది చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో అన్ని అవకాశాలూ ఆవిరయ్యాక మాత్రమే విప్లవం సాధ్యమన్న అవగాహన పరిధిని మించి ముందుకు రాకుండా, పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గత వైరుధ్యాలను విశ్లేషించటానికే తమ శక్తియుక్తులను వెచ్చించటాన్ని చే విమర్శిస్తాడు. దీనికి భిన్నంగా సామ్రాజ్యవాదం గురించి రూపొందించిన సిద్దాంతంతో లెనిన్ ఈ వాదనను తిప్పికొట్టాడు. సామ్రాజ్యవాదపు గొలుసులో బలహీనమైన లింకును తెగ్గొట్టడం ద్వారా విప్లవం

సాధించవచ్చనీ, అంటే భావి విప్లవాలన్నీ అణచివేతకు గురైన దేశాల్లోనే సంభవించనున్నాయని అంచనా వేశారు. అటువంటపుడు అత్యంత వెనకబడిన పేద దేశమైన క్యూబా విప్లవాన్ని సాధిస్తే సోషలిస్టు ప్రాథమిక సంచయం సూత్రాన్ని అమలు చేయటం ద్వారా పాశ్చాత్య దేశాలను అందుకోవాలా? ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణం ప్రారంబించాలా?

ఈ వ్యాసంలో చె ప్రతిపాదించినట్లుగా మూడు ఖండాల్లో విప్లవాలు వేతన కార్మికుడు ఆధారంగానే పురోగించాలి. పారిశ్రామికాభివృద్ధి, భౌతిక సంపదలు ప్రాథమిక స్థాయిలో ఉన్న సమాజాల్లో సైతం గౌరవమైన, హుందాతనంతో కూడిన, ప్రాథమికంగా మంచి ఆరోగ్యకరమైన సమాజాలను నిర్మించవచ్చు : ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలను ఆధునీకరించటం అన్న సాంప్రదాయక అవగాహనతో పాటు ప్రజల ప్రాథమిక భద్రత, మేధోపరమైన అభివృద్ధితో పాటు సోషలిస్టు సంస్కృతిని పెంపొందిచటానికి అనివారమైనవీ, పెట్టుబడిదారీ వ్యవస్థ ధ్వంసం చేసిన మానవ సామర్థ్యాలను మానవత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించటానికీ కృషి చేయాల్సి ఉంటుందని విశ్లేషిస్తాడు. ఈ అవగాహన ప్రకారం సామ్రాజ్యవాదపు అత్యంత క్రూరమైన చర్య ఏమిటంటే మానవుని సహజాతం అనుకునే లక్షణాలు, స్వభావాలన్నింటినీ కుళ్లదీస్తుంది. సమాజాన్ని అణగదొక్కుతుంది. మానవుని సహజాతం ప్రకారం బయటివారిని ఆహ్వానించే లక్షణాన్ని కూడా నులిమేస్తుంది. దీనికి భిన్నంగా తనకు తాను కేంద్రంగా ఉండే, ఇతరుల ప్రయోజనాలతో నిమిత్తం లేకండా స్వార్జితం కోసం ఆరాటపడే వ్యక్తులను తయారు చేస్తూ ప్రపంచాన్ని నానాటికీ పరాయీకరించే ప్రపంచాన్ని నిర్మించటానికి ప్రయత్నం చేస్తుంది. 'కొత్త పురుషుడు, కొత్త మహిళ'ను తయారు చేయడానికి చె గువేరా చెప్తున్న క్రమంలో, పరాయీకరణ చెందని స్వతంత్రుడు విప్లవాత్మక సమాజ నిర్మాణానికి అనివార్యమైన కేంద్రంగా ఉంటాడు. ఈ విషయాన్ని గుర్తించటం సోషలిస్టు సమాజాన్ని నిర్మించటంలో కేంద్రకాంశం. అంతులేని స్థాయిలో జరుగుతున్న సామ్రజ్యావాద హింసను అధిగమించి సమిష్టి అభివృద్ధి దిశగా క్యూబా సోషలిస్టు వ్యవస్థ మనుగడ సాగించటంలో తలెత్తే ప్రశ్నలను అలా ఉంచి ప్రతి మనిషికీ పౌష్టికాహారం, వైద్యం, విద్య వంటి కనీస ప్రాథమిక భౌతిక అవసరాలు తీరకుండా నైతిక సంఘీభావ వ్యక్తీకరణ సామర్థ్యం సమకూరదన్నది చె అవగాహనలో ఓ కోణమైతే అంతర్జాతీయ సంఘీభావాలు, బాధ్యతలు మరో కోణంగా ఉన్నాయి. మరో రకంగా చెప్పాలంటే విప్లవ జాతీయత, అంతర్జాతీయతల మధ్య ఉండే లేదా ఉండాల్సిన గతితార్కిక సంబంధమే చె గువేరా.

# చె గువేరా జీవిత సంగ్రహం

1928 జూన్ 14: అర్జెంటీనాలోని రోసారియాలో జన్మించాడు.

1953 : చర్మవ్యాధి నిపుణుడుగా చె వైద్య విద్యలో పట్టభద్రుడయ్యాడు.

1953–54 జులై: లాటిన్ అమెరికా దేశాలన్నీ పర్యటించిన తరువాత ఆయన 1953లో గ్వాటిమాలా వచ్చాడు. అక్కడ క్యూబా ప్రవాసులను కలిశాడు. వారు ఆయన పేరుకు ముందు 'చె' పేరు తగిలించారు. అక్కడ ఆయన అమెరికా గూఢచారి సంస్థ సిఐఎ సహకారంతో జాకోబో ఆర్బెంజ్ ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి జరిగిన కుట్రను చూశాడు.

1955 జులై: ఆయన ఫైడల్ కాస్ట్రోను కలుసుకున్నాడు. క్యూబాలో ఫుల్జెన్సియో బాటిస్టా నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగే 26 జులై ఉద్యమంలో పాల్గనాలని నిర్ణయించుకున్నాడు.

1956 నవంబర్ 25: ఫైడల్ కాస్ట్రో నాయకత్వంలో చె గువేరా మరో 81 మంది విప్లవకారులు "గ్రాన్మా" అనే పడవ ఎక్కి క్యూబాకు పయనమయ్యారు. క్యూబాలోని సియ్రా మీస్ట్రా పర్వతాల్లో గెరిల్లా పోరాటం ప్రారంభించడానికి వారు అక్కడికి వెళ్లారు.


1957 జులై 21: చె గువేరాను కమాండర్‌గా ప్రమోట్ చేశారు. ఆయన "సిరో రెడోన్డో" 8వ దళానికి నాయకత్వం వహించాలి.

1958 ఫిబ్రవరి 24: చె గువేరా ఏర్పాటు చేసిన "రేడియో రిబెల్డే" తొలి ప్రసారం.

1958 డిసెంబర్ 29–31: శాంతా క్లారా పోరాటానికి చే నాయకత్వం వహించాడు. బాటిస్టా ప్రభుత్వాన్ని ఇది తుది దెబ్బ కొట్టింది.

1959 జనవరి 3: విప్లవం విజయం సాధించడంతో చె ఆ రోజు తెల్లవారు ఝామునే హవానా చేరుకున్నాడు. లా కాబనా లోని సైనిక స్థావరాన్ని ఆక్రమించే పనిని ఆయకు కాస్ట్రో అప్పగించాడు.

1959 జూన్ 12: చె నాయకత్వంలోని ఒక ప్రతినిధి బృందం యునైటెడ్ అరబ్ రిపబ్లిక్, భారత్, ఇండోనేషియా, శ్రీలంక, యుగోస్లోవియా, మ్యాన్మార్, జపాన్,



పాకిస్తాన్, సూడాన్, మొరాకోలను సందర్శించి ఆ దేశాలతో వాణిజ్య, సాంస్కృతిక, దౌత్య సంబంధాల అభివృద్ధికి ప్రయత్నించింది.

1959 అక్టోబర్ 7: క్యూబాలోని భూసంస్కరణల సంస్థకు చెందిన పారిశ్రామిక విభాగం జాతీయ అధ్యక్షుడిగా చె గువేరాను నియమించారు.

1959 నవంబర్ 26: బ్యాంక్ ఆఫ్ క్యూబా అధ్యక్షుడిగా చే ను నియమించారు.

1961 ఫిబ్రవరి 23: ఆయనను పారిశ్రామిక శాఖ మంత్రిగా నియమించారు.

1964 డిసెంబర్ 11: ఐక్యరాజ్య సమితి సర్వ సభ్య సమావేశంలో చే ప్రసంగించాడు.

1965 మార్చి–జనవరి: చైనా, మాలి, కాంగో, గునియా, ఘనా, దహోమే, టాంజానియా, ఈజిప్టు, ఆల్జీరియా దేశాల్లో పర్యటించి ప్రభుత్వాధినేతలను, జాతీయ విముక్తి పోరాట నాయకులను కలుసుకున్నాడు.

1965 ఫిబ్రవరి 24: ఆల్జీరియాలో జరిగిన రెండవ ఆఫ్రోఆసియా సౌహార్ద్ర సదస్సులో చె ప్రసంగించాడు.

1965 ఏప్రిల్ 1: చే రహస్యంగా క్యూబాను వదిలిపెట్టి కాంగో వెళ్లాడు. అక్కడ విప్లవ పోరాటం చేస్తున్న లారెంట్ కబిలా గెరిల్లా దళంలో చేరాడు.

1965 నవంబర్ 21: కాంగోలో దాదాపు ఏడు మాసాలు గడిపిన తరువాత వెళ్లిన కార్యక్రమం విఫలమైంది. దాంతో చె రహస్యంగా టాంజానియా చేరుకున్నాడు. అక్కడ అనేక వారాలు గడిపాడు. అక్కడి నుండి డిసెంబర్‌లో జెకోస్లోవేకియా వెళ్లాడు. అక్కడ అనేక మాసాల పాటు రహస్యంగా గడిపాడు.

1966 నవంబర్ 3: చె బొలీవియాలోని నాంకాహుజు ప్రాంతంలో సాయుధ పోరాటంలో పాల్గొనేందుకు అక్కడకు చేరుకున్నాడు.

1867 అక్టోబర్ 8: బొలీవియా సైన్యంతో జరిగిన పోరాటంలో ఆయన పట్టుబడ్డాడు. అమెరికన్ సిఐఎ సలహాతో ఆయనను క్వెబ్రాడా డెల్ యురో వద్ద నిర్బంధంలో పెట్టారు.

1967 అక్టోబర్ 9: లా హిగెయెరా పట్టణంలోని ఒక చిన్న పాఠశాలలో మధ్యాహ్నం 1.30 గం॥కు చె గువేరాను సర్జెంట్ మారియో టెరన్ హత్య చేశాడు.

# ట్రైకాంటినెంటల్ కు చెగువేరా సందేశం (1967)

*ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా ఖండాల(ట్రైకాంటినెంటల్) దేశాల ప్రజల సంఘీభావ మహాసభ,. 1967 ఏప్రిల్ 16న హవానాలో తొలిసారి ప్రచురించిన ప్రతి నుండి*

*నిప్పుల కొలిమి*
*రగిలించే సమయం.*
*కొలిమి నుండి వచ్చే*
*మంటనే మనం చూడాలి*
**– జోస్ మార్టి**

ప్రపంచ యుద్ధం ముగిసి 21 ఏళ్లవుతోంది. ఈ సందర్భంగా సాధ్యమైనన్ని భాషల్లో అనేక రచనలు, విశ్లేషణలు, వ్యాఖ్యానాలు వచ్చాయి. ఈ ప్రచురణలన్నీ జపాన్ ఓటమి సందర్భంగా ఉత్సవాలు జరుపుకునేవిగా ఉన్నాయి. ప్రపంచం వేర్వేరు శిబిరాలుగా చీలిపోయి ఉంది. ఎవరి శిబిరంలో వారు ఆశావహమైన వాతావరణంలో ఉన్నారు.

నిరంతరం కొనసాగుతున్న హింసాత్మక ఘర్షణలు, అనూహ్యమైన మార్పుల నడుమ 21 ఏళ్ల పాటు ప్రపంచస్థాయి యుద్ధం లేకుండా మనం జీవించగలగటం గొప్ప విషయమే. అయితే ఆచరణలో ఈ శాంతి పర్యవసానాలు ఏమిటన్నది విశ్లేషించుకోకపోతే (పేదరికం, పతనం, విశాల ప్రజానీకంపై నానాటికీ పెరుగుతున్న దోపిడీ తీవ్రతల నడుమ) ఈ శాంతి నిజమైనదేనా కాదా అన్నది తేల్చుకోలేము. ఈ సామాజిక దుర్లక్షణాలకు వ్యతిరేకంగానే పోరాటాడటానికి మనమంతా సమాయత్తమయ్యాము.

జపాన్ లొంగిపోయిన తర్వాత ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో చెలరేగుతున్న స్థానిక ఘర్షణల గురించో, శాంతియుతమైనదిగా చెప్పబడుతున్న ఈ కాలంలో నానాటికీ పెరుగుతున్న అంతర్యుద్ధం గురించో చర్చించటం నా ఉద్దేశ్యం కాదు. కొరియా, వియత్నాం యుద్ధాలను గుర్తు తెచ్చుకుంటే మనకు ఉందనుకుంటున్న ఆశావహ జీవితం ఎంత నిరాధారమైనదో స్పష్టమవుతుంది.

కొరియాలో సుదీర్ఘకాలం కొనసాగిన క్రూరమైన యుద్ధం ద్వారా ఆధునిక

యుద్ధ తంత్రచరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఆ దేశపు ఉత్తర భాగం దుంపనాశనమైంది. దేశమంతా బాంబులమయంగా మారింది. పరిశ్రమలు లేవు. పాఠశాలలు లేవు. లక్షలాదిమందికి నిలువ నీడ లేకుండా పోయింది.

నిర్వీర్యంగా మారిన ఐక్యరాజ్యసమితి పతాకం నీడన డజన్ల కొద్దీ దేశాలు అమెరికా సైనిక నాయకత్వంలో ఈ యుద్ధంలో పాల్గొన్నాయి. అమెరికా సైనికులతోపాటు దక్షిణ కొరియా పౌరులు కూడా ఈ యుద్ధంలో సామ్రాజ్యవాదుల తుపాకులకు తూటాలుగా మారారు. మరోవైపున (ఉత్తర) కొరియా ప్రజలు, జన చైనా నుండి వచ్చిన స్వచ్ఛంద సైనికులు, సోవియట్ యూనియన్ సరఫరా చేసిన ఆయుధాలతో మాతృభూమి పరిరక్షణకై ప్రాణాలొడ్డి యుద్ధ రంగంలో నిలిచారు. అమెరికా అన్ని రకాల మారణాయుధాలను కొరియా ఉత్తర భూభాగంపై ప్రయోగించింది. పరీక్షించింది. ఈ యుద్ధంలో అణ్వాయుధాలు మినహా ఏదో ఒక మోతాదులో జీవరసాయన, బాక్టీరియా సంబంధిత ఆయుధాలన్నిటినీ ప్రయోగించారు.

హిరోషిమా, నాగసాకిల మీద అమెరికా ప్రయోగించిన అణుబాంబులతో జపాన్ నిట్టనిలువునా కుప్పకూలింది. ఇండోచైనా ప్రాంతంలో పరాజయం పాలైన ఫ్రాన్స్ ఇప్పుడిప్పుడే కోలుకొంటోంది. ఈ యుద్ధంలో చివరి దశలో రంగ ప్రవేశం చేసింది అమెరికా. ఈ మూడు సామ్రాజ్యవాద దేశాల నుండి నిరవధిక దాడులనెదుర్కొంటూ వియత్నాం దేశభక్తులు పురోగమిస్తున్నారు.

ప్రపంచమంతటా చెదురుమదురు ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. అమెరికా ఖండంలో మాత్రం విముక్తి ఉద్యమాలు తప్పటడుగులు వేస్తున్నాయి. సైనిక కుట్రల తెరలు తొలగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ రాజకీయ వ్యూహంలో ఈ ప్రాంతపు ప్రాధాన్యతను మరింత పెంచిన క్యూబా విప్లవం సామ్రాజ్యవాద శక్తులకు మృత్యుఘంటికలా వినిపిస్తోంది. క్యూబా విప్లవం విజయతవంతం కావటం సామ్రాజ్యవాదులకు మింగుడుపడని అంశంగా మారింది. ప్లయా గిరోన్ సంక్షోభం సందర్భంలోనూ, క్షిపణి సంక్షోభం సమయంలోనూ క్యూబా తన సరిహద్దులను తానే కాపాడుకోవటానికి సిద్ధపడింది.

క్యూబా సమస్యపై రెండు అగ్ర రాజ్యాలయిన సోవియట్, అమెరికాల మధ్య వినాశకర యుద్ధానికి దారిసే అవకాశం ఉన్న సంఘటనగా క్షిపణి సంక్షోభం నిలిచింది.

కానీ అప్పటికి ఇండోచైనా, దాని పరిసర ప్రాంతాలు సామ్రాజ్యవాదం – సోషలిస్టు శిబిరం మధ్య ఉన్న వైరుధ్యాలకు కేంద్రంగా మారింది. అంతర్యుద్ధం పర్యవసానంగానే లావోస్, వియత్నాం దేశాలు ఉనికిలోకి వచ్చాయి. కానీ ఈ అంతర్యుద్ధంలోకి సకల శక్తియుక్తులూ కూడదీసుకుని అమెరికా చొరబడటంతో

అంతర్యుద్ధం స్వభావం మారిపోయింది. దాంతో ఈ ప్రాంతం కాస్తా అత్యంత ప్రమాదకరమైన విస్ఫోటన కేంద్రంగా తయారైంది.

వియత్నాంలో ఈ వైరుధ్యాలు ప్రత్యేక లక్షణాలు సంతరించుకున్నాయి. వియత్నాం యుద్ధ చరిత్రను వర్ణించటం మా ఉద్దేశ్యం కాదు. కానీ కొన్ని మైలురాళ్లను మాత్రం మనం గుర్తించాలి.

దీన్ బీన్ ఫూ ప్రభుత్వం 1954లో అవమానకరమైన ఓటమిని చవిచూడటంతో దేశాన్ని రెండు భాగాలుగా విభజించి 18 నెలల్లోగా ఎన్నికలు జరపటానికి అంగీకరిస్తూ జెనీవాలో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంపై అమెరికా సంతకం చేయలేదు. ఫ్రెంచి ప్రభుత్వానికి తొత్తుగా ఉన్న బావో దాయిని తన వ్యూహంలో పావుగా ప్రయోగించటానికి సిద్ధమైంది అమెరికా. ఈ మాయోపాయాలు, కుయుక్తులు చివరకు ఎన్గో దిన్ దియామ్ దుర్ఘటనకు దారితీశాయి. ఈ ప్రాంతంలో జరిగిన యుద్ధంలో సామ్రాజ్యవాదానికి చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనైంది.

ఈ ఒప్పందం తర్వాత ప్రజాతంత్ర శక్తులు నూతనోత్తేజాన్ని పొందాయి. దక్షిణ వియత్నాంలో ఫ్రాన్స్ స్వాధీనంలో ఉన్న చివరి స్థావరాలు కూడా ప్రజల వశమయ్యాయి. జెనీవా ఒప్పందం అమలవుతుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూడనారంభించారు. అయితే ఎన్నికల్లో నయానో భయానో అమెరికాకు నచ్చిన ఏజెంట్‌ను ఎన్నుకునేందుకు పరిస్థితులు అనుకూలించకపోతే జెనీవా ఒప్పందం ప్రకారం ఎన్నికలు జరిగే అవకాశం లేదని గుర్తించటానికి దేశభక్తులకు ఎంతో కాలం పట్టలేదు. దాంతో మరోసారి దక్షిణ వియత్నాంలో చెదురుమదురుగా మొదలైన సాయుధ ఘర్షణలు అనతికాలంలోనే పూర్తి స్థాయి సాయుధ పోరాటం రూపం తీసుకున్నాయి. ప్రస్తుతానికి వియత్నాంలో షుమారు ఐదు లక్షలకు పైగా అమెరికా బలగాలు మోహరించి ఉన్నాయి. స్థానిక ఏజెంట్ల బలగాలు నానాటికీ తిరోగమన బాటలో ఉండి, పోరాటపటిమ కోల్పోయాయి.

రెండేళ్ల క్రితం దక్షిణ వియత్నాంపై తన ఆధిపత్యాన్ని సుస్థాపితం చేసుకుని చర్చలకు లొంగదీసుకునే లక్ష్యంతో ప్రజాతంత్ర గణతంత్ర వియత్నాంపై అమెరికా ఓ వ్యూహం ప్రకారం బాంబుదాడులకు పాల్పడింది. మొదట్లో చెదురుమదురుగా సాగించిన విధ్వంసక బాంబుదాడుల తర్వాత ఉత్తర వియత్నాం రెచ్చగొట్టుడు చర్యలకు ప్రతిస్పందనగా దాడి చేస్తున్నామంటూ బరితెగించింది. తర్వాతి కాలంలో ఈ దాడుల ఉధృతి మరింత పెరిగింది. రోజురోజుకూ అమెరికా వాయుసేనలు వియత్నాం గగనతలాన్ని ఆక్రమించుకోనారంభించాయి. ఈ దాడులన్నింటి లక్ష్యం ఒక్కటే. ఉత్తర వియత్నాం ప్రాంతంలో నాగరికతను నాశనం చేయటం. ఈ దాడులు అత్యంత



ఫైడల్ కాస్ట్రోతో చె గువెరా

ప్రమాదకరమైనవనటంలో సందేహం లేదు.

వియత్నాం ప్రజలు అమెరికాకు చెందిన 1700 పైగా యుద్ధ విమానాలను నేల కూల్చాయి. పోరాటంలో నిమగ్నమై ఉన్న వియత్నాం ప్రజాతంత్ర శక్తులకు సోషలిస్టు దేశాల నుండి సహాయ సహకారాలు ఏదో ఒక మోతాదులో అంతున్నాయి. అయినప్పటికీ పొగరుబోతు అమెరికా తను ఎంచుకున్న భౌతిక లక్ష్యాన్ని ఎంతో కొంత మేరకు సాధించుకుంది.

వీటన్నింటి నడుమ దాగిఉన్న ఓ చేదు నిజాన్ని మనం గుర్తించాలి. అంగీకరించాలి. ప్రపంచ వ్యాప్తంగా అణగారిన ప్రజలకు ఆశాజ్యోతిగా ఉన్న వియత్నాం ఈ పోరాటంలో మాత్రం ఒంటరిగానే మిగిలిపోయింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అమెరికా దాడిని తట్టుకుని నిలబడుతుందని ఆశిద్దాం. అక్కడక్కడా దక్షిణాది ప్రాంతాల నుండి ప్రతిఘటన దాడులు లేకుండా ఉండటం విశేషమే అయినా ఉత్తర తీర ప్రాంతాల్లో మాత్రం ప్రజాతంత్ర శక్తులు ఒంటరిగా పోరాడుతున్నాయి.

పోరాడుతున్న వియత్నాం ప్రజలకు ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తమవుతున్న సంఘీభావాన్ని గమనిస్తే మధ్యయగాల నాటి రోమ్‌లో మల్లయుద్ధంలో పాల్గొనే యోధులను ఉత్సాహపరుస్తూ చప్పట్లు కొట్టే సందర్భం గుర్తుకొస్తుంది. వియత్నాం దురాక్రమణకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటంలో విజయం సాధించాలని

ఆశించటం మాత్రమే కాదు. వారి భవిష్యత్తు గురించిన ఆందోళనే మనది. ప్రాణాలొడ్డి పోరాడేవారితో పాటు మృత్యుద్వారం వద్ద కూడా తోడుండే వాళ్లు నేటి అవసరం.

వియత్నాం ప్రజల ఒంటరితనాన్ని విశ్లేషించినప్పుడు మానవాళి అచేతనత్వం పట్ల ఆగ్రహం కలగకమానదు.

అమెరికా దురాక్రమణదారన్నది నిర్వివాదం. అమెరికా ప్రపంచ వ్యాప్తంగా ఘోరమైన నేరాలకు పాల్పడుతోంది. అవన్నీ మనకు తెలిసిన విషయాలే సోదరులారా. అయితే ఈ విషయంలో మన పొరపాట్లు కూడా ఉన్నాయి. సోషలిస్టు ప్రపంచంలో వియత్నాం కూడా అంతర్భాగంగా మారేందుకు సానుకూల పరిస్థితులు ముందుకొచ్చినప్పటికీ అందుకు మనం సిద్ధం కాకపోవటంతో సామ్రాజ్యవాద దాడికి నేడు వియత్నాం బలయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. అయితే సోషలిస్టు శిబిరం పూర్తి స్థాయిలో వియత్నాంకు అనుకూలంగా మొహరిస్తే మరో ప్రపంచ స్థాయి యుద్ధానికి తెరతీస్తుందనటంలో సందేహం లేదు. కేవలం విమర్శలకు పరిమితమైన వారికి కూడా తప్పులో భాగం ఉంది. సోషలిస్టు శిబిరంలోని రెండు పక్షాలూ కొంత కాలంగా ఈ దూషణభూషణలతో కాలం వెళ్లబుచ్చుతున్నాయి.

ఈ సమయంలో మనం ఓ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది. వియత్నాం ఒంటరిపాటైందా లేదా అన్నది ఈ ప్రశ్న. సోషలిస్టు శిబిరంలోని రెండు ప్రధాన శక్తుల మధ్య సమతూకం పాటించే ప్రయత్నంలో వియత్నాం అనేక కష్టనష్టాలకు లోనవుతోందన్నది వాస్తవమా కాదా అన్నది మరో ప్రశ్న.

వీళ్లు ఎంత గొప్పవారు. అసమాన ధైర్యసాహసాలు కలిగిన వారు. ఈ పోరాటంలో ప్రపంచం నేర్చుకోవాల్సిన పాఠాలేమున్నాయి? అమెరికా అధ్యక్షుడు జాన్సన్ సమీప భవిష్యత్తులో అమెరికా ప్రజలు ఆశిస్తున్న సంస్కరణల్లో కొన్నింటినైనా అమలు చేస్తాడా లేదా చూడాలి. నానాటికీ ఉధృతమవుతున్న ముళ్లతీగ లాంటి వైరుధ్యాలను అధిగమించే చర్యలు చేపడతాడా లేదా అన్నది కూడా తెలుసుకోవటానికి వేచి చూడాలి. మహోన్నత సమాజం అంటూ కీర్తించటానికి గాను అమెరికా సాధించిన విజయాలన్నీ వియత్నాం జలాల్లో మునిగిపోయాయి. వెనకబాటుతనం, క్షతగాత్రులైన పేదలను చూసినప్పుడే సామ్రాజ్యవాదం విజయగర్వంతో విర్రవీగుతుంది. విశాలమైన సైన్యాలు యుద్ధరంగంలోకి పరుగు తీస్తాయి. హత్యలు గుత్తాధిపతుల చేతిలో సాధనాలవుతున్నాయి. వారిని ఎదుర్కొంటున్న ఈ మహోన్నత సైనికులకు చాలీ చాలని ఆత్మరక్షణ సాధనాలే రక్షణ కవచాలుగా ఉన్నాయి. మాతృభూమి, సమాజం పట్ల ప్రేమ, అనుపమాన ధైర్యసాహసాలే వారి అస్త్రశస్త్రాలు. ఈ కొద్దిపాటి సాధనాలతోనే పోరాడుతున్న వియత్నాం ప్రజల చేతుల్లో సామ్రాజ్యవాదం చావుదెబ్బ

తింటోంది. తాను సృష్టించిన సంక్షోభం నుండి గౌరవంగా బయటపడేందుకు మార్గాలు వెదుకుతోంది. దక్షిణ వియత్నాం ప్రతిపాదించిన ఐదు అంశాలు, ఉత్తర వియత్నాం ప్రతిపాదించిన నాలుగు అంశాలు కూడా సామ్రాజ్యవాద శక్తులను కటకటాల వెనక నిలబెడుతున్నాయి. ఈ ఘర్షణ మరింత నిర్ణయాత్మక దశకు చేరుకోబోతోంది.

అనిశ్చితమైన అశాశ్వతమైన శాంతి వచనాలు కేవలం ఈ వియత్నాం యుద్ధం ప్రపంచ స్థాయి యుద్ధంగా మారకుండా చూసే ప్రవచనాలే తప్ప వియత్నాం ప్రజలకు విముక్తి ప్రసాదించే ప్రతిపాదనలు కాదు. ఈ తరహా శాంతి సూత్రాలను అమెరికా ఏ రోజైనా ఎడమ కాలితో తన్నేసి ముందుకు పోగలదు.

ఈ పరిస్థితుల్లో దోపిడీకి బలవుతున్న విశ్వమానవుడు పోషించాల్సిన పాత్ర ఏమిటి? మూడు ఖండాల ప్రజలు వియత్నాం పరిణామాలను జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. పాఠాలు నేర్వాలి. యుద్ధం అన్నది సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలకు చూపించే బూచి. అందువల్ల యుద్ధం అనగానే భయాందోళనలకు లోనుకావటం తెలివైన స్పందన కాదు. ఘర్షణ జరుగుతున్న అన్ని ప్రాంతాల్లోనూ, కోణాల్లోనూ ప్రజలు సాయుధులై తిరగబడటమే సార్వత్రిక ఎత్తుగడగా ఉండాలి.

నామమాత్రపు శాంతియుత పరిస్థితులను కూడా చిద్రం చేస్తున్నపుడు మన కర్తవ్యం ఏమిటి? ఎంతటి మూల్యమైనా చెల్లించి మనల్ని మనం విముక్తి చేసుకోవాలి.

విశ్వదృశ్యం అత్యంత సంక్లిష్టమైనది. పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలను వినియోగించే స్థాయికి అభివృద్ధి చెందినప్పటికీ ప్రాచీన యూరోపియన్ దేశాల్లో అనేక దేశాలు నేటికీ తిరుగుబాటు బాట పట్టలేదు. ఈ దేశాలు తమంతట తాము స్వతంత్ర అభివృద్ధి పంథాను ఎంచుకునే స్థాయిలో లేవు. సామ్రాజ్యవాద పంథాలో పయనించే సాహసం కూడా చేయలేని దేశాలుగా మిగిలాయి. రానున్న కాలంలో ఈ దేశాల్లోని వైరుధ్యాలు పతాక స్థాయికి చేరనున్నాయి. అయితే ఆయా దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారమార్గాలు వర్ధమాన దేశాలు, వెనకబడిన దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలకు, ఈ దేశాలు ఎంచుకోబోయే పరిష్కారాలకు పూర్తిగా భిన్నమైనవి.

లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాలే ప్రధానంగా సామ్రాజ్యవాద దోపిడీకి బలైన ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ దేశాల్లో దేనికదే ప్రత్యేక లక్షణాలు కలిగి ఉన్నాయి. అదేసమయంలో మూడు దేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి కారణాలు విషయంలో ఉమ్మడి లక్షణాలు కలిగి ఉన్నాయి.

లాటిన్ అమెరికా దేశాలు కుడిఎడంగా ఒకే స్వరూప స్వభావాలు కలిగిన దేశాల చేతుల్లో బందీలుగా ఉన్నాయి. లాటిన్ అమెరికా దేశాలపై అమెరికా

గుత్తపెట్టుబడిదారులు సంపూర్ణ ఆధిపత్యాన్ని చలాయిస్తున్నారు. కీలుబొమ్మ ప్రభుత్వాలు లేదా అత్యంత బలహీనులైన పాలకులు గద్దెలనెక్కి ఉన్నారు. మోతుబరి దుండగీడు పాత్రలో ఉన్న అమెరికా ఆదేశాలను కనీసం ప్రశ్నించే సాహసం కూడా చేయలేని ప్రభుత్వాలు పరిపాలన సాగిస్తున్నాయి. అమెరికా సామ్రాజ్యవాదపు విస్తరణ ఆర్థికంగానూ, భౌగోళికంగానూ పరాకాష్టకు చేరింది. ఆక్రమించుకోవటానికి ఏమీ మిగల్లేదు. నేడున్న పరిస్థితుల్లో ఏ రకమైన మార్పులు చోటు చేసుకున్నా అవి అమెరికా సామ్రాజ్యవాదానికి నష్టదాయకమైనవే తప్ప ఉపయోగపడేవి కాబోవు. ఈ రోజుకు అమెరికాకు తన స్వాధీనంలో ఉన్న ప్రాంతాలు, దేశాలపై పెత్తనాన్ని కొనసాగించటమే ప్రధాన కర్తవ్యంగా ఉంది. ఆక్రమిత దేశాల్లో తలెత్తే విముక్తి ఉద్యమాలను బలప్రయోగంతో అణచివేయటమే అమెరికాకు కీలక కార్యాచరణగా మారింది. ఈ విముక్తి ఉద్యమాలు ఏ స్వరూపస్వభావాలు కలిగినవన్నదాంతో పట్టింపు లేదు.

మరో క్యూబాను అంగీకరించబోము అన్న నినాదం మాటున ప్రతిఘటనతో నిమిత్తం లేకుండా ఏ దేశంలో ఆకులు కదలాడినా విచ్చలవిడిగా మారణకాండకు దిగుతోంది. డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన పరిణామాలు కానీ పనామా నరమేధం కానీ ఈ విషయాన్నే రుజువు చేస్తున్నాయి. లాటిన్ అమెరికాలో ఏ దేశంలో అమెరికాకు బంటుగా ఉన్న ప్రభుత్వాన్ని గద్దె దించే ప్రయత్నం జరిగినా, తన ఆర్థిక భౌగోళిక ప్రయోజనాలకు విఘాతం కలిగే పరిస్థితులు తలెత్తినా సాయుధమై ప్రత్యక్షంగా రంగంలోకి దిగటానికి వెనకాడనని పదేపదే గుర్తు చేస్తోంది అమెరికా. ఈ దుందుడుకు విధానం నిర్నిరోధంగా ముందుకు సాగుతోంది. అమెరికా దేశాల సంస్థ (ఓఏఎస్) దీనికి ఓ ముసుగుగా మారింది. లాటిన్ అమెరికా దేశాల ప్రజలపై విరుచుకుపడేందుకు పాలకవర్గాలు సాయుధమై సన్నద్ధంగా ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి నిర్వీర్యమవటం అత్యంత విషాదఘటనగా మిగిలిపోతుంది. నేరాలు ఘోరాలు సాగించేందుకు ఓ అంతర్జాతీయ సంస్థనే నెలకొల్పారా అన్న సందేహం వచ్చే స్థాయికి పరిస్థితులు దిగజారాయి. మరోవైపున దేశీయ బూర్జువా వర్గం సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించలేని దుస్థితికి దిగజారిపోయింది. ఒకవేళ ఒకటీ అరా దేశంలో అటువంటి పరిస్థితి తలెత్తితే ఆయా దేశాల బూర్జువావర్గ నాయకుల చరిత్ర నాటితో ముగింపుకు వస్తుంది. సోషలిజం సాధనకు గానీ, కంటితుడుపు విప్లవాలకు కానీ అవకాశాలు అడుగంటాయి.

ఆసియా విశాలమైన వైవిధ్యభరిత లక్షణాలు కలిగిన ఖండం. యూరోపియన్ వలస పాలకులకు వ్యతిరేకంగా సాగిన విముక్తి ఉద్యమాల నేపథ్యంలో స్థూలంగా ప్రగతిశీల ప్రభుత్వాలను గద్దెనెక్కించాయి. ఆయా దేశాల్లో జాతీయ విముక్తి ఉద్యమాల ప్రాథమిక కర్తవ్యాలను నెరవేర్చే సాధనాలుగా ఈ ప్రభుత్వాలు కాలక్రమంలో

రూపొందాయి. దాంతో ఈ దేశాల్లో పాలకులు సామ్రాజ్యవాద అనుకూల విధానాలు చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది.

ఆర్థికంగా చూసినప్పుడు అమెరికాకు ఈ విముక్తి ఉద్యమాలు విజయవంతం కావటం ద్వారా జరిగే నష్టం కంటే లాభమే ఎక్కువగా ఉంది. వేర్వేరు వలసాధిపత్య దేశాల పాలనకు అంతం పలకటం అమెరికాకే ప్రయోజనకరంగా మారింది. దాంతో ఆ విధంగా విముక్తి పొందిన అనేక దేశాల్లో నేరుగా కాని, ఉదాహరణకు జపాన్ వంటి దేశాల ద్వారా కాని ఆర్థిక వ్యవస్థలో అమెరికా నేరుగా జోక్యం చేసుకునేందుకు పరిస్థితులు అనుకూలిస్తున్నాయి.

ఇండోచైనా ప్రాంతంలో రాజకీయ పరిస్థితులు భిన్నమైనవి. ఈ ప్రాంతం అటు పెట్టుబడి ప్రయోజనాల రీత్యానూ మరోవైపున అమెరికా సైనిక వ్యూహాల రీత్యానూ ప్రాధాన్యత కలిగిన ప్రాంతంగా మారింది.


థాయలాండ్, దక్షిణ వియత్నాం, తైవాన్, దక్షిణ కొరియాల ద్వారా సోషలిస్టు చైనాను దిగ్బంధనం చేయాలన్నది సామ్రాజ్యవాదుల వ్యూహం.

వియత్నాం యుద్ధ క్షేత్రం వెలుపల ఉన్న దేశాల్లో సుస్థిరత నెలకొన్నప్పటికీ జనచైనా చుట్టూ సైనిక వలయం నిర్మించటం, ఈ దేశాల మార్కెట్‌పై ఆధిపత్యం సంపాదించటమనే ద్వంద్వ వ్యూహాలు అమెరికాను పురిగొల్పుతున్నాయి.

పశ్చిమాసియా భౌగోళికంగా ఆసియాలో అంతర్భాగమే అయినప్పటికీ ఆ ప్రాంతం తనదైన ప్రత్యేక వైరుధ్యాలతో నిప్పుల కొలిమిగా మారుతోంది. సామ్రాజ్యవాదుల దన్నుతో ఈ ప్రాంతంలో ఇజ్రాయెల్‌కు, ఇతర పురోగామి దృక్పథం కలిగిన దేశాలకు మధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం ఏ స్థాయికి చేరుతుందో, ఏ దిశగా పయనిస్తుందో అంచనా వేయటం కష్టం. పేలటానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతం లాంటి పరిస్థితులు అక్కడ నెలకొని ఉన్నాయి.

నయా-వలస ఆధిపత్యానికి ఆఫ్రికా ఖండం కొత్త ప్రదేశంగా కనిపిస్తోంది. ఈ వలసాధిపత్య దేశాలు అనేక కారణాల వలన తాము చెలాయిస్తూ వచ్చిన సంపూర్ణాధికారాలను కొంత మేరకు వదులుకోవాల్సి వచ్చింది. నిరంతరం ఇటువంటి మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో వలసవాదం నయా-వలసవాదంగా రూపాంతరం చెందుతోంది. పేరులో మార్పున్నా ఆర్థిక రాజకీయ పర్యవసానాల విషయంలో తేడా ఏమీ లేదు.

ఈ ప్రాంతంలో అమెరికాకు వలసలు లేవు. దాంతో భాగస్వాముల ఆధీన ప్రాంతాలలో జొరబడటానికి ప్రయత్నం చేస్తోంది. అమెరికా వ్యూహాత్మక ప్రణాళికల నేపథ్యంలో ఆఫ్రికా దేశాలను దీర్ఘకాలపు నిల్వగా మార్చుకోవటానికి అమెరికా సిద్ధంగా



ఉందన్నది వాస్తవం. తోటి సామ్రాజ్యవాద శక్తులతో ఘర్షణపడుతూ ప్రస్తుతానికి దక్షిణాఫ్రికా యూనియన్‌లో మాత్రమే గణనీయమైన స్థాయిలో అమెరికా పెట్టుబడులు ఉన్నప్పటికీ, నైజీరియా, కాంగో వంటి దేశాల్లో తొలి అడుగులు వేస్తోంది.

అమెరికాకు చెందిన గుత్తకంపెనీలు అపారమైన లాభాలార్జించే దేశాల్లోనూ, విశాలమైన ముడివనరుల నిల్వలు పోగుపడిన దేశాల్లోనూ ఏ రూపంలోనైనా జోక్యం

చేసుకునేందుకు తనకు సంపూర్ణ హక్కులు అధికారాలు ఉన్నాయని నిరూపించుకోవటం తప్ప ఈ సాయుధ జోక్యానికి తక్షణ నిర్దిష్ట లక్ష్యం ఉన్నట్లు ఏమీ కనిపించటం లేదు. ఈ పరిస్థితులు గమనించినప్పుడు తక్షణమో లేదా సుదీర్ఘకాల ప్రయత్నం తర్వాతనో మానవాళి విముక్తి సాధ్యమన్న మా నమ్మకం మరింత బలోపేతం అవుతోంది.

మన విశ్లేషణ ఆఫ్రికా వరకే పరిమితం చేస్తూ పోర్చుగీసు వలసలుగా ఉన్న గినియా, మొజాంబిక్, అంగోలా వంటి దేశాల్లో పరిణామాలను గమనిస్తే ఈ విముక్తి ప్రయత్నాలు గినియాలో పూర్తిస్తాయిలో జయప్రదం కాగా మిగిలిన దేశాల్లో తరతమ స్థాయిల్లో పురోగమనంలో ఉన్నాయని గమనించవచ్చు. కాంగోలో లుముంబా వారసులకూ, పాత పాలక వర్గానికి ప్రతినిధిగా ఉన్న త్షోంబె వారసులకూ మధ్య ఉన్న వైరుధ్యంలో త్షోంబె వారసులకే పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. త్షోంబె వర్గం తమ ప్రయోజనాలు కాపాడుకోవటానికి గాను సాధ్యమైనంత మేర ప్రజల గొంతులు నొక్కేయటం తాజా ఉదాహరణ.

రొడీషియా సమస్య భిన్నమైనది: అల్పసంఖ్యాకులైన శ్వేతజాతీయులకు అధికారం అప్పగించటానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదం శాయశక్తులా ప్రయత్నం చేసింది. ప్రస్తుతం వారి చేతుల్లోనే అధికారం చట్టవిరుద్ధంగా బందీ అయి ఉంది. బ్రిటిష్ పాలకుల అభిప్రాయంలో దేశంలో ఉన్న వైరుధ్యం అనధికారమైనదే. ఇయాన్ స్మిత్ నాయకత్వంలోని ప్రభుత్వం చర్యలకుపక్రమించే ముందు సామ్రాజ్యవాదులు సాధ్యమైనంత నిస్సిగ్గుగా భేషజాలకు పోయారు. రొడీషియా వైరుధ్యాలను సాధ్యమైనంత నాజూకైన దౌత్య పరిభాష మాటున కప్పిపెట్టటానికి ప్రయత్నం చేశారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు కొన్ని కామన్‌వెల్త్ దేశాల మద్దతు కూడా ఉన్నప్పటికీ ఆఫ్రికాలోని నల్లజాతీయులకు ప్రాతినిధ్యం వహించే శక్తులు తీవ్రంగా విమర్శించాయి. ఈ విధంగా విమర్శించిన దేశాల్లో బ్రిటిష్ సామ్రాజ్యవాదపు ఆర్థిక విధానాలకు ఏజెంట్లుగా ఉన్న దేశాలు కూడా కొన్ని ఉన్నాయి.

రొడీషియాలో విప్లవ శక్తుల ప్రయత్నాలకు ఇరుగుపొరుగు ఆఫ్రికా దేశాలు అండగా నిలిస్తే పరిస్థితులు మరింత తీవ్రరూపం దాలుస్తాయి. ప్రస్తుతానికి ఈ సమస్యలన్నీ కర్ర విరక్కుండా పాము చావకుండా చర్చలు జరిపే ఐక్యరాజ్యసమితి, కామన్‌వెల్త్, ఆఫ్రికా దేశాల సంఘం వంటి వేదికల్లో చర్చలకు పరిమితమయ్యాయి.

ఆఫ్రికాలో చోటుచేసుకుంటున్న సామాజిక, రాజకీయ పరిణామాలు ఆ ప్రాంతంలో విప్లవానికి అనుకూలంగా ఉన్నాయని విశ్వసించలేము. పోర్చుగీసు వలసాధిపత్యానికి వ్యతిరేకంగా జరిగే విముక్తి పోరాటం జయప్రదం కావాలి. కానీ

సమకాలీన సామ్రాజ్యవాద శిబిరంలో పోర్చుగల్ పాత్ర పరిమితమైనదే. విప్లవశక్తుల మధ్య వైరుధ్యం అన్ని రకాల సామ్రాజ్యవాద శక్తులకు మధ్య స్పష్టమైన విభజన రేఖ గీసే స్థాయికి ఈ వైరుధ్యాలు తీవ్రమవుతున్నాయి. అంతమాత్రాన పోర్చుగల్ వలసాధిపత్యంలో ఉన్న ఈ మూడు దేశాల్లో విముక్తి ఉద్యమాన్ని మందగింపచేస్తుందన్న అంచనాకు రావటం పొరపాటవుతుంది.

దక్షిణాఫ్రికాలోనూ, రొడీషియాలోనూ ఉన్న నల్లజాతీయులు తమదైన విప్లవ పథంలో పురోగమిస్తున్నప్పుడు ఆఫ్రికా ఖండంలో కొత్త పొద్దు పొడుస్తుంది. ఏ దేశంలోనైనా అణగారిన ప్రజలు తలెత్తి గౌరవమైన జీవితం కోసం పాలకవర్గాల చేతుల్లో బందీ అయిన తమ హక్కులను గుంజుకోవటానికి ప్రయత్నం చేస్తున్నపుడు కూడా అటువంటి మార్పుకు అవకాశం ఉంటుంది.

ఇప్పటి వరకు ఒకరి తర్వాత మరొకరుగా సైనిక నియంతృత్వాలు గద్దెనెక్కుతున్నాయి. ఓ అధికారుల ముఠా మరో అధికారుల ముఠా స్థానంలో పాలక ముఠాగా మారుతోంది. ఇలా గద్దెనెక్కుతున్న వారంతా తాము అధికారంలో ఉండటానికి సహకరిస్తున్న తెగకు ప్రయోజనాలు సమకూర్చటానికే పరిమితమవుతున్నారు. అయితే ఈ దేశాల్లో చెప్పుకోదగ్గ ప్రజా తిరుగుబాట్లు తలెత్తటం లేదు. కాంగోలో మాత్రం లుముంబా జ్ఞాపకాలతో ఓ ప్రత్యేక సందర్భంలో ఈ ప్రజా వెల్లువ లక్షణాలు కనిపించాయి. ఈ ప్రజా వెల్లువ కూడా గడచిన కొద్ది నెలలుగా బలహీనపడుతోంది.

ఆసియాలో పరిస్థితులు విస్ఫోటనం స్థాయికి చేరుకుంటున్నాయి. సాయుధ ఘర్షణలు, పతాక స్థాయి వైరుధ్యాలు లావోస్ వియత్నాంలకే పరిమితం కాలేదు. కాంబోడియాలో కూడా అటువంటి పరిస్థితులు రూపుదిద్దుకుంటున్నాయి. కాంబోడియాపై ఏ క్షణానైనా అమెరికా దురాక్రమణకు దిగే అవకాశం ఉంది. అదేవిధంగా థాయ్‌లాండ్, మలయా, ఇండొనేషియాల్లో సామ్రాజ్యవాదుల జోక్యం చరమాంకానికి వచ్చిందని భావించలేము. ఇండొనేషియాలో కమ్యూనిస్టు పార్టీని నిర్మూలించి ప్రతీఘాత శక్తులు గద్దెనెక్కాయి. పశ్చిమాసియాలోనూ ఇదే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

లాటిన్ అమెరికాలో గ్వాటిమాలా, కొలంబియా, వెనెజులా, బొలీవియాల్లో సాయుధపోరాటాలు తీవ్రమవుతున్నాయి. బ్రెజిల్‌లో తిరుగుబాటు పొద్దు పొడుస్తోంది. మరికొన్ని దేశాల్లో చెదురుమదురుగా తిరుగుబాటు స్వరాలు వినిపిస్తున్నాయి. అంతలోనే మూగబోతున్నాయి. ఈ ఖండంలోని దేశాల పరిణామాలన్నీ తమను తాము విముక్తి చేసుకోవాలంటే సోషలిస్టు స్వభావం గలిగిన ప్రభుత్వాలను గద్దెనెక్కించటం తప్ప మరో ప్రత్యామ్నాయం లేని స్థితికి చేరుకుంటున్నాయి.


ఈ ప్రాంతంలో మాట్లాడే భాష దాదాపు ఒక్కటే. (బ్రెజిల్‌లో స్పానిషేతర భాష మాట్లాడుతున్నా ఈ రెండు భాషల మధ్య ఉన్న సారూప్యత రీత్యా తేలిగ్గా ప్రజలు అర్థం చేసుకోగలుగుతారు. తమదనే భావనను పెంపొందించుకోగలుగుతారు) ఈ దేశాల్లో ఉన్న వర్గ పొందిక కూడా కుడిఎడంగా ఒకే స్వరూప స్వభావాలు కలిగి ఉంది. ఇతర దేశాల్లో కంటే ఈ ప్రాంతంలోని ప్రజలే అత్యధికంగా అంతర్జాతీయీకరించబడిన అమెరికన్ల లక్షణాలు, అస్తిత్వాలు కలిగి ఉన్నారు. భాష, అలవాట్లు, ఉమ్మడి వలసలుగా ఉండటం వంటి అనేక విషయాలు వీరందరినీ ఏకం చేస్తున్నాయి. మన అమెరికా ప్రాంతంలో దోపిడీ తీవ్రత, దోపిడీకి గురయ్యే ప్రజలు ఎదుర్కొనే సమస్యల తీవ్రత కూడా ఒకే మోతాదులో ఉంటోంది. దాంతో ఈ ప్రాంతంలో తిరుగుబాటు జ్వాలలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

అయితే ఇక్కడ మనకు మనం ఓ ప్రశ్న వేసుకోవాలి : ఈ విప్లవం వర్ధిల్లేది ఎలా ? ఎటువంటి విప్లవం? మన అమెరికా దేశాల్లో ఉన్న సారూప్యతలు, ఏకత్వాల దృష్ట్యా ఈ ప్రాంతంలో జరిగే విప్లవం దక్షిణమెరికా ఖండమంత విశాల స్వభావాన్ని కలిగి ఉంటుందని గత కొంత కాలంగా చెప్తూ వచ్చాము. మానవాళి విముక్తి క్రమంలో జరిగే అనేక పోరాటాలకు వేదికగానుంది.

నేడు మనం చూస్తున్న చెదురుమదురు పోరాటాలు ఖండమంత విస్తీర్ణంలో జరిగే ఈ పోరాటంలో కేవలం కొన్ని అంకాలు మాత్రమే అయినప్పటికీ ఈ పోరాటాల్లో కొందరు అమరులయ్యారు. విశ్వమానవాళి విముక్తి కోసం నేడు జరుగుతున్న పోరాటాల్లో తమవంతు రక్తతర్పణం చేసిన త్యాగధనులుగా వీరు మన అమెరికా చరిత్ర పుటలకెక్కుతారు. అటువంటి వారిలో వెనిజులా, గ్వాటిమాలా, పెరు విప్లవోద్యమాలకు చెందిన కమాండెంట్ టర్కియోస్ లిమా, కామిలో టోర్రెస్, కమాండెంట్ ఫాబ్రియో ఓజెదా, కమాండర్లు లోబాటన్, లూయిస్ డి లా పుయెంటా ఉసెడా వంటి నాయకులున్నారు.

క్రియాశీలక ప్రజా ఉద్యమాలు కొత్త కొత్త నాయకులను సృష్టిస్తాయి. గ్వాటిమాలలో సీజర్ మోంటెస్, యోన్ సోసా వంటి నేతలు తిరుగుబాటు బావుటా పైకెత్తారు. కొలంబియాకు చెందిన ఫాబియో వాజ్క్వెజ్, మరులాందలు ప్రతిఘటనోద్యమానికి నాయకులయ్యారు. కొలంబియా పశ్చిమ తీరంలో డగ్లస్ బ్రావో, ఎల్ బాచిల్లెర్‌లో అమెరికో మార్టిన్‌లు వెనిజులా పోరాట రంగాలకు నాయకత్వం వహిస్తూన్నారు.

ఈ దేశాలతో పాటు మన అమెరికా ఖండంలోని అనేక దేశాల్లో నూతన తిరుగుబాటు జ్వాలలు ఎగసిపడనున్నాయి. బొలీవియాలో అటువంటి పరిణామాన్ని



మనం చూశాము. ఆధునిక విప్లవకారుల వృత్తిలో ఎదురయ్యే సాధకబాధకాలను అధిగమిస్తూ అటువంటి పోరాటాలు మరిన్ని దేశాల్లో పైకెగియనున్నాయి. విప్లవోద్యమ క్రమంలో జరిగే పొరపాట్ల కారణంగా ఎంతో మంది కాలగర్భంలో కలిసిపోవచ్చు. రానున్న కాలంలో జరగబోయే పోరాటాల్లో మరికొంతమంది అమరులవవచ్చు. పోరాటపు సెగల నుండి కొత్త తరం విప్లవకారులు పుట్టుకురావచ్చు. సరికొత్త తరం యోధులకు ఈ పోరాటాలు జన్మనివ్వవచ్చు. యుద్ధరంగంలోనే ప్రజలు తమ నాయకులను, పోరాట యోధులను ఎంపిక చేసుకోవచ్చు. అమెరికా తొత్తుల దమనకాండ కూడా మరింత పెరగొచ్చు. సాయుధ పోరాటాలు జరుగుతున్న అన్ని

దేశాలకు అమెరికా సైనిక సహాయమందుతూ ఉంది. పెరూ సైన్యం ఆ దేశంలో విప్లవకారులను సమూలంగా తుదముట్టించేందుకు సాయుధ చర్యలు చేపట్టింది. ఈ సైన్యానికి అమెరికా శిక్షణ, మార్గదర్శనం అందిస్తోంది. సాయుధ, వ్యూహాత్మక విషయాల్లో తగినంత పరిజ్ఞానం పెంచుకుని యుద్ధకళపై కేంద్రీకరణ పెంచితే ఈ ప్రజలంతా దాదాపు అజేయులవుతారు. అదనపు బలగాలను మొహరించకుండా అమెరికా ఈ యుద్ధాన్ని ఏ మాత్రం కొనసాగించలేదు. పెరు దేశంలో ఇప్పటివరకు బయటి ప్రపంచానికి పేర్లు కూడా తెలీని వాళ్లు గెరిల్లా దళాలను సమీకరించి పునర్నిర్మిస్తున్నారు. చిన్న చిన్న ప్రతిఘటనలను మాత్రమే నియంత్రించటానికి పనికొచ్చే కాలం చెల్లిన ఆయుధాల స్థానంలో అమెరికా అత్యాధునిక మారణాయుధాలు సమీకరిస్తోంది. సరఫరా చేస్తోంది. ప్రస్తుతానికి పాలకవర్గాల తరపున పోరాడేవారి స్థానంలో అమెరికా సైనిక సిబ్బంది కవాతు చేస్తున్నారు. గెరిల్లా దాడుల్లో అమెరికా తొత్తు ప్రభుత్వాల సైన్యం కకావికలవుతున్న చోట్ల మాత్రం నేరుగా తన సైన్యాన్నే అమెరికా బరిలోకి దించుతోంది. విముక్తి ఉద్యమాలు నడుపుతున్న వారంతా వియత్నాం మార్గాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. మన అమెరికా దేశాలు కూడా అనుసరించాల్సిన పంథా అదే. మిగిలిన దేశాలకంటే అమెరికా దేశాల్లో ఓ ప్రత్యేక వెసులుబాటు, అవకాశం ఉంది. అమెరికా సామ్రాజ్యవాదం, దాని తొత్తులను గంగవెర్రులెత్తించే స్థాయిలో సమన్వయ మండళ్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. విప్లవోద్యమాన్ని పురోగమింపచేయవచ్చు.

ఇప్పటి వరకు జరిగిన విముక్తి ఉద్యమ వారసత్వంలో స్థానం దక్కించుకోలేని అమెరికా దేశాలు ఇప్పుడిప్పుడే ట్రైకాంటినెంటల్ ద్వారా విప్లవోద్యమాల వారసత్వాన్ని స్వంతం చేసుకునేందుకు ముందుకొస్తున్నాయి. ప్రజల గొంతుకగా మారుతున్నాయి. క్యూబా విప్లవం నేడు మరింత విశిష్ట ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. రెండో లేదా మూడో వియత్నాంలను  సృష్టించటంలో క్యూబా కీలక పాత్ర పోషించనుంది. ప్రపంచాన్ని వియత్నాం బాటలో నడిపించేందుకు క్యూబా కంకణం కట్టుకుంది.

సామ్రాజ్యవాదం విశ్వవ్యాపిత వ్యవస్థ అనీ, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అంతిమ దశ అనీ మనం గుర్తు పెట్టుకోవాలి. అటువంటి సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థను ఓడించటానికి విశ్వవ్యాప్త విప్లవోద్యమం అనివార్యం. సామ్రాజ్యవాదాన్ని విధ్వంసం చేయటమే ఈ విప్లవోద్యమాల వ్యూహాత్మక లక్ష్యంగా ఉండాలి. ఈ విప్లవోద్యమంలో మన పాత్ర, అంటే వర్ధమాన దేశాలు, వలసపాలనలో మగ్గుతున్న దేశాల పాత్ర ఏమిటి? సామ్రాజ్యవాదం ఏ ఊతకర్రల మీద ఆధారపడి వ్యవహరిస్తోందో వాటిని తొలగించటం. సామ్రాజ్యవాదపు పునాదులను పెకలించటం.

అంటే ఈ సామ్రాజ్యవాదానికి రక్తమాంసాలు సమకూర్చే అంటే దానికి కావల్సిన పెట్టుబడులు సమకూర్చేందుకు గాను వర్ధమాన దేశాలు, వలస దేశాల్లో జరిగే వికృత దోపిడీకి ముగింపు పలకాలి. పెట్టుబడి, ముడిసరుకుల, చౌకైన వేతన శ్రమ, సాంకేతిక నిపుణులను సరఫరా చేసే వలయాలను ఛేధించాలి. వీటన్నింటినీ ఇతర దేశాలకు ఎగుమతి చేసి ఆయా దేశాల్లోని శ్రామికుల రక్తం పీల్చుడానికి ముడిసరుకులుగా వాడుకుంటోంది. ఆధిపత్య సాధనాలు – ఆయుధాలు తదితరాల తయారీకి వెచ్చిస్తోంది. తద్వారా వలస దేశాలను శాశ్వతంగా తమ కాలికింద తొక్కి పెట్టి ఆధిపత్యం చలాయిస్తోంది.

ప్రజల విముక్తే ఈ వ్యూహాత్మక లక్ష్యానికి ముగింపు. అత్యధిక సందర్భాల్లో ఈ విముక్తి సాయుధ విప్లవ పోరాటాల ద్వారానే సాధ్యం. అటువంటి సాయుధ విప్లవ పోరాటాలు మన అమెరికాలో అనివార్యంగా నిస్సందేహంగా సోషలిస్టు విప్లవాలే.

సామ్రాజ్యవాదాన్ని కూల్చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్న మనం ఆ సామ్రాజ్యవాదానికి నాయకత్వం వహిస్తున్న దేశాన్ని ముందుగా గుర్తించాలి. ఆ నాయకురాలు అమెరికా ఒక్కటే.

ఈ ప్రయత్నంలో మనం ఓ సాధారణ కర్తవ్యాన్ని నెరవేర్చాలి. సామ్రాజ్యవాదం తన సహజసిద్ధమైన వాతావరణం నుండి బయటికి వచ్చేలా పొగబెట్టాలి. అననుకూల వాతావరణంలో తన ఆలోచనలు, అలవాట్లుతో పొసగని వాతావరణంలో యుద్ధం చేయాల్సిన పరిస్థితులు కల్పించాలి. మన శత్రువైన అమెరికాను మనం తక్కువ అంచనా వేయకూడదు. అమెరికా సైనికులకున్న సాంకేతిక నైపుణ్యం, సైనిక బలగాల కోసం వెచ్చించే నిధులు చూస్తే ఆ సైన్యానికే కళ్లు బైర్లుకమ్ముతాయి.

అమెరికా సైనికులు ఎదుర్కునే విప్లవ పోరాట సైన్యానికి ఉన్నంత సైద్ధాంతిక నిబద్ధత అమెరికా సైన్యానికి ఉండదు. ఉదాహరణకు వియత్నాం సైన్యానికి ఉన్నంత పట్టుదల, లక్ష్య శుద్ధి వారితో పోరాడుతున్న అమెరికా సైన్యానికి ఉండదు. అందువల్లనే అటువంటి అంగబలం, అర్థబలం అవసరానికి మించి ఉన్న సైన్యాన్ని నైతిక బలం విషయంలోనే మనం ఓడించగలం. వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలంటే యుద్ధరంగంలో ఓడించటంతో పాటు పదేపదే చావుదెబ్బ కొట్టాలి. ఆత్మస్థైర్యం దెబ్బతీయాలి.

ఈ చిన్న చిన్న విజయాలు సాధించటానికే ప్రజలు అసమాన త్యాగాలు చేయాల్సి వచ్చింది. నేటి పరిస్థితులు కూడా అటువంటి త్యాగాలు చేయాల్సిన అవసరాన్ని మనముందుంచుతున్నాయి. సాధ్యమైనంత వరకు ప్రత్యక్ష పోరాటాన్ని మనం నివారించగలిగితే మనలను మనం శత్రుసేనల దాడుల నుండి కాపాడుకోగలిగితే

మన పూర్వీకుల కంటే తక్కువ ప్రాణనష్టంతోనే బయట పడొచ్చు.

సామ్రాజ్యవాదంతో సాగే పోరాటంలో చివరిగా విముక్తి పొందే దేశం మిగిలిన దేశాల్లాగా సాయుధపోరాటం చేయాల్సిన అవసరమే ఉండకపోవచ్చు. ఆ మేరకు చివరి దఫాలో విముక్తి పొందే దేశాల ప్రజలు కొద్దిపాటి త్యాగాలతోనే భారీ విజయాలు సాధించవచ్చు. అయితే ఈ పోరాటాన్ని మనం వాయిదా వేయలేము. ఈ విముక్తి పోరాటాలు విశ్వవ్యాప్త ఘర్షణగా మారకుండా నివారించలేము. ఏదేమైనా ఈ పోరాటంలో ప్రజలు అనుభవించే కష్టాలు మాత్రం అనూహ్య స్థాయిలోనే ఉంటాయి. భవిష్యత్తును మనం దర్శించలేకపోవచ్చు. కానీ జాతీయ విముక్తి పోరాటానికి నాయకత్వం వహించి విజయ పథాన నడిపించాల్సిన మనం నిర్వేదానికో, నిరాశావాదానికో తావివ్వకూడదు.

అనవసరమైన త్యాగాలు చేయకుండా మన బలగాలను మనం కాపాడుకోవాలన్న ఉద్దేశ్యంతో ఇదంతా చెప్తున్నాను. అందువల్ల సాధ్యమైనంతవరకు శాంతియుత మార్గాల్లో మన అమెరికా దేశాలు విముక్తిపోరాటంలో విజయం సాధించటానికి కావల్సిన అన్ని చర్యలు చేపట్టాలి. ప్రయత్నాలూ చేయాలి. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటన్నవిషయంలో మనకు ఉండాల్సిన స్పష్టత మనకు ఉంది. విముక్తి పోరాటం ప్రారంభించటానికి ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా ఉండొచ్చు. లేకపోవచ్చు. కానీ మనం ఎటువంటి భ్రమలకూ లోనుకావల్సిన అవసరం లేదు. నాయకత్వ స్థానంలో ఉన్న మనం పోరాటంతో పని లేకుండానే విముక్తి సాధ్యమన్న అపోహలకు, భ్రమలకు లోనయ్యే హక్కు మనకు లేదు. ఈ విముక్తి పోరాటాలు భాష్పవాయు గోళాలకు వ్యతిరేకంగా రాళ్లు రప్పలతో రంగంలోకి దిగే వీధి పోరాటాలు కావు. శాంతియుతంగా జరిగే సార్వత్రిక సమ్మె పోరాటాలు కావు. లేదా అగ్రహోదగ్రులైన కొద్ది మంది ఆవేశపరులు పాలకవర్గంలోని ఒకటి రెండు రోజుల్లో ఒకరిద్దరు వ్యక్తులను, ఒకటో రెండో కుటుంబాలను హతమార్చటం ద్వారా సాధించే విజయం కాదు. ఈ పోరాటం సుదీర్ఘమైనది. కఠినమైన మార్గంలో సాగేది. ఈ పోరాటం గెరిల్లా పోరాటంగా ఉంటుంది. అజ్ఞాతంలో ఉండే దళాలతో పాటు పట్టణాల్లో కూడా ప్రతి గెరిల్లా పోరాట యోధుని కుటుంబం ఈ పోరాటానికి కేంద్రంగా ఉంటుంది. ఎందుకంటే ఈ పోరాటయోధుల కుటుంబాలు కాకలుతీరిన పోరాటాలకు సిద్ధం కాకపోతే పాలకవర్గాలు ఆయా కుటుంబాలను వెంటాడి వేటాడతాయి. గెరిల్లా దళాలు ఊచకోతకు గురైన గ్రామీణ జనాభాతో మమేకం అవ్వాలి. పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ శత్రుశిబిరాలను ధ్వంసం చేయాలి.

మనం ఇటువంటి పోరాటం చేయాల్సిన పరిస్థితిని సామ్రాజ్యవాదమే




సృష్టిస్తోంది. మనకు మరో ప్రత్యామ్నాయం లేదు. మనం ఈ పోరాటానికి సిద్ధం కావాలి. సన్నద్ధం కావాలి.

ఆరంభం అంత తేలికైనదేమీ కాదు. అత్యంత దుర్గమమైనది. ముళ్లబాట. పాలకవర్గాల దమన నీతిని అమలు చేయటానికి ప్రజలను తప్పుదారి పట్టించే

వాగాడంబరంతో పాటు సకల అస్త్రశస్త్రాలు ప్రయోగిస్తారు. తొలి దశలో మన ఉద్యమాన్ని బతికించుకోవటమే మన లక్ష్యం. తర్వాతి దశలో గెరిల్లా యుద్ధ తంత్రాన్ని అనుసరించాలి. సాయుధ ప్రచారోద్యమం నిర్వహించాలి. (వియత్నాంలో జరగుతున్న విధంగా గెలుపు ఓటముల గురించి కాకుండా శత్రువుల బుల్లెట్లకు బుల్లెట్లతో, ప్రచారానికి ప్రచారంతో సమాధానమివ్వాలి. పోరాడాలి.) నిరాశ్రయులైన సాధారణ ప్రజల నుండి తయారయ్యే గెరిల్లా దళాలే శాశ్వతం అన్నది చరిత్ర చెప్తున్న సత్యం. జాతీయ స్ఫూర్తిని ఏకీకృతం చేయటం, కఠినమైన కర్తవ్యాలు స్వీకరించటానికి సంసిద్ధులం కావటం, అంతకంతకూ పెరిగే హింసాత్మక దమనకాండను ప్రతిఘటించేందుకు సిద్ధం కావటం మౌలిక లక్ష్యాలుగా ఉండాలి. విద్వేషం పోరాటంలో భాగంగా ఉంటుంది. శత్రువు పట్ల నిరంతరం ద్వేషభావాన్ని కలిగి ఉండాలి. అటువంటప్పుడు మాత్రమే మనిషి తనకున్న సహజ పరిమితులను అధిగమించినప్పుడు మాత్రమే హింసాత్మక చర్యలకు పాల్పడగలుగుతాడు. హంతక యంత్రంగా మారతాడు. మార్చాలి. ప్రతిఘటనా సైన్యం కూడా అదేవిధంగా ఉండాలి. ద్వేషభావం లేనిదే శత్రుసైన్యాన్ని దునుమాడటం సాధ్యం కాదు.

శత్రువు ఏయే రంగాల్లో యుద్ధం చేస్తున్నాడో మనం కూడా ఆయా రంగాలన్నిటిలోనూ యుద్ధం కొనసాగించేందుకు సిద్ధం కావాలి. శత్రువు గుండెల్లో నిద్రపోవాలి. వాడి ఇంట్లో తిష్టవేయాలి. వాడు విందులు వినోదాలు చేసుకునేచోట ప్రత్యక్షమవ్వాలి. ప్రతిఘటనోద్యమం సమగ్రయుద్ధం కావాలి. సార్వత్రిక యుద్ధం కావాలి. లిప్తపాటులో శత్రువుపై తన స్థావరంలో కానీ స్థావరం బయటగానీ దాడి చేయగలిగాలి. ఎటువైపు కదిలినా అటువైపు అధిగమించలేని అడ్డుగోడలెదురైనప్పుడు ఎంత రాక్షసి బల్లి అయినా ఏవిధంగా గందరగోళానికి లోనవుతుందో శత్రువును కూడా అటువంటి గందరగోళానికి గురి చేయాలి. దాంతో శత్రువు మనోనిబ్బరం కోల్పోవటం మొదలవుతుంది. అటువంటప్పుడే మరింత రాక్షసంగా మారతాడు. కానీ మితిమీరిన రాక్షసత్వం మాటున దాగిన పతనావస్థ లక్షణాలను మనం గమనించాలి.

అంతర్జాతీయంగా కార్మికవర్గ సైన్యాన్ని సమీకరించి నిజమైన కార్మికవర్గ అంతర్జాతీయతను నిర్మిద్దాం. మానవాళిని పునరుజ్జీవింపచేయటమే మనం సాగించే పోరాటాలకు లక్ష్యంగా, పతాకంగా ఉండాలి. వియత్నాం కోసం, లావోస్ కోసం, కాంబోడియా కోసం, గ్వాటిమాలా కోసం, వెనిజులా కోసం, గినియా కోసం ప్రాణాలర్పించటం కంటే మించిన గౌరవం ఆసియన్లకైనా, ఆఫ్రికన్లకైనా, అమెరికన్లకైనా ఆఖరికి యూరోపియన్లకైనా మరోటి ఉండదు. సమకాలీన ప్రపంచంలో రుధిర

క్షేత్రాలవుతున్న ప్రదేశాల్లో ఇవి కొన్ని మాత్రమే.

ఏ దేశపు లక్ష్యం కోసమైనా మరో దేశపు పౌరుడు ప్రాణత్యాగం చేయటం అంటే ఆ దేశపు విముక్తి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే వారికి ఓ అనుభవంగానే మిగిలిపోతుంది. ఒక్కో దేశం విముక్తి కావటం తమతమ మాతృదేశాల విముక్తి పథంలో ఒక్కో ముందడుగే.

మనలో ఉన్న అసంగతాలను సరిచేసుకుని సకల శక్తియుక్తులూ విముక్తి పోరాటం కోసం ఒడ్డాల్సిన సమయం ఆసన్నమైంది.

స్వేఛ్ఛ కోసం పోరాడుతున్న ప్రపంచం అనేక భిన్నాభిప్రాయాలతో సతమతమౌతోంది. ఈ వాస్తవాన్ని ఎవ్వరూ కప్పిపుచ్చలేరు. ఈ భిన్నాభిప్రాయాలు ఏ స్థాయికి చేరాయంటే వీటి మధ్య ఏకాభిప్రాయం అసాధ్యంగా మారింది. పరస్పర విరుద్ధ శక్తులు చర్చలకు సిద్ధం కానప్పుడు వారిని సముదాయించి చర్చలకు రప్పించటం అర్థం లేని పని. ఏదేమైనా శతృవు కళ్లముందున్నాడు. రోజూ దాడి చేస్తున్నాడు. సరికొత్త దాడులతో మనలను భయపెడుతున్నాడు. ఈ దాడులన్నీ మనలను ఈ రోజు, రేపు, ఎల్లుండి ఏకం చేస్తాయి. ఈ విషయాన్ని ఎవరు ముందుగా అర్థం చేసుకుని ఐక్యమవుతారో ప్రజలు వారిని ఆదరిస్తారు. ప్రజలు వారిపట్ల కృతజ్ఞతతో ఉంటారు.

ఈ లక్ష్యాలను నిరాశ్రయులైన ప్రజలు ఎంత నిశ్చయంగా సమర్థిస్తారో అంతే నిశ్చయంగా ఈ క్రమంలో తలెత్తే భిన్న ధృవాలు, భిన్నాభిప్రాయాలు కలిగిన వారిలో ఎవరో ఒకరి పక్షం వహించటం పొరపాటవుతుంది. ఆయా సందర్భాలను బట్టి చర్చలో ఉన్న విషయాలను బట్టి మనం ఏదో ఒక పక్షంతో ఏకాభిప్రాయం కలిగి ఉండటం సహజం. అంతమాత్రాన నిక్కచ్చిగా ఓ పక్షాన్ని మనం భుజాన వేసుకోలేము. యుద్ధ మేఘాలు మురుసుకుంటున్న నేటి తరుణంలో ఈ భిన్నాభిప్రాయాలు విముక్తిశక్తులను బలహీనపరుస్తాయి. అయినా ఈ పరిస్థితుల్లో భిన్నాభిప్రాయాలు కలిగిన వారిని ఏకతాటిమీదకు తెచ్చే ప్రయత్నం వృధా ప్రయత్నమే. ఆయా భిన్నాభిప్రాయాలను చరిత్ర గమనానికి వదలాలి.

పోరాటాల నడుమనున్న మనం ఎత్తుగడలు, వ్యూహం, స్వల్పకాల లక్ష్యాలు సాధించేందుకు అనుసరించే కార్యాచరణ విషయంలో ఇతరుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సామ్రాజ్యవాదాన్ని సాయుధ పోరాటాల ద్వారా దునుమాడాలన్న మహత్తర వ్యూహాత్మక లక్ష్యం విషయంలో మనం ఎటువంటి రాజీ వైఖరిని ప్రదర్శించకూడదు.

విజయ సాధన పట్ల మనకున్న అంచనాలను ఈ క్రింది విధంగా

క్రోడీకరించవచ్చు : సామ్రాజ్యవాదపు అత్యంత కీలకమైన కేంద్రాలను ధ్వంసం చేయాలి. అంటే అమెరికా సాగిస్తున్న దురాగతాలను, దౌర్జన్యాలను ప్రతిఘటించాలి. ఎత్తుగడల రీత్యా దశలవారీగా మానవాళి విముక్తి సాధన లక్ష్యంగా మార్చుకుని శత్రువును తన స్థావరానికి పరిమితం చేయాలి. సామ్రాజ్యవాదానికి కావల్సిన రక్తమాంసాలు సమకూర్చే కేంద్రాలను నిర్వీర్యం చేయాలి. అంటే సామ్రాజ్యవాదానికి స్థావరాలుగా ఉన్న దేశాల్లో, ప్రాంతాల్లో విముక్తి ఉద్యమాలను బలోపేతం చేయాలి.

ఈ లక్ష్యాల సాధన అంటే సుదర్ఘీమైన యుద్ధానికి మనం సిద్ధం కావటమే. ఇది అత్యంత క్రూరమైన యుద్ధమని మరోసారి గుర్తు చేస్తున్నాము. ఎవ్వరూ తమను తాము మోసం చేసుకోవాల్సిన అవసరం లేదు. పర్యవసానాలకు భయపడి గుంజాటనకు గురి కానక్కర్లేదు. విజయం ఒక్కటే మనకున్న ఆశ. ఇప్పటికిప్పుడు ఓ నిర్ణయానికి రాలేము. ధీరోధాత్తమైన వియత్నాం అనుభవాలు గమనిస్తే ఏరోజుకారోజు జీవన్మరణ సమానమైన పోరాటమే అంతిమ విజయ సాధన దిశగా పురోగమిస్తుందన్న వాస్తవాన్ని రుజువు చేస్తోంది.

అమెరికా స్థాయి జీవన ప్రమాణాలతో సైనిక కేంద్రాల్లో జీవించే అమెరికా సైనికులు ప్రతికూల జీవన పరిస్థితుల నడుమ, శత్రు దేశ భూభాగంలో కాలు కూడా కదపలేని స్థితిలో దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లు బతకాలి. కట్టుదిట్టమైన స్థావరాల నుండి బయటికి తొంగి చూసినా ప్రాణాలతో ఉంటారా లేదా అన్న సందేహం వెన్నులో వణుకు పుట్టిస్తుంది. స్థానిక ప్రజలతో శాశ్వతంగా శత్రుపూరిత వైఖరిని కలిగి ఉండాలి. ఈ పరిస్థితులన్నీ అమెరికాలో దేశీయంగా అనేక ఒత్తిళ్లకు, పర్యవసానాలకు దారితీస్తున్నాయి. ఇప్పటి వరకు అన్ని సామ్రాజ్యవాద దేశాలూ చాపకిందకు నెట్టేయటానికి ప్రయత్నం చేసిన వర్గ పోరాటం ఈ ఒత్తిళ్ల వల్ల మళ్లీ తెరమీదకు వస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రెండు మూడు వియత్నాంల లాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు మాత్రమే భవిష్యత్తుకు ఎంత దగ్గరగా మనం వెళ్లగలుగుతున్నాము అన్నది తెలుసుకోగలము. ప్రపంచ వ్యాప్తంగా వియత్నాం తరహా ప్రతిఘటన మొదలైనప్పుడు ప్రాణ నష్టం కూడా అదే మోతాదులో ఉంటుంది. ప్రతిఘటిస్తున్న వియత్నాం ప్రజల తరహాలో ప్రతి రోజూ ఓ సాహసోపేతమైన రోజుగా మారుతుంది. ప్రతిరోజూ సామ్రాజ్యవాదంపై ఓ కొత్త దెబ్బ పడుతుంది. ఎటువైపు నుండి దాడి పొంచి ఉందో అన్న సందేహంతో సామ్రాజ్యవాదం తన శక్తియుక్తులన్నింటినీ నలుదిక్కులకూ చెల్లాచెదురుగా పంపిణీ చేయాల్సి వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆగ్రహానికి గురయ్యే పరిస్థితి తలెత్తుతుంది.

సామ్రాజ్యవాద ప్రతిఘటన శక్తులన్నీ ఏకమైన తాము చేసే దాడులన్నింటినీ సమన్వయం చేసుకోగలిగితే, ప్రపంచ వ్యాప్తంగా పోరాడుతున్న ప్రజలకు సంఘీభావంగా అన్ని రకాల సహాయ సహకారాలు సమీకరించగలిగితే మన భవిష్యత్తు ఎంత గొప్పగా ఉండబోతుంది...

అంత పెద్ద ప్రపంచ పటంలో ఓ మారుమూల మనం మన సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాన్ని నెరవేర్చగలుగుతున్నాము. మన శక్తికి తగ్గట్లు పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లగలుగుతున్నాము. శక్తికి మించిన సంఖ్యలో ప్రాణత్యాగం చేయగలుగుతున్నాము. మన మాతృభూమి మన రక్త తర్పణతో ఇప్పటికే పునీతమైంది. మన కార్యాచరణ లోతుపాతులు, పరిధినీ మనం అంచనా వేసుకున్నామనటంలో సందేహం లేదు. మనలను మనం ఈ మహోన్నత కార్మికవర్గ సైన్యంలో చిన్న పరమాణవులుగా మాత్రమే భావించుకుంటాము.. ఏదో ఒక రోజు ఏదో ఒక దేశంలో మనం తుది శ్వాస విడవాల్సి వచ్చినప్పుడు, క్యూబా విప్లవం నుండి మనం పాఠాలు నేర్చుకున్నామన్న గర్వంతో మనసు నిండిపోతుంది. ప్రపంచంలో ఈ ప్రాంతంలో విప్లవానికి మేరునగధీరుడు లాంటి వ్యక్తి నాయకత్వంలో నేర్చుకున్న "మానవాళి అంతిమ లక్ష్యమే ప్రమాదంలో పడ్డప్పుడు ఓ వ్యక్తి లేదా ఓ జాతి చేసే త్యాగాలకు ఎంతని విలువ కట్టగలం" అన్న మాటలతోనే స్ఫూర్తి పొందగలం.

మా ప్రతి అడుగు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వేసే పొలికేక. మానవాళిని కబళించనున్న సామ్రాజ్యవాద మహమ్మారి అమెరికాకు వ్యతిరేకంగా ప్రజలందరినీ ఏకంచేసే షరతు ఒక్కటే.. మన ఈ యుద్ధ గీతం కనీసం కొంతమందికైనా చేరేలా చూసుకుందాం. మన చేతిలోని ఆయుధం జారిపోకుండా పట్టుకోవటానికి మరో చేయి ముందుకొచ్చే వరకు జాగ్రత్త తీసుకుందాం. మరో మనిషి మరఫిరంగుల మోత నడుమ యుద్ధం, విజయం కోసం సరికొత్త యుద్ధ నగారాలు మోగిస్తూ మన శవపేటికను మోయటానికి భుజమందించే మరో మనిషి దొరికేలా చూసుకుందాం.

# క్యూబాలో సోషలిజం, మానవత్వం

ఎర్నెస్టో చె గువేరా

**(విప్లవ నేత ఎర్నెస్టో చె గువేరా రాసిన ఉత్తరం ఇది.**
**1965 మార్చి 12న ఉరుగ్వే వార పత్రిక 'మార్చా'కు**
**"ఆల్జీర్స్ నుండి మార్చాకు, క్యూబాలో నేటి విప్లవం'**
**అనే పేరుతో చె గువేరా ఈ ఉత్తరం రాశారు.)**

ఆలస్యంగానే అయినా ఈ నోట్స్‌ను నేను ఆఫ్రికా పర్యటనలో ఉండగానే పూర్తి చేశాను. ఆ విధంగా నా హామీని నెరవేర్చుకున్నాను. పైన ఇచ్చిన శీర్షికలోని అంశాన్నే ఈ నోట్‌లో చర్చించాను. ఉరుగ్వే పాఠకులకు ఇది ఆశక్తి కరంగా ఉంటుందని భావిస్తున్నాను.

పెట్టుబడిదారీ ప్రచారకులు సోషలిజానికి వ్యతిరేకంగా జరిపే సైద్ధాంతిక ప్రచారంలో భాగంగా తరచూ ఒక మాట చెబుతుంటారు. అదేమంటే, సోషలిజంలో...లేక మనం ఇప్పుడు ఏ సోషలిజం నిర్మాణదశలోకైతే ప్రవేశించామో ఆ కాలంలో రాజ్యం కోసం వ్యక్తిని రద్దు చేస్తారని చెబుతారు. సైద్ధాంతికంగా చూసినప్పుడు ఈ వాదనను నేను పూర్తిగా కొట్టి పారేయను. కానీ క్యూబాలో ఇప్పుడు ఏం జరుగుతున్నదో చెప్పి, తరువాత సాధారణ పద్ధతిలో దానికి నా వ్యాఖ్యానాలు జోడిస్తాను. ముందుగా క్యూబాలో అధికారం చేపట్టడానికి ముందూ, తరువాతా జరిగిన మన విప్లవ పోరాట చరిత్రను రేఖా మాత్రంగా పేర్కొంటాను.

క్యూబా విప్లవం ఖచ్చితంగా 1953 జులై 26వ తేదీన ప్రారంభమై 1959 జనవరిలో ముగిసిన విషయం అందరికీ తెలుసు. జులై 26న ఫైడల్ కాస్ట్రో నాయకత్వంలోని ఒక బృందం ఓరియెంటే రాష్ట్రంలోని మోంకాడా బారికేడ్లపై దాడి చేసింది. ఆ దాడి విఫలమైంది. ఆ వైఫల్యం పెద్ద విపత్తుగా మారింది. అందులో సోషలిజం బీజాలు మాత్రమే ఉన్నాయి. అందులో వ్యక్తి మౌలికమైన అంశంగా ఉన్నాడు. మేము ఆయనపైన.. ఒక వ్యక్తిపైన నమ్మకం పెట్టాం. నిర్దిష్టంగా చెప్పాలంటే మాకు అప్పుడు మొదటి పేరూ చివరి పేరూ ఆయనే. ఆ కార్యక్రమం విజయమైనా,

వైఫల్యమైనా వ్యక్తి కార్యాచరణ సామార్థ్యంపై ఆధారపడి ఉంది. తరువాత గెరిల్లా పోరాట దశ వచ్చింది. అది రెండు విభిన్నమైన వాతావరణాల్లో అభివృద్ధి చెందింది: మొదటిది, ప్రజలను.. అప్పటికింకా నిద్రాణంగానే ఉన్న ప్రజలను సమీకరించాలి. రెండవది, వారికి నాయకత్వం వహించే గెరిల్లాలు. ప్రజలను సమీకరించే శక్తి, విప్లవ చైతన్యాన్నీ, తిరుగుబాటు స్ఫూర్తినీ రగిలించే శక్తి ఇది. విజయానికి కావలసిన వైయ్యక్తిక (సబ్జెక్టివ్) పరిస్థితులను సృష్టించేది ఈ నాయకత్వమే.

ఇక్కడ కూడా వ్యక్తే ప్రధానం. మా ఆలోచనలను కార్మికవర్గ చైతన్యంగా మార్చే చట్రంలో, మా చుట్టూ, మా ఆలోచనల్లో జరిగే ఈ విప్లవంలో వ్యక్తే ప్రధానమైన అంశం. సీర్రా మీస్త్రాలో పోరాడిన యోధులూ, ఒక గొప్ప వీరోచిత కృత్యాన్ని నిర్వహించిన వారూ వ్యక్తులే. అందుకే వారిలో ప్రతిఒక్కరూ తరువాత విప్లవశక్తుల్లో పై స్థాయికి చేరుకున్నారు. ఆ ప్రాతిపదికగానే వారు విప్లవ శక్తుల్లో ర్యాంకులు సాధించారు.

## తొలి వీరోచిత దశ

ఇది తొలి వీరోచిత దశ. ఈ దశలో పోరాటయోధులు చాలా బరువైన బాధ్యతలు నిర్వహించారు. చాలా పెద్ద ప్రమాదాలను ఎదుర్కొన్నారు. వాళ్లకు ఒక విధిని నిర్వహించడంలో వచ్చిన సంతృప్తి మినహా మరే ప్రతిఫలమూ లేదు. మన విప్లవ విద్యలో తరచూ ఈ అంశాన్ని గురించి చర్చిస్తుంటాం. మన పోరాట యోధుల ధోరణుల్లో మనం భవిష్యత్తు స్త్రీ, పురుషులను దర్శిస్తాం.

విప్లవానికి పూర్తిగా అంకితమైన సందర్భాలు మన చరిత్రలో అనేక సార్లు పునరావృతమైనాయి. అక్టోబర్ (1962 క్షిపణి) సంక్షోభం, ఫ్లోరా తుపాను (1963 అక్టోబర్‌లో) సందర్భాల్లో మన ప్రజలంతా ఎంతో ధీరత్వాన్ని, త్యాగాన్ని ప్రదర్శించడం మనం చూశాం. సైద్ధాంతిక దృక్కోణంలో చూసినప్పుడు, నిత్య జీవితంలో ఈ వీరోచిత వైఖరిని శాశ్వంతంగా కొనసాగించడం అనేదే మన మౌలిక కర్తవ్యం.

1959 జనవరిలో విప్లవ ప్రభుత్వం ఏర్పడింది. ఇందులో నమ్మకద్రోహులైన బూర్జువా సభ్యులు కూడా పాల్గన్నారు. కానీ అధికారాన్ని గ్యారెంటీ చేసే శక్తి తిరుగుబాటు సైన్యానిదే. ప్రభుత్వం ఏర్పడ్డంతోనే తీవ్రమైన వైరుధ్యాలు తలెత్తాయి. తొలి సందర్భంలో 1959 ఫిబ్రవరిలో ఫైడల్ కాస్ట్రో ప్రధాని పదవిని స్వీకరించి ప్రభుత్వానికి నాయకత్వం వహించడం ద్వారా ఈ వైరుధ్యాలను పరిష్కరించడం జరిగింది. ఈ క్రమంలో జులై వచ్చేసరికి ప్రజా ఒత్తిడితో అధ్యక్షుడు ఉర్రుటియా రాజీనామా చేశారు.

క్యూబా విప్లవంలో ఈ దశలో ఒక పాత్ర ప్రత్యక్షమయింది. చాలా స్పష్టంగా నిర్వచించబడిన, మళ్లీ మళ్లీ వచ్చే పాత్ర అది. అదే ప్రజలు. బహుముఖమైన ఈ పాత్ర అది. అందరూ చెప్పుకునేట్లు (ముఖ్యంగా పాలక వ్యవస్థ భావించినట్లు) గొర్రెల మంద కాదు. అది నాయకత్వాన్ని, ముఖ్యంగా ఫైడల్ కాస్ట్రోను అనుసరిస్తుందన్నిది నిజం. కానీ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడం ద్వారా, తను ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి నిజాయితీతో పోరాడ్డం ద్వారా ఆయన ఆ నమ్మకాన్ని సాధించారు.

## ప్రజల భాగస్వామ్యం

ప్రజలు వ్యవసాయ విప్లవంలో పాల్గన్నారు. ప్రభుత్వ సంస్థలను నడిపే క్లిష్టమైన కర్తవ్యంలో భాగస్వాములైనారు. బే ఆఫ్ పిగ్స్ వీరోచిత అనుభవంలో పాల్గొన్నారు. సిఐఎ సమకూర్చిన ఆయుధాలతో విరుచుకుపడిన వివిధ బందిపోటు గ్రూపులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో వారి భాగస్వామ్యం రాటుదేలింది. ఆధునిక కాలంలో అక్టోబర్ (క్షిపణి) సంక్షోభం సందర్భంగా తీసుకోవలసిన అత్యంత ముఖ్యమైన నిర్ణయాల్లో వారి భాగస్వామ్యం ఉంది. ఈ నాడు ఆ భాగస్వామ్యం సోషలిజం నిర్మాణంలో కూడా కొనసాగుతోంది.

నిర్ధిష్టంగా చూసినప్పుడు, రాజ్యానికి వ్యక్తి ప్రయోజనం లోబడి ఉంటోంది అని చెప్పేవారి మాట వాస్తవంగానే కనిపిస్తుంది. ఆర్థిక రంగంలో గానీ, సాంస్కృతిక రంగం, రక్షణ, క్రీడలు వగైరా రంగాల్లోగానీ ప్రభుత్వం ఇచ్చిన కర్తవ్యాలను ప్రజలు అనంతమైన ఉత్సాహం, క్రమశిక్షణతో పరిపూర్తి చేస్తారు. దానికి చొరవ ఫైడల్ కాస్ట్రో నుండి, లేకుంటే విప్లవ నాయకత్వం నుండి వస్తుంది. ప్రజలకు వివరిస్తారు. ప్రజలు దాన్ని తమ కర్తవ్యంగా స్వీకరిస్తారు. కొన్ని సందర్భాల్లో పార్టీ, ప్రభుత్వం స్థానిక అనుభవాన్ని తీసుకుని అదే పద్ధతిని సాధారణీకరిస్తాయి.

అయితే రాజ్యం కొన్ని సార్లు పొరపాట్లు చేయవచ్చు. ఒక పొరపాటు జరిగినప్పుడు ప్రజల్లోని దానికి సంబంధించిన సెక్షన్‌లో ఆసక్తి తగ్గడం, ఫలితంగా సమిష్ట ఉత్సాహం లోపించడం జరుగుతుంది. పని మందగిస్తుంది. చివరికి కొద్ది మోతాదులో ఉత్పత్తి తగ్గుదల కనిపిస్తుంది. అప్పుడు పొరపాటు సరిదిద్దుకోవలసిన సమయం వచ్చిందన్నమాట. 1962 మార్చిలో అనిబాల్ ఎస్కలాంటె, పార్టీ మీద ఒంటెత్తువాద విధానాన్ని రుద్దినప్పుడు అదే జరిగింది. అయితే సున్నితమైన చర్యలు వరుసగా తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఈ యంత్రాంగం ఒక్కటే సరిపోదన్నది వాస్తవం. ప్రజలతో మరింత వ్యవస్థాపరమైన సంబంధాన్ని ఏర్పాటు చేసుకోవాలి. రానున్న సంవత్సరాల్లో మేము దాన్ని మెరుగుపరుచుకోవాల్సి ఉంది. అయితే ప్రభుత్వంలోని

ఉన్నత స్థాయినుండి వెలువడుతున్న చొరవలకు సంబంధించి, పెద్ద సమస్యలపై వచ్చే సాధారణ అభిప్రాయాలను ప్రస్తుతం ప్రాతిపదికగా తీసుకుంటున్నాము.


ఈ విషయంలో ఫైడల్ కాస్ట్రో గొప్ప మాస్టర్. ఆయన ప్రజలతో కలిసిపోయే విధాన్ని మనం ఆయన కార్యాచరణలో ఉన్నప్పుడే సరిగ్గా చూడగలం. ఆయన బహిరంగ సభల్లో మాట్లాడుతున్నప్పుడు రెండు ఇనుపరాడ్ల ప్రకంపనలు కలిసిపోయి ఒక కొత్త శబ్దం వస్తున్నట్లుంటుంది. కాస్ట్రో, ప్రజలు ఇద్దరూ ఒకే చర్చలో కలిసి ప్రకంపిస్తుంటారు, వారి ప్రకంపనలు తీవ్రస్థాయికి పోయి చివరికి పోరాటం, విజయం అనేక నినాదాల్లో ఏకమైపోతాయి. వ్యక్తికీ, ప్రజలకూ మధ్య ఏర్పడిన ఈ గతితర్క ఐక్యత అనేది, విప్లవ పోరాట అనుభవం ఎరుగని వారికి అర్థం కావడం కష్టం.

ఈ గతితార్కిక ఐక్యతలో ఇద్దరూ ఒకరికొకరు పరస్పర సంబంధంలో ఉంటారు, అదే సమయంలో ఈ సంబంధంలో వ్యక్తుల సమూహమైన ప్రజలు తమ నాయకులతో ఆదానప్రదానం (ఇంటరాక్ట్) చెందుతుంటారు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో కూడా రాజకీయ నాయకులు ప్రజలను పెద్దఎత్తున కదిలించేటప్పుడు దీన్ని మనం గమనించవచ్చు. అయితే ఇవి నిజమైన సామాజిక ఉద్యమాలు కావు కాబట్టి, ఆ వ్యక్తి తమను ప్రేరేపించినంత వరకు లేక పెట్టుబడిదారీ వ్యవస్థ కాఠిన్యం ప్రజల భ్రమలను తొలగించినంతవరకు మాత్రమే ఉంటాయి. నిజంగా ఈ సామాజిక ఉద్యమాలు నిజమైనవే అయితే వాటిని పూర్తిగా పెట్టుబడిదారీ ఉద్యమాలు అనలేం.

## పెట్టుబడిదారీ వ్యవస్థలోని అగోచర చట్టాలు

పెట్టుబడిదారీ సమాజంలో వ్యక్తులను వారికి తెలియని ఒక నిర్దాక్షిణ్యమైన సూత్రం నడిపిస్తుంది. పరాయీకరణకు గురైన మనిషి, సమాజం మొత్తానికి ఒక అగోచరమైన బొడ్డుతాడుతో కట్టివేయబడి ఉంటాడు. ఆ అగోచర శక్తి విలువ సూత్రం. ఒక వ్యక్తి జీవితంలోని అన్ని అంశాల్లోనూ ఈ సూత్రమే పనిచేస్తుంది. అతని గమనాన్ని, గమ్యాన్ని ఇదే రూపొందిస్తుంది. పెట్టుబడిదారీ సూత్రాలు గుడ్డిగా ఉంటాయి, సామాన్య ప్రజలకు కనిపించవు. అతను లేక ఆమెకు తెలియకుండానే వారిపై అవి పనిచేస్తుంటాయి. అందులో వ్యక్తులకు ఎండమావులు మాత్రమే ఎదుట కనిపిస్తుంటాయి. పెట్టుబడిదారీ ప్రచారకులు దీన్నే ప్రచారంలో పెడుతుంటారు. వ్యక్తుల విజయాల గురించి వారు నిరంతరం ఊదరగొడుతుంటారు. రాక్‌ఫెల్లర్ ఎలా గొప్పవాడైనాడో ఉదాహరణగా చెబుతుంటారు (భారత దేశంలో అంబానీ గురించి). కానీ ఒక రాక్‌ఫెల్లర్ (లేక ఒక అంబానీ) తయారవ్వడానికి వెనుక



ఎంతమంది పేదరికంలోకి నెట్టబడ్డారో, ఎంతమంది తీవ్రమైన ఈతిబాధల్లోకి నెట్టబడ్డారో చెప్పరు. అంత సంపద పోగుపడ్డం వెనుక ఎంత మంది దరిద్రంలోకి నెట్టబడ్డారో, ఎంతమంది సంపద దోచుకోబడిందో చెప్పరు. సామాన్య ప్రజలు ఈ విషయాలు స్పష్టంగా తెలుసుకోవడం అన్ని వేళలా సాధ్యం కాదు. (సామ్రాజ్యవాద దేశాలు వలస దేశాల్లో దోపిడీ చేసిన సంపద వస్తున్న కొద్దీ సామ్రాజ్యవాద దేశాల్లో

కార్మికవర్గం కూడా ఎలా కార్మికవర్గ అంతర్జాతీయతకు దూరమవుతుందో, అదే సమయంలో ఈ క్రమం సామ్రాజ్యవాద దేశాల్లో ప్రజల పోరాట శక్తిని ఎలా తగ్గించివేస్తుందో ఇక్కడ చర్చిస్తే బాగుంటుంది. కానీ ఆ విషయం ఈ నోట్‌లో చర్చించడం సాధ్యం కాదు)

పెట్టుబడిదారీ వ్యవస్థలో విజయం సాధించాలంటే అనేక అవరోధాలను అధిగమించాలని చెబుతారు. సరైన లక్షణాలున్న వ్యక్తులు ఈ అవరోధాలను అధిగమించి లక్ష్యాన్ని చేరుకుంటారని చెబుతారు. ఫలితం సుదూరంగా కనిపిస్తుంది. దానికి చేరుకునే మార్గం ఒంటరిగా ఉంటుంది. అంతేకాదు, దాన్ని చేరుకోవాలంటే తోడేళ్లతో పోటీ పడాలి. ఇతరుల విఫలమైతేనే ఒక వ్యక్తి విజయం సాధించగలడు.

## వ్యక్తి–సోషలిజం

నేనిప్పుడు సోషలిజం నిర్మాణం అనే ఈ వింతైన, కదిలే నాటకంలో వ్యక్తి పాత్ర గురించి నిర్వచించడానికి ప్రయత్నిస్తాను. ఇందులో మనిషికి ఉన్న ద్వంద్వ అస్తిత్వం గురించి, అంటే నిర్దిష్ట వ్యక్తిగా, సమాజంలో సభ్యునిగా అతని గురించి నిర్వచించడానికి ప్రయత్నిస్తాను.

మనం మనిషి యొక్క అసంపూర్ణత అనే లక్షణం నుండి, అసంపూర్ణ వ్యక్తి నుండి ప్రారంభిద్దాం. ఒక వ్యక్తి గత కాలపు అవశేషాలు వర్తమాన చైతన్యంలోకి వస్తాయి. ఈ అవశేషాలను తొలగించాలంటే నిరంతర శ్రమ అవసరం. ఇది రెండువైపుల నుండి జరిగే ప్రక్రియ. ఒకవైపు సమాజం ప్రత్యక్ష, పరోక్ష విద్య ద్వారా మనిషిపై పనిచేస్తుంది, మరోవైపు వ్యక్తి తన చైతన్యపూర్వక స్వీయ–విద్య పొందుతుంటాడు. కొత్తగా ఏర్పడుతున్న సమాజం గతంతో తీవ్రంగా తలపడాల్సి ఉంటుంది. ఈ గతం వ్యక్తి చైతన్యంలో ప్రతిఫలిస్తుంది. వ్యక్తిని వేరు చేస్తూ గతంలో అందించిన విద్య యొక్క అవశేషం ఇది. ఇదే కాకుండా ఈ పరివర్తన కాలంలో సరుకు సంబంధాలు కొనసాగుతూనే ఉంటాయి గనుక ఈ లక్షణం ద్వారా కూడా గతం వ్యక్తిలో ప్రతిఫలిస్తుంది. సరుకు అనేది పెట్టుబడిదారీ సమాజపు ఆర్థిక కణం. సరుకు మనుగడ ఉన్నంత కాలం దాని ప్రభావం ఉత్పత్తి వ్యవస్థమీద, తద్వారా చైతన్యం మీద ఉంటుంది.

తన స్వంత వైరుధ్యాలతో పేలిపోయిన పెట్టుబడిదారీ వ్యవస్థ రూపాంతరం చెందడం వల్ల ఈ పరివర్తన కాలం ఏర్పడిందని కారల్ మార్క్స్ పేర్కొన్నాడు. అయితే, చారిత్రకంగా చూసినప్పుడు సామ్రాజ్యవాదం అనే వృక్షంలో బలహీనమైన కొమ్మలు ముందుగా విరిగిపోతాయని, కొన్ని దేశాలు అటువంటి బలహీనమైన కొమ్మల్లాంటివని

లెనిన్ పేర్కొన్నాడు.

ఇటువంటి దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజలపై ఏదో ఒక విధంగా తన ప్రభావాన్ని చూపించే స్థాయికి ఎదిగింది. కానీ వీటిలో పెట్టుబడిదారీ వ్యవస్థ బద్దలవడానికి కారణం, ఆ వ్యవస్థలో అన్ని అవకాశాలూ తరిగిపోయిన తరువాత ఏర్పడిన అంతర్గత వైరుధ్యాలు కాదు. విదేశీ పీడకులనుండి విముక్తి కోసం జరిగిన పోరాటం, యుద్ధం వంటి బహిరంగ కారణాల వల్ల ఏర్పడిన కష్టాలు, యుద్ధం వల్ల వచ్చిన భారాలను ధనికులు దోపిడీకి గురయ్యే ప్రజలమీదకు నెట్టేయడం, నయా-వలస వాద ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జరిగిన విమోచనా పోరాటాలు...ఇవన్నీ ఈ దేశాల్లో వ్యవస్థలు పేలిపోవడానికి కారణాలు. ఈ దేశాల్లో సామాజిక శ్రమ కోసం పూర్తి స్థాయి విద్య గరపడం ఇంకా జరగలేదు. సంపద పున్ణపంపిణీ జరగలేదు గనుక అది వారికింకా దూరంగా ఉంది. ఒకవైపు అభివృద్ధిలేమి, రెండోవైపు సాధారణంగా జరిగే పెట్టుబడి పలాయనం వల్ల త్యాగాలు చేయకుండా శీఘ్ర పరివర్తన ఇక్కడ అసాధ్యమైపోతోంది. ఆర్థిక పునాది ఏర్పాటు చేయడానికి ఇంకా చాలా దూరం ఉంది. ఈలోగా అభివృద్ధికి పాదార్థిక ప్రయోజనాలే ఇరుసులుగా పనిచేసే పాత పద్ధతి కొనసాగించే ధోరణి కొనసాగుతుంది.

చెట్లను చూసి అడవిని గమనించలేని ప్రమాదం ఉంది. ఆర్థిక కణంగా సరుకు ఉండటం, లాభాపేక్ష, వ్యక్తిగత పాదార్థిక ప్రయోజనాలు వంటివి పెట్టుబడిదారీ వ్యవస్థ మనకు వదిలిపెట్టిన నిస్తేజమైన సాధనాలు. వీటితో సోషలిజం సాధించగలం అనేది ఒట్టి భ్రమ. ఈ మార్గంలో వెళితే కొంతదూరం వెళ్లాక మనం ఎక్కడ తోవతప్పామో తెలుసుకోవడం కష్టం. ఈలోగా ఇప్పటికే ఉన్న ఆర్థిక పునాది మన చైతన్యాన్ని వమ్ముచేసే పని సాగించుకుంటూ పోతుంది. అందువల్ల కమ్యూనిజాన్ని నిర్మించాలంటే నూతన వస్తుగత పునాదిని నిర్మించడంతోపాటు కొత్త స్త్రీ, పురుషులను నిర్మించడం అవసరం.

## నూతన చైతన్యం

అందువల్లనే ప్రజలను సమీకరించేందుకు కొత్త సాధనాలు ఎన్నుకోవడం అవసరం. మౌలికంగా ఈ సాధనాలు నైతిక లక్షణం కలిగి ఉండాలి. అదే సమయంలో వస్తుగత ప్రోత్సాహాలను, ముఖ్యంగా సామాజిక లక్షణం గల ప్రోత్సాహకాలను సరైన రీతిలో ఉపయోగించుకోడాన్ని మాత్రం నిర్లక్ష్యం చేయకూడాదు.

నేను ఇంతకు ముందే చెప్పినట్లు, పెద్ద ఉపద్రవ పరిస్థితుల్లో నైతిక ప్రోత్సాహకాల ద్వారానే ప్రజల నుండి శక్తివంతమైన స్పందన రాబట్టగలుగుతాం.

అయితే ఈ స్పందనల శక్తిని నిలుపుకోవాలంటే మాత్రం కొత్త స్థాయి విలువలు కలిగిన చైతన్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది. సమాజం మొత్తాన్ని ఒక పెద్ద పాఠశాలగా మార్చాలి.

ఒక రకంగా చెప్పాలంటే ఇది ప్రాథమిక దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడినప్పటి క్రమాన్ని పోలి ఉంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ బలప్రయోగం చేస్తుంది, అదే సమయంలో అది ఆ వ్యవస్థలో ప్రజలను ఎడ్యుకేట్ చేస్తుంది. పెట్టుబడిదారీ ప్రచార వేత్తలచేత వర్గ సమాజపు అనివార్యతను గురించి ప్రజలకు వివరిస్తుంది. ఆధ్యాత్మిక సిద్ధాంతం ద్వారా గానీ, లేక ప్రకృతి సూత్రాల యొక్క యాంత్రిక సిద్ధాంతం ద్వారా గానీ ఈ పని చేస్తుంది. ఇది ప్రజలను నిద్రాణం చేస్తుంది. ఒక పెద్ద దుష్టశక్తి తమపై పనిచేస్తున్నదనీ, దానికి వ్యతిరేకంగా పోరాడ్డం సాధ్యం కాదనీ వారు భావించేట్లు చేస్తుంది.

తదుపరి అభివృద్ధిపై ఆశలు మొలకెత్తుతాయి. ఈ విషయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ అంతకు ముందటి కుల వ్యవస్థలకు భిన్నంగా వ్యవహరిస్తుంది. గతకాలపు కులవ్యవస్థల్లో బయటపడే మార్గం కనిపించదు. ధర్మో రక్షిత రక్షిత్త అన్నట్లు ఈ లోకంలో మారుమాట్లాడకుండా లొంగి ఉండేవారికి పరలోకంలో ప్రతిఫలం లభిస్తుందని కుల వ్యవస్థ యొక్క పాత నమ్మకాలు చెబుతాయి. మంచివారికి పరలోకంలో మంచి జీవితం లభిస్తుందని చెబుతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో కొంతమంది ప్రజల్లో ఈ కుల వ్యవస్థ సూత్రాలు అలాగే ఉండిపోతాయి. కానీ మరికొందరు మాత్రం కొంచెం కొత్తగా ఆలోచిస్తారు. అదేమంటే, వర్గ అంతరాలు ఖర్మ వల్లనే ఏర్పడతాయి, కానీ వ్యక్తులు శ్రమ, చొరవ వంటి వాటిద్వారా తమ వర్గం నుండి బయటపడవచ్చు అని వాళ్లు భావిస్తారు. ఈ క్రమం, అంటే స్వయం కృషితో ఎదగడం అనేది పూర్తిగా కపటత్వంతో కూడినది. ఒక అబద్ధాన్ని నిజంగా ప్రదర్శించడమే ఇది.

మనం చెప్పుకుంటున్న సందర్భంలో ప్రత్యక్ష విద్య చాలా ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. వివరణ ఒప్పించేవిధంగా ఉంటుంది, ఎందుకంటే అది నిజం గనుక. దీనికి మభ్యపెట్టే అంశాలేవీ అవసరం లేదు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ దీన్ని నిర్వహిస్తుంది. విద్యా మంత్రిత్వ శాఖ, పార్టీ సమాచార విభాగం వంటి ఏజెన్సీల ద్వారా సాధారణ, సాంకేతిక, సైద్ధాంతిక విద్యను ప్రభుత్వమే అందిస్తుంది. విద్య ప్రజల్లో పాతుకు పోతుంది. దాని వల్ల కొత్త ధోరణులు అలవాటుగా మారిపోతాయి. ప్రజలు దాన్ని తమ స్వంతం చేసుకోవడం కొనసాగిస్తారు. అప్పటికీ ఎడ్యుకేట్ కానివారిని ప్రభావితం చేస్తారు. ప్రజలను ఎడ్యుకేట్ చేసే ప్రత్యక్ష రూపం ఇది.



ఇతర వ్యవస్థీకృత రూపాల్లాగానే ఇది కూడా శక్తివంతమైనది.

## చైతన్య పూర్వకమైన స్వీయావిద్య

ఈ క్రమం చైతన్యపూర్వకమైనది. వ్యక్తులు కొత్త సామాజిక శక్తి ప్రభావాన్ని అనుభూతి చెందుతారు. ఈ స్థాయికి తాము పూర్తిగా ఎదగలేదని అనుకుంటారు. తాము ఏ అనుభూతినైతే చెందుతున్నామో అది సరైనదేనని వారు పరోక్ష విద్య ప్రభావం వల్ల తెలుసుకుంటారు. తమ వెనుకబాటే తమ అభివృద్ధికి గతంలో ఆటంకమైందని తెలుసుకుంటారు. వారు స్వంతంగా ఎడ్యుకేట్ అవుతారు.

సోషలిజాన్ని నిర్మించే ఈ కాలంలో మనం కొత్త మనుషులు పుట్టడాన్ని చూస్తాం. చిత్రం ఇంకా మొత్తంగా పూర్తి కాలేదు. పూర్తికాదు కూడా. ఎందుకంటే కొత్త ఆర్థిక రూపాలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ వాటితోబాటే ఈ క్రమం కొనసాగుతూ ఉంటుంది.

ప్రజలంతా ఐక్యంగా ముందుకు నడచే ఈ కొత్త వ్యవస్థలో కూడా, ఎడ్యుకేట్ కాని కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాలను సంతృప్తి పరుచుకోడానికి ఒంటరి మార్గం పడతారు. మరికొందరు ఐక్యంగా నడిచే ప్రజలతో పాటునడుస్తూనే వారితో విడిగా నడుస్తుంటారు. అయితే ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమంటే, రోజురోజుకూ వ్యక్తులు సమాజంలో భాగంగా మారాల్సిన అవసరంపైనా, అదే సమయంలో సమాజాన్ని నడపడంలో తమ ప్రాముఖ్యత పైనా మరింత చైతన్యం పొందుతూ

ఉంటారు.

వారు ఇంకెంత మాత్రం నెరవేరని ఆకాంక్షల వెంటపడి ఒంటరి మార్గాల్లోకి పోరు. వారు పార్టీని, పురోగామి కార్మికవర్గాన్ని, ప్రజలతో కలిసి నడిచే పురోగామి వ్యక్తులతో కూడిన అగ్రగామి దళాన్ని అనుసరిస్తారు. ఈ అగ్రగామి దళం ఎల్లప్పుడూ భవిష్యత్తుమీద, దాని ఫలితాల మీద దృష్టి సారించి ఉంటుంది. అయితే ఇది వ్యక్తులకు వచ్చే ప్రతిఫలం వంటిది కాదు. కొత్త సమాజమే ఈ ఫలితం. అదే విభిన్న లక్షణాల వ్యక్తులతో కూడిన కమ్యూనిస్టు మానవ సమాజం.

ఈ మార్గం సుధీర్ఘమైనది. పూర్తిగా కష్టాలతో కూడినది. కొన్ని సార్లు మనం తోవతప్పుతాం. తిరిగి వెనక్కు రావాల్సి ఉంటుంది. మరికొన్ని సార్లు మనం చాలా వేగంగా వెళ్లిపోయి ప్రజలనుండి దూరమైపోతాం. మరికొన్ని సార్లు మనం చాలా నెమ్మదిగా నడుస్తూ ప్రజలను వెనక్కులాగుతాం. విప్లవోత్సాహంతో మనం ఎంతవీలైతే అంత వేగంగా మార్గాన్ని సుగమం చేసుకుంటూ ముందుకు పోడానికి ప్రయత్నిస్తాం. కానీ మనం మనకు కావలసిన ఆహారాన్ని ప్రజలనుండి పొందాలన్న విషయం మనకు తెలుసు. అందువల్ల మనల్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలుకూడా మనంత వేగంగా నడవగలిగినప్పుడే మనం కూడా ముందుకు పోగలం.

నైతిక ప్రోత్సాహకాలకు ప్రాముఖ్యత ఇచ్చినప్పటికీ ఈ సమాజంలో రెండు గ్రూపుల మధ్య విభజన ఉంటుంది. ఇది సామాజిక చైతన్యం అభివృద్ధిలో తేడా వల్ల జరుగుతుంది. (ఏదో ఒక కారణంతో సోషలిజం నిర్మాణంలో పాల్గనని మైనారిటీని పక్కన బెట్టినప్పటికీ మిగిలిన వారిలో ఈ తేడా కనిపిస్తుంది.) అగ్రగామి దళం సైద్ధాంతికంగా ప్రజల కన్నా ముందుంటుంది. ప్రజలు నూతన విలువలను అర్థం చేసుకుంటారు, కానీ తగినంతగా కాదు. అగ్రగామి దళంలోని వారిలో గుణాత్మక మార్పు సంభవిస్తుంది. అందువల్ల ఈ అగ్రగామి దళం చైతన్యశీలురై త్యాగాలు చేస్తారు. సామాన్య ప్రజలు మాత్రం దృశ్యాన్ని పాక్షికంగానే చూస్తారు. అందువల్ల కొంతమేరకు ప్రోత్సాహకాలవైపు చూస్తారు. ఇదే కార్మికవర్గ నియంతృత్వం. ఈ కార్మికవర్గ నియంతృత్వం ఓడిపోయిన వర్గాలపైనే కాకుండా విజయం సాధించిన వర్గంలోని వ్యక్తులపైన కూడా పనిచేస్తుంది.

ఇదంతా మనకు చెబుతున్నదేమంటే, పూర్తి విజయం రావాలంటే విప్లవ సంస్థలకు చెందిన అనేక వ్యవస్థలు అవసరమవుతాయి. లక్షలు, కోట్లమంది ప్రజలు భవిష్యత్తువైపు పురోగమించడంతోపాటు ఈ పురోగమనాన్ని సజావుగా సాగించడానికి అనేక ఛానళ్లు, మెట్లు, అడ్డుకట్టలు, బాగా సానబట్టిన పద్ధతుల సమన్వయంతో కూడిన వ్యవస్థలు కావాలి. ఈ వ్యవస్థలు అగ్రగామి దళంలో నడుస్తూ తమ విధులను

నిర్వర్తించే వారిని ప్రోత్సహించి, బహుమతులిచ్చేవిధంగా, నిర్మించబడుతున్న సమాజానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడేవారిని శిక్షించే విధంగా ఉండాలి.

## విప్లవాన్ని వ్యవస్థీకృతం గావించాలి

విప్లవాన్ని వ్యవస్థీకృతం గావించడం అనే పనిలో ఇంకా విజయం సాధించలేదు. ప్రభుత్వానికీ, పూర్తి సమాజానికీ మధ్య తేడాను గుర్తించే ఒక కొత్త పద్ధతికోసం మేము ఎదురుచూస్తున్నాం. ఇది సోషలిజం నిర్మాణానికి సంబంధించిన ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. అదే సమయంలో బూర్జువా ప్రజాతంత్ర వ్యవస్థకు సంబంధించిన సంస్థలు అంటే ఉదాహరణకు శాసన సభ ఛాంబర్లు వంటివాటిని ఈ కొత్తగా నిర్మాణమవుతున్న సమాజంలో ఎట్టిపరిస్థితుల్లోనూ లేకుండా చేయగలగాలి.

విప్లవాన్ని క్రమంగా వ్యవస్థీకృతం చేసేందుకు కొన్ని ప్రయోగాలు జరగాలి. అయితే ఈ విషయంలో అనవసరమైన తొందరపాటు ఉండకూడదు. ఏ మాత్రం ఫార్మాలిటీలు కనిపించినా అవి మనల్ని ప్రజలనుండి దూరం చేస్తాయనే భయాలు దీనికి పెద్ద ఆటంకాలుగా ఉన్నాయి. దీనివల్ల, మానవులు తమ పరాయీకరణ నుండి విముక్తి కావాలన్న అత్యంత ముఖ్యమైన విప్లవ లక్ష్యం నుండి మన దృష్టి మళ్ళుతుందేమోనన్న భయం ఉంది.

విప్లవ సంస్థలు లేని బలహీనత నుండి క్రమంగా బయటపడాలి. ఈ సంస్థలు లేనప్పటికీ సామాన్య ప్రజలు ఒకే లక్ష్యం కోసం చైతన్యయుతమైన ఉమ్మడి పోరాటం జరపడం ద్వారా చరిత్ర సృష్టిస్తున్నారు. ప్రామాణికాలు లేకపోయినప్పటికీ సోషలిజం కింద వ్యక్తి మరింత సంపూర్ణవంతుడయ్యాడు. ఖచ్చితమైన యంత్రాంగం లేకపోయినప్పటికీ సోషలిజంలో వ్యక్తి తన భావాలు వ్యక్తీకరించడానికీ, సమాజంలో అతడు గుర్తింపు పొందడానికీ అవకాశాలు అనంతంగా ఉన్నాయి.

యాజమాన్యంలోనూ, ఉత్పత్తికి సంబంధించిన అన్ని నిర్మాణాల్లోనూ ప్రజల చైతన్యపూర్వక భాగస్వామ్యాన్ని మరింత లోతుగా పెంచాల్సిన అవసరం ఉంది. దీన్ని సాంకేతిక, సైద్ధాంతిక విద్యతో లింకు చేయాల్సిన అవసరం ఉంది. అలా చేయడం వల్లనే వ్యక్తులు ఈ క్రమాలన్నీ ఒకదానిపై మరొకటి సన్నిహితంగా ఆధారపడి ఉన్నాయని గుర్తిస్తారు. ఇవన్నీ కలిసి పురోగమిస్తాయని తెలుసుకుంటారు. ఈ విధంగా వ్యక్తి, సమాజంలో తను భాగస్వామిననే చైతన్యాన్ని పొందుతాడు. అంటే, ఈ విధంగా పరాయీకరణకు సంబంధించిన బంధనాలు తెగిపోతే అప్పుడు మానవుడు తనుకూడా ప్రకృతిలో ఒక మానవ జీవినే అని పూర్తిగా తెలుసుకుంటాడన్నమాట. మరో విధంగా చెప్పాలంటే విముక్త శ్రమ ద్వారా వ్యక్తి తన నిజమైన నైజాన్ని తిరిగి

గెలుచుకుంటాడన్నమాట; సంస్కృతి, కళల ద్వారా వ్యక్తి తన మానవ నైజాన్ని వ్యక్తీకరిస్తాడన్నమాట.

## పని యొక్క కొత్త హోదా

కొత్త సంస్కృతిని అభివృద్ధి చేయాలంటే పని అనేది కొత్త హోదాను పొందాలి. సరుకుగా–మానవుడు అంతమైపోతాడు. ప్రతి వ్యక్తీ తన సామాజిక విధులకు సంబంధించిన కోటా పరిపూర్తి చేసే వ్యవస్థ నెలకొల్పబడుతుంది. ఇక్కడ ఉత్పత్తి సాధనాలు సమాజానికి చెందుతాయి. యంత్రం అనేది కేవలం తన పనిని నిర్వహించే ఒక వేదికగానే ఉంటుంది. వ్యక్తి తన జంతుప్రాయమైన అవసరాలను సంతృప్తి పరిచుకోవాలన్న ఆలోచన నుండి విముక్తి చెందుతాడు. వ్యక్తి తన పనిలో తనను తాను చూసుకోవడం ప్రారంభిస్తాడు. తను శ్రమతో సృష్టించిన వస్తువుల ద్వారా అతను ఒక మానవునిగా తన పూర్తి స్థాయిని అర్థం చేసుకుంటాడు. ఇక్కడ పని అంటే శ్రమ శక్తిని అమ్ముకునే రూపంలో తనలోని ఒక భాగాన్ని ఇతరులకు సమర్పించుకోవడం అనేది ఉండదు. ఇక్కడ శ్రమ శక్తి ఒక వ్యక్తికి చెందదు. వ్యక్తి అభివ్యక్తీకరణగా ఉంటుంది. వ్యక్తి సామాజిక విధులు నిర్వహించడం ద్వారా ఉమ్మడి జీవనంలో తనను తాను చూసుకుంటాడు.

పనికి సామాజిక విధి అనే ఈ కొత్త హోదా ఇవ్వడానికి మేము చేయాల్సినదల్లా చేస్తున్నాము. ఒకవైపు దాన్ని సాంకేతికాభివృద్ధితో లింకు చేయడానికి కృషి చేస్తున్నాము. దీని వల్ల ప్రజలకు మరింత స్వేచ్ఛ లభిస్తుంది. మరోవైపు ఒక వ్యక్తి సరుకుగా తనను తాను అమ్ముకునే భౌతిక అవసరం ఇంకెంత మాత్రం లేని ఒక పూర్తి మానవీయ వాతావరణాన్ని సృష్టించేందుకు, మార్క్సిస్టు సిద్ధాంతం అధారంగా జరిగే స్వచ్ఛందంగా కృషికి పనిని లింకుచేయడానికి కూడా చేయాల్సినదల్లా చేస్తున్నాం. స్వచ్ఛందంగానే జరుగుతున్నప్పటికీ ఇప్పటికీ కొన్ని అవసరార్థం బలవంతంగా చేసే అంశాలు ఉన్నాయి. మన చుట్టూ ఉన్న బలవంతపు పనిని ఇప్పటికీ పూర్తిగా సామాజిక స్పృహతో చేసే పనిగా పరివర్తన గావించలేదు. అనేక సందర్భాల్లో వ్యక్తులు వారి వాతావరణం ఒత్తిడి వల్ల పని చేస్తున్నారు. (ఫైడల్ కాస్ట్రో దీన్ని నైతిక ఒత్తిడి అన్నారు). పనికి సంబంధించి కొత్త అలవాట్లు ఏర్పరుచుకున్నప్పటికీ ఒక వ్యక్తి తన పనిపట్ల వైఖరిని మార్చుకోవాలంటే, సామాజిక వాతావరణ ఒత్తిడి నుండి స్వేచ్ఛ పొందాలంటే పూర్తిగా భౌద్ధిక పునర్జన్మనెత్తాలి. అదే కమ్యూనిజం. ఆర్థిక వ్యవస్థలో మార్పు తనంత తానుగా రానట్లే చైతన్యంలో మార్పు కూడా తనంతట తానుగా రాదు. మార్పులు నెమ్మదిగా ఉంటాయి. ఒకే విధంగా ముందుకు సాగవు. ఒక్కోసారి వేగంగా, ఒక్కోసారి నెమ్మదిగా



సాగుతుంటాయి. ఒక్కోసారి వెనక్కు కూడా వెళతాయి.

ఇంకో విషయం ఏమంటే నేను గతంలోనే చెప్పినట్లు, కార్ల్ మార్క్స్ తన గోతా కార్యక్రంలో పేర్కొన్న విధంగా మనం స్వచ్ఛమైన పరివర్తన కాలాన్ని ఎదుర్కొనడం లేదు. ఆయన దర్శించని ఒక కొత్త దశను ఎదుర్కొంటున్నాం. కమ్యూనిజం యొక్క ప్రాథమిక దశను, సోషలిజం నిర్మాణ దశను ఎదుర్కొంటున్నాం. హింసాత్మకమైన వర్గ పోరాటం మధ్యలో ఈ పరివర్తన జరుగుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అవశేషాలు దానిలో కొనసాగుతున్న దశలో జరుగుతోంది. అందువల్ల ఈ దశకు సంబంధించిన పూర్తి అవగాహన మనకు అవసరం.

దీనికి తోడు మార్క్సిస్టు తత్వశాస్త్రం పురోగమించకుండా ఆటంకపరుస్తున్న సిద్ధాంతాలు ఈ పరివర్తన కాలాన్ని ఒక క్రమపద్ధతిలో నిర్వహించడానికి అడ్డుతగులుతున్నాయి. పరివర్తనా కాలపు రాజకీయ ఆర్థిక శాస్త్రం ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందలేదు. మనం ఇంకా శైశవ దశలోనే ఉన్నామన్న విషయాన్నీ, ఒక విశాలమైన రాజకీయ ఆర్థిక సిద్ధాంతాన్ని రూపొందించేముందుగా ఈ కాలానికి సంబంధించిన ముఖ్యమైన లక్షణాలన్నిటినీ ఇంకా అన్వేషించాల్సే ఉందన్న విషయాన్ని మనం అంగీకరించాలి.

మనం రూపొందించనున్న సిద్ధాంతం ఏదైనా సోషలిజం నిర్మాణానికి సంబంధించిన రెండు స్తంభాలపై ప్రధానంగా ఆధారపడుతుంది. మొదటిది, నూతన స్త్రీ, పురుషుల విద్య, రెండవది సాంకేతిక శాస్త్ర అభివృద్ధి. ఈ రెంటి విషయంలో ఇంకా చేయాల్సింది చాలా ఉంది. అయితే ఒక మౌలిక పునాదిగా సాంకేతిక శాస్త్ర అభివృద్ధి విషయంలో మాత్రం ఏమాత్రం ఆలస్యం చేయకూడదు. ఎందుకంటే సాంకేతిక శాస్త్రం ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే ఆవిష్కరించబడి ఉంది గనుక ఈ విషయంలో మనం కొత్తగా కనిపెడుతూ ముందుకు పోవాల్సిన అవసరం లేదు. అందువల్లనే మన ప్రజలకు, ముఖ్యంగా అగ్రగామి దళానికి శాస్త్ర, సాంకేతిక శిక్షణ ఇవ్వాల్సిన అవసరాన్ని గురించి ఫైడల్ కాస్ట్రో నొక్కిచెబుతుంటారు.

## వ్యక్తివాదం

ఉత్పత్తితో సంబంధంలేని భావజాల రంగంలో పాదార్థిక, భౌద్ధిక అవసరాల మధ్య విభజనను సులువుగానే గుర్తిస్తాం. చాలా కాలంగా వ్యక్తులు సంస్కృతి, కళల ద్వారా పరాయీకరణ నుండి దూరం కావడానికి ప్రయత్నిస్తూ ఉన్నారు. ఒక వ్యక్తి రోజుకు ఎనిమిది గంటల సేపు చేసే పనిలో ప్రతి రోజూ చనిపోతూ ఉండగా కొంతమంది వ్యక్తులు తమ బౌద్ధిక సృజన ద్వారా తిరిగి జీవం పోసుకుంటుంటారు. కానీ ఈ చికిత్సలో కూడా అదే జబ్బును కలుగజేసే క్రిమి దాగుంది. ఒంటరి వ్యక్తి ప్రపంచంతో సామరస్యంగా జీవించడానికి చేసే ప్రయత్నం ఇది. చుట్టూ ఉన్న వాతావరణంతో అణచివేయబడిన తన వ్యక్తిత్వాన్ని రక్షించుకోడానికి అతను ప్రయత్నిస్తాడు. తను స్వచ్ఛంగా ఉండాలన్న ఆశయంతో సౌందర్యశాస్త్ర (ఈస్థెటిక్స్) భావాలతో ప్రతిస్పందిస్తాడు. ఇది పలాయనవాదం మినహా మరేమీ కాదు. అనుభవైక (ఎంపిరికల్) పద్ధతులను ప్రయోగించి చూసినప్పటికీ, విలువ సిద్ధాంతం అనేది కేవలం ఉత్పత్తి సంబంధాలకు సంబంధించిన, గుత్త పెట్టుబడిదారులకు సంబంధించిన ప్రతిబింబం ఇంకెంతమాత్రం కాదు. ఉపరితలం ఒక రకమైన కళను రుద్దుతుంది.

అందులో కళాకారుడు ఎడ్యుకేట్ కావాలి. తిరుగుబాటుదారులు యంత్రం చేత మెత్తపరచబడతారు. అసాధారణ ప్రతిభగలవారు మాత్రమే తమ స్వంత పనిని సృష్టించుకోగలుగుతారు. మిగిలిన వారు కిరాయి మూకలుగా మారడమో లేక అణదొక్కబడ్డమో జరుగుతుంది.

కళాకాత్మ ప్రయోగాల పాఠశాల అంటూ ఒకదాన్ని కనుగొన్నారు. స్వేచ్ఛకు ఇదే నిర్వచనం అని చెప్పారు. కానీ ఈ 'ప్రయోగాలకు' పరిమితులున్నాయి. ఒక ఘర్షణ ప్రారంభమయ్యేవరకు, అంటే వ్యక్తి పరాయీకరణకు సంబంధించిన నిజమైన సమస్య తలెత్తే వరకు ఈ పరిమితులను గ్రహించలేం. అందువల్ల మానవుని ఆందోళనను వెళ్లబోసుకోడానికి అర్థం లేని వేదనలూ, అసహ్యకరమైన వినోదాలు ఒక సేఫ్టీ వాల్వ్ లాగా తయారయ్యాయి. నిరసనకు కళను ఒక ఆయుధంగా వాడాలన్న భావాన్ని వారు తిరస్కరిస్తున్నారు.

నిబంధనల ప్రకారం ఆడే వారిపై గౌరవపురస్కారాలు వెదజల్లుతారు. కోతి ఆటకు గౌరవాలు దక్కినట్లు. కాని వాస్తవ పరిస్థితి ఏమంటే, వ్యక్తి తన చుట్టూ ఉన్న అగోచరమైన బోను నుండి ఈ విధంగా బయటపడలేడు.

## కళాత్మక ప్రయోగం కోసం కొత్త ప్రేరణ

విప్లవం అధికారం స్వీకరించినప్పుడు పిరికి వాళ్లు పారిపోయారు. మిగిలిన వారూ విప్లవకారులైనా, కానివారైనా ఒక కొత్త మార్గాన్ని చూశారు. కళాత్మక పరిశీలనకు కొత్త ప్రేరణ లభించింది. అయితే దీనికి మార్గాలు అప్పటికే వేయబడినాయి. "స్వేచ్ఛ" అనే మాట వెనుక పలాయనవాద సిద్ధాంతం దాక్కుంది. కొన్నిసార్లు విప్లవకారుల్లో కూడా ఈ ధోణి కనిపించింది. ఇది వారి చైతన్యంలో ప్రతిబింబించే బూర్జువా ఆదర్శవాదం యొక్క ప్రతిబింబం.

ఇటువంటి క్రమంలోకి ప్రవేశించిన దేశాల్లో ఈ ధోరణులను అతిశయోక్తితో కూడిన పిడివాదంతో ఎదుర్కొనడానికి ప్రయత్నించడం జరిగింది. సాధారణ సంస్కృతి అనేది నిషేధిత పదంగా మారింది. సాంస్కృతిక ఆకాంక్షల ఉచ్ఛస్థితి ప్రకృతికి ప్రతిబింబం అని పేర్కొనడం జరిగింది. ఇది తరువాత కాలంలో సామాజిక వాస్తవికతగా యాంత్రికంగా పరివర్తనం చెందింది. వాళ్లు ఒక ఆదర్శవంతమైన సమాజాన్ని, ఘర్షణలు, వైరుధ్యాలు దాదాపు లేని సమాజాన్ని నిర్మించబూనుకున్నట్లు చూపించడానికి ప్రయత్నించారు.


సోషలిజం బాల్యంలో ఉంది. పొరపాట్లు దొర్లుతాయి. విప్లవకారులమైన మనకు సాంప్రదాయ పద్ధతులకు భిన్నమైన పద్ధతులు గల స్త్రీ,పురుషులను అభివృద్ధి చేసే

లక్ష్యాన్ని సాధించే జ్ఞానం, మేధో ధైర్యం కొరవడుతోంది. సాంప్రదాయ పద్ధతులు వాటిని సృష్టించిన సమాజ ప్రభావానికి లోనై ఉంటాయి. (ఇక్కడ రూపం, సారాల మధ్య సంబంధాలకు సంబంధించిన విషయం ముందుకువస్తుంది.) వక్రీకరణలు చాలా ఎక్కువగా ఉంటాయి. పాదార్థిక నిర్మాణం అనే సమస్య మనల్ని ముంచెత్తుతుంది. విప్లవం మీద పట్టులేకుండా గొప్ప కళాకారులైన వారు లేరు. పార్టీ సభ్యులు ఈ కర్తవ్యాన్ని గ్రహించి ప్రజలను ఎడ్యుకేట్ చేయడం అనే ప్రధాన లక్ష్యాన్ని సాధించాలి.

ఇప్పుడు కావలసింది సరళీకరించడం. అందరూ అర్థం చేసుకోగలిగే విధంగా ముఖ్యంగా కార్యకర్తలు అర్థం చేసుకునే విధంగా సరళీకరించాలి. కళాత్మక ప్రయోగం లేదా సాధరణ సాంస్కృతిక సమస్య అనేది సోషలిస్టు వర్తమానాన్ని, మృతి చెందిన (అందువల్ల దానితో ప్రమాదం ఉండదు) గతాన్ని అర్థం చేసుకునేట్లు ఉండాలి. అందువల్ల సోషలిస్టు వాస్తవికత అనేది గత శతాబ్దపు కళ పునాది మీద నిర్మించబడుతుంది. అయితే గత శతాబ్దపు వాస్తవికకళకు వర్గ లక్షణం ఉంది. అది 20వ శతాబ్దపు క్షీణించిపోతున్న కళ అనేదానికన్నా స్వచ్ఛమైన పెట్టుబడిదారీ కళ అంటే బాగుంటుంది. పరాయీకరణ చెందిన వ్యక్తి ఆవేదనను అది తెలియజేస్తుంది. సాంస్కృతిక రంగంలో పెట్టుబడిదారీ కళ ఇవ్వాల్సిందంతా ఇచ్చేసింది. ఇంక దాన్లో కళకు సంబంధించి కుళ్లికంపుకొడుతున్న శవం మినహా మరేమీ లేదు.

కానీ ఇప్పుడు స్తంభించిపోయిన సోషలిస్టు వాస్తవికవాదంలోనే నివారణ వెదకాల్సిన అవసరం ఏమిటి? "స్వేచ్ఛ"కు ప్రతిగా మనం సోషలిస్టు వాస్తవికతావాదాన్ని ముందుకు తేవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే స్వేచ్ఛ అనేది ఇప్పుడు మనుగడలో లేదు. కొత్త సమాజం పూర్తిగా అభివృద్ధి చెందే వరకు ఉండదు కూడా. మనం ఎట్టిపరిస్థితుల్లోనూ వాస్తవిక వాదాన్ని అనుసరించాలన్న పిడివాదంతో 19వ శతాబ్దపు తొలి అర్ధ శతాబ్దంలో వచ్చిన అన్ని కళా రూపాలనూ ఖండించకూడదు. అలా చేస్తే మనం కూడా గతంలోకి పోయి అప్పుడప్పుడే తమ స్వంత కళారూపాలను ఏర్పరుచుకుంటున్న ప్రజలందరినీ ఒకే రీతిగా విమర్శించే ప్రౌధోనియన్ తప్పు చేస్తాము. ఇప్పుడు కావల్సిందల్లా ఒకవైపు స్వేచ్ఛాయుత పరిశీలనకు అవకాశం ఇవ్వడం, మరోవైపు రాజ్యంచేత పోషించబడిన కలుపుమొక్కల్లాంటి కళారూపాలను ఏరిపారేయడం అనే రెండు పనులకు అనుమతిచ్చే సైద్ధాంతిక-సాంస్కృతిక యంత్రాంగాన్ని అభివృద్ధి చేయడం.

మన దేశంలో యాంత్రిక వాస్తవికవాదం అనే పొరపాటు కనిపించదు, కానీ దానికి వ్యతిరేకమైన అంశం కనిపిస్తుంది. ఇది ఎందుకు జరిగిందంటే కొత్త వ్యక్తిని సృష్టించాల్సిన అవసరాన్ని అర్థం చేసుకోలేదు గనుక. 19వ శతాబ్దపు భావాలుగల




మానవులనుగానీ, లేక కుళ్లిపోయిన మన శతాబ్దపు మానవులను గానీ కాకుండా కొత్త మానవులను సృష్టించాల్సిన అవసరాన్ని గుర్తించలేదు గనుక.

మనం సృష్టించాల్సింది 21వ శతాబ్దపు మానవుణ్ణి. అది ఇప్పటికీ వస్తుగతమైన ఆకాంక్షే అయినప్పటికీ, ఇంకా అది వ్యవస్థీకృతం కానప్పటికీ అటువంటి మానవుని సృష్టే మన లక్ష్యం. మన అధ్యయనం, మన కృషి యొక్క మౌలిక లక్ష్యం అదే. సైద్ధాంతిక రంగంలో మనం ఎంతమేరకు నిర్ధిష్టమైన విజయాలు సాధిస్తామో, లేక ఇంకోవిధంగా చెప్పాలంటే మన నిర్ధిష్టమైన పరిశోధన ఆధారంగా విశాలమైన సైద్ధాంతిక నిర్ధారణలకు వస్తామో అప్పుడు మనం మార్క్సిజం–లెనినిజం సిద్ధాంతానికీ, మొత్తం మానవాళికీ గొప్ప సేవచేసిన వాళ్లమవుతాము.

19వ శతాబ్దపు మానవునికి వ్యతిరేకంగా ప్రతిస్పందించడం ద్వారా మనం 20వ శతాబ్దపు క్షీణతలోకి జారుకున్నాం. ఇది పెద్ద తప్పుకాదు. కానీ దీన్నుండి మనం బయటపడాలి. లేకపోతే మనం రివిజనిజం తలుపులు తెరుస్తాము. అనేక వైవిధ్యాలు అభివృద్ధి అవుతూ ఉండాలి. సమాజంలో కొత్త భావాలు బాగా వికసించడం ప్రారంభిస్తాయి. సమాజంలోని సభ్యులందరూ సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు పాదార్థిక అవకాశాలు పెరిగితే లక్ష్యం మరింత బాగా నెరవేరుతుంది. వర్తమానం పోరాటాల కాలం, భవిష్యత్తు మనది.

## కొత్త విప్లవ తరం

సంగ్రహంగా చెప్పాలంటే మన కళాకారులు, మేధావులు చేసిన తప్పు వాళ్లు చేసుక్ను పాపమే, అంటే వాళ్లు నిజమైన విప్లవకారులు కాకపోవడమే. పిచ్చి మొక్కలు నాటితే మామిడి కాయలు కాయవు. మామిడి కాయలు కావాలంటే మామిడి మొక్కలే నాటాలి. పాత పాపాలకు దూరంగా ఉండే కొత్త తరం పుడుతుంది. గొప్పగొప్ప కళాకారులు వస్తారు అంటే సాంస్కృతిక రంగం, భావప్రకటనా అవకాశాలూ మరింత విస్తరిస్తాయన్నమాట.

ప్రస్తుత తరంలో ఘర్షణలవల్ల ఈ తరం ముక్కలై పోకుండా, వక్రీకరించబడకుండా, కొత్త తరాలను వక్రీకరించకుండా చూడ్డం మన కర్తవ్యం. మనం అధికారిక ఆలోచనలకు బానిసల్లా తలంచేవారినిగానీ, లేక రాజ్యం ఖర్చుతో బతికే, స్వేచ్ఛను గురించి మాటలు మాత్రమే చెప్పే “స్కాలర్‌షిప్పు విద్యార్థులను”గానీ తయారు చేయకూడదు. ప్రజల నిజమైన గొంతుకతో కొత్త స్త్రీల, కొత్త పురుషుల పాటలు పాడే విప్లవకారులు వస్తారు. దీనికి సమయం తీసుకుంటుంది. మన సమాజంలో యువతరం, పార్టీ పెద్ద పాత్ర పోషిస్తుంది. యువతరం అనేది బొమ్మలు తయారు చేసే మట్టి వంటిది. దాంతో పాత లోపాలు లేని కొత్త వ్యక్తులను సృష్టించవచ్చు. యువతరాన్ని మన ఆకాంక్షలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం. వారి విద్యను ప్రతి రోజూ మరింత పరిపూర్ణం చేస్తూ ఉంటాం. మొదటి నుండీ వారిని పనిలో పెట్టే విషయంలో మనం ఏమాత్రం నిర్లక్ష్యం వహించం. మన స్కాలర్‌షిప్ విద్యార్థులు వారి సెలవుల్లో, లేక ఒకవైపు చదువుతూ కూడా భౌతిక శ్రమ చేస్తారు. పని అనేది కొన్ని సార్లు బహుమానం అయితే కొన్ని సార్లు చదువుకునే సాధనం. కాని అది ఎన్నడూ శిక్ష కాదు. కొత్త తరం పుట్టుకు వస్తోంది. పార్టీ అనేది అగ్రగామి దళం. అది అత్యుత్తమ కార్మికులతో తయారవుతుంది. వారి తోటి కార్మికులు వారి పార్టీ సభ్యత్వం కోసం సిఫార్సు చేస్తారు. పార్టీ మైనారిటీలో ఉంటుంది. కానీ దాని

కార్యకర్తల నాణ్యత వల్ల అది గొప్ప అధికారం కలిగి ఉంటుంది. పార్టీ ప్రజాబాహుళ్య పార్టీ కావాలనేది మన ఆకాంక్ష. అయితే ప్రజలు అగ్రగామి దళ స్థాయికి ఎదిగినప్పుడు, అంటే వాళ్లు కమ్యూనిజం గురించి ఎడ్యుకేట్ అయినప్పుడు అది సాధ్యం అవుతుంది. వారిని ఈ విద్యవైపు నడిపించడానికి మనం నిరంతరం కృషి చేస్తుంటాం. పార్టీ అనేది సజీవమైన నిదర్శనం; కష్టపడ్డం, త్యాగాలు చేయడం గురించి కార్యకర్తలకు బోధించాలి. వారి కార్యాచరణ ద్వారా వారు ప్రజలను విప్లవ కర్తవ్యం వైపు నడిపించడంలో నాయకత్వం వహించాలి. ఇది చేయాలంటే నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలకు, వర్గ శత్రువులకు, గతం యొక్క, సామ్రాజ్యవాదం యొక్క దుర్లక్షణాలకు వ్యతిరేకంగా ఏళ్ల తరబడి ఎంతో శ్రమకోర్చి పోరాడాల్సి ఉంటుంది.

## వ్యక్తి పాత్ర

ఇప్పుడు నేను ప్రజలను నడిపించి చరిత్ర సృష్టించే కృషిలో వ్యక్తుల పాత్ర గురించి, వ్యక్తులుగా స్త్రీ,పురుషుల పాత్ర గురించి వివరిస్తాను. ఇది చీటీ మీద రాసి ఇచ్చే మందుల చిట్టా కాదు. ఇది మన అనుభం.

తొలి సంవత్సరాల్లో విప్లవానికి ఫైడల్ కాస్ట్రో ప్రేరణ నిచ్చారు. ఆయన నిరంతరం మార్గదర్శకత్వం వహించేవారు. కానీ అదేసమయంలో కేంద్ర నాయకత్వం ప్రయాణించే మార్గంలోనే నడిచే ఒక మంచి విప్లవకారుల బృందం తయారైంది. ప్రజలు పెద్ద ఎత్తున తమ నాయకులను అనుసరిస్తున్నారు. ఎందుకంటే వారికి నాయకత్వంపై అంతటి విశ్వాసం ఉంది. వారికి నాయకులపై విపరీతమైన నమ్మకం ఉంది ఎందుకంటే నాయకులకు ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోగలిగే శక్తి ఉంది.

ఒక వ్యక్తి ఎన్ని కిలో గ్రాముల మాంసం తిన్నాడన్నది ముఖ్యం కాదు, లేక ఏడాదిలో అతను ఎన్నిసార్లు బీచ్‌కు వెళ్లాడన్నది కాదు. లేక ప్రస్తుత జీతాలతో విదేశాలకు వెళ్లినప్పుడు ఎన్ని రకాల వస్తువులు కొన్నాడన్నదీ కాదు. వ్యక్తి తను మరింత సంపూర్ణమైన వానిగా భావిస్తున్నాడా, అంతః సంపదను మరింత పెంచుకుంటున్నాడా, బాధ్యతలు మరింత మోస్తున్నాడా అన్నది ముఖ్యమైన విషయం.

తాము నివసిస్తున్న కాలంలో త్యాగాలు చేయడం చాలా గొప్ప విషయం అని మన దేశంలోని ప్రజలకు తెలుసు. వారికి త్యాగాల గురించి తెలుసు. తొలుత సిర్రా మీస్ట్రాలోనూ, వాళ్లు పోరాడిన ప్రతి చోటా త్యాగాలు చేశారు. తరువాత క్యూబాలో ప్రతిఒక్కరూ త్యాగాల గురించి తెలుసుకున్నారు. క్యూబా అమెరికా ఖండానికి అగ్రగామి దళంగా ఉంది. పోరాటపు ముందువరసలో ఉన్నది గనుక అది త్యాగాలు చేయాలి.

లాటిన్ అమెరికా ప్రజలకు అది పూర్తి స్వేచ్ఛకు మార్గాన్ని చూపిస్తున్నది గనుక త్యాగాలు చేయాలి. దేశం లోపల నాయకత్వం తన అగ్రగామి దళ పాత్రను నిర్వర్తించాలి. నిజమైన విప్లవంలో ప్రతి ఒక్కరూ అటునుండి ఏమాత్రం ఆశించ కుండా తనకున్నదంతా ఇచ్చేస్తారు. అగ్రగామి దళంలో ఉన్న విప్లవకారుని కర్తవ్యం మహత్తరంగా ఉంటుంది, అదే సమయంలో బాధాకరంగా కూడా ఉంటుంది.


## బ్రతికున్న మనుషులపై ప్రేమ

నన్ను కొందరు అపహాస్యం చేద్దురుగాక కానీ నేను చెప్పే దొక్కటే, నిజమైన విప్లవకారుణ్ణి మహత్తర ప్రేమ భావమే నడిపిస్తుంది. ఈ లక్షణం లేని నిజాయితీగల విప్లవకారుణ్ణి ఊహించడం సాధ్యం కాదు. ఒక నాయకుడు హృదయంతో స్పందించి, గొప్ప మేధస్సుతో కూల్‌గా ఆలోచించి, ఎటువంటి జంకుగొంకులు లేకుండా బాధాకరణమైన నిర్ణయాలు తీసుకోవడం అనేది బహుశా ఒక మహత్తర నాటకాన్ని తలపిస్తుంది. మన అగ్రగామి దళ విప్లవకారులు ప్రజల పట్ల ఈ ప్రేమ అనే అత్యంత పవిత్రమైన లక్ష్యాన్ని అగోచరమైన ఆదర్శంగా మార్చాలి. సామాన్య ప్రజలు ప్రేమను చూపించినట్లు వాళ్లు కూడా ప్రతిరోజూ కొంచెం కొంచెం ప్రేమ చూపే స్థితికి దిగజారకూడదు.

విప్లవ నాయకుల పిల్లలుగానీ, భార్యలుగానీ విప్లవాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో సాధారణ త్యాగాలల్లో భాగస్వాములు కావాలి. వారికి స్నేహితులుంటే వారు కూడా విప్లవంలో కామ్రేడ్స్ కావాలి. విప్లవానికి బయట జీవితం లేదు.

ఈ పరిస్థితుల్లో ఒక వ్యక్తి తీవ్రమైన పిడివాదానికి, లేక తిరోగమన వాదానికి వెళ్లకుండా ఉండాలంటే, లేక ప్రజలనుండి దూరమవకుండా ఉండాలంటే అతనికి చాలా ఎక్కువ మానవత్వం, చాలా ఎక్కువ న్యాయం, సత్యం పట్ల నిబద్ధత కావాలి. బ్రతికున్న మానవుల పట్ల మనకున్న ఈ ప్రేమ నిజమైన కార్యచరణలోకి మారాలంటే, ఆదర్శవంతమైన చర్యలుగా మారాలంటే, కదిలే శక్తిగా మారాలంటే మనం ప్రతిరోజూ ఈ దిశగా కృషి చేయాలి.

పార్టీలో విప్లవానికి సైద్ధాంతిక చోదక శక్తి అయిన విప్లవకారుడు ఈ రకమైన నిరంతర కార్యాచరణలో మునిగి ఉండాలి. మరణం వరకు అది నిరంతరాయంగా కొనసాగుతూనే ఉండాలి. ప్రపంచ స్థాయిలో సోషలిజం సాధించబడేవరకు సాగుతూనే ఉండాలి. స్థానికంగా సోషలిజం సాధించడంతోనే మన విప్లవస్ఫూర్తి మొద్దుబారిపోతే, మనం కార్మికవర్గ అంతర్జాతీయతను మరిచిపోతే మనం నాయకత్వం వహించిన విప్లవం చోదకశక్తిగా మనజాలదు. సదుపాయంగల మగత నిద్రలోకి జారుకుంటుంది.



అప్పుడు మనకు ఆజన్మ శత్రువైన సామ్రాజ్యవాదం దీన్ని ఉపయోగించుకుని బలం పుంజుకుంటుంది. కార్మికవర్గ అంతర్జాతీయత మన విధి మాత్రమే కాదు విప్లవ అవసరం. ఈ విధంగా మనం ప్రజలను ఎడ్యుకేట్ చేయాలి.

## పిడివాద ప్రమాదం


ప్రస్తుత పరిస్థితుల్లో పిడివాద ప్రమాదమే కాదు, లక్ష్యం చేరడానికి ముందే ప్రజలతో మధ్యలోనే సంబంధాలు కోల్పేయే ప్రమాదమే కాదు మనం కొన్ని బలహీనతల్లో పడిపోయే ప్రమాదం కూడా ఉంది. ఒక వ్యక్తి తన మొత్తం జీవితాన్ని విప్లవానికి అంకితం చేయడం అంటే రానున్న కాలంలో కుటుంబం ఎదుర్కొనే ఇబ్బందులను తట్టుకోడానికి సిద్ధపడడం అని అర్థం. పిల్లలకు అది లేదనీ, ఇది లేదనీ, కుటుంబాల అవసరాలు తీరడం లేదనీ అనుకుంటే అప్పుడు ఎంతటి విప్లవకారుడైనా అవినీతి క్రిములకు తలుపులు తెరిచిఉంచినట్లే అవుతుంది.

మన విషయానికి వచ్చేటప్పటికి సామాన్య ప్రజల పిల్లలకు ఏమి ఉన్నాయో మన పిల్లలకూ అవి ఉంటాయి. సామాన్య ప్రజల పిల్లలకు ఏమి ఉండవో మన పిల్లలకూ అవి ఉండవు. మన కుటుంబాలు దీన్ని అర్థం చేసుకోవాలి, ఆ విధంగా ఉండడానికి పోరాడాలి. విప్లవం మనుషుల ద్వారా వస్తుంది, కానీ వ్యక్తులు ప్రతి రోజూ తమ విప్లవ స్ఫూర్తిని భర్తీ చేసుకుంటూ ఉండాలి.

ఆ విధంగా మనం మున్ముందుకు నడుస్తాం. మన జనసందోహం ముందు భాగంలో ఫైడల్ ఉన్నాడని చెప్పడానికి మనం ఏమాత్రం సిగ్గుపడం, భయపడం. ఆయన వెనుక పార్టీలోని అత్యంత ఉత్తమ కార్యకర్తలు నడుస్తున్నారు. వారి వెనుకనే వారిని అంటిపెట్టుకుని మొత్తం ప్రజానీకం ఒక గొప్ప శక్తిగా నడుస్తోంది. వ్యక్తులతో తయారైన గట్టి నిర్మాణం ఒక ఉమ్మడి లక్ష్యంవైపు నడుస్తోంది. ఈ వ్యక్తులు తాము ఏం చేయాలన్న దాని గురించి పూర్తి చైతన్యం పొందిన స్త్రీ పురుషులు. అవసరం (నెసెస్సిటీ) అనే దాని ప్రభావం నుండి తప్పుకుని స్వేచ్ఛలోకి ప్రవేసించడానికి పోరాడుతున్న స్త్రీ, పురుషులు వీరంతా.

ఈ మహత్తర జనసమూహం నిర్మాణం చెందింది. నిర్మాణ అవసరం పట్ల పొందిన చైతన్యం నుండి వచ్చిన నిర్మాణం అది. అది ఇంకెంత మాత్రం చెల్లాచెదురుగా ఉన్న శక్తి కాదు. బాంబు పేలినప్పుడు గాలిలోకి చెల్లాచెదురైన ఇనుపముక్కల్లా వేలాదిమందిగా విడిపోయి ఉన్న శక్తి కాదు. తమ తోటి వారితో జరిపే పోరాటంలో అనిశ్చితమైన భవిష్యత్తు నుండి ఏవిధంగా నైనా కాస్త రక్షణ కల్పించు కోడానికి ప్రయత్నిస్తున్న శక్తి కాదు.

మున్ముందు కూడా త్యాగాలు చేయాల్సి ఉంటుందని మనకు తెలుసు. ఒక దేశంగా మనం అగ్రగామి దళంగా ఉన్నందుకు మూల్యం చెల్లించాల్సి ఉందని కూడా మనకు తెలుసు. మనం, నాయకులం ప్రజలకు నాయకత్వ స్థానంలో ఉన్నామనీ, అమెరికాకు నాయకత్వ స్థానంలో ఉన్నామనీ చెప్పడం కోసం మూల్యం చెల్లించాల్సి



ఉంటుందని మనకు తెలుసు. మనలో ప్రతి ఒక్కరం మన వంతు త్యాగం చేయాల్సి ఉంటుంది. మన విధులను నిర్వహిస్తున్నామన్న సంతృప్తితోనూ, దిగంతాల్లో కనిపిస్తున్న కొత్త స్త్రీ, పురుషుల లోకంవైపు అందరితో కలిసి పయనిస్తున్నామన్న చైతన్యంతోనూ మనం ఈ త్యాగాలకు సిద్ధంగా ఉన్నాం.

**ఈ క్రింది కొన్ని నిర్ధారణలు చేస్తాను:**

మనం, సోషలిస్టులం స్వేచ్ఛగా ఉంటాం, ఎందుకంటే మనం మరింత కర్తవ్యాన్ని నెరవేరుస్తాం గనుక; మనం మరింత కర్తవ్యాన్ని నిర్వహిస్తాం, ఎందుకంటే మనం మరింత స్వేచ్ఛగా ఉంటాం గనుక.

మన పూర్తి స్వేచ్ఛకు సంబంధించిన చట్రం ఇప్పటికే తయారైంది. రక్తమాంసాలు, దుస్తులు రూపొందించాలి. వాటిని మనం సృష్టిస్తున్నాం.

రక్తంతోనూ, త్యాగాలతోనూ మనకు స్వేచ్ఛ వచ్చింది, ప్రతిరోజూ నిలబడుతోంది. మన త్యాగం చైతన్యపూరితమైనది. మనం నిర్మించే స్వేచ్ఛా ప్రపంచానికి చెల్లిస్తున్న ఇన్‌స్టాల్‌మెంట్ అది.

మార్గం సుదీర్ఘమైనది. కొంత భాగం ఎలా ఉంటుందో మనకు తెలియదు. మన పరిమితులు మనకు తెలుసు. మనం 21వ శతాబ్దపు మానవులను, అంటే మనల్ని మనం తయారు చేస్తాం. మనం కొత్త సాంకేతిక శాస్త్రంతో కొత్త మానవుణ్ణి, కొత్త స్త్రీ,పురుషుణ్ణి తయారు చేయడానికి రోజువారీగా కృషి చేస్తాం.

ప్రజలను సమీకరించి, నాయకత్వం వహించడంలో వ్యక్తుల పాత్ర ఉంటుంది. ప్రజల అత్యున్నత లక్షణాలు, ఆకాంక్షలను వారు ఇముడ్చుకుంటారు, ఎంచుకున్న మార్గాన్ని విడనాడరు.

మార్గం సుగమం చేసేది మాత్రం పార్టీ. పార్టీ అంటే అగ్రగామి దళం, మంచివాళ్లలో ఉత్తమోత్తమమైన వాళ్లతో కూడినది.

మన కృషికి మౌలికమైన పదార్థం యువతరం. మనం దానిపై ఆశలు పెట్టుకుంటాం. మన తరువాత పతాకాన్ని చేబూనడానికి వారిని సిద్ధం చేస్తాం.

నా ఈ అసమగ్రమైన ఉత్తరం మీకు ఏమాత్రమైనా స్పష్టత ఇచ్చి ఉంటే దీని ఉద్దేశం నెరవేరినట్లే.

అభినందనలు!

దేశమో లేదా మరణమో!



మనం, సోషలిస్టులం, మరింత స్వేచ్ఛ అనుభవిస్తున్నాం, ఎందుకంటే మనం మన కర్తవ్య నిర్వహరణలో మరింత సంతృప్తి చెందుతున్నాం గనుక; మనం మన కర్తవ్య నిర్వహరణలో మరింత సంతృప్తి చెందుతున్నాం, ఎందుకంటే మనం మరింత స్వేచ్ఛ అనుభవిస్తున్నాం గనుక.

మన పూర్తి స్వేచ్ఛకు సంబంధించిన చట్రం ఇప్పటికే తయారైంది. రక్త మాంసాలు, దుస్తులు రూపొందించాలి. వాటిని మనం సృష్టిస్తున్నాం.

రక్తంతోనూ, త్యాగాలతోనూ మనకు స్వేచ్ఛ వచ్చింది, ప్రతిరోజూ నిలబడుతోంది. మన త్యాగం చైతన్యపూరితమైనది. మనం నిర్మించే స్వేచ్ఛా ప్రపంచానికి చెల్లిస్తున్న ఇన్‌స్టాల్‌మెంట్ అది.

మార్గం సుదీర్ఘమైనది. కొంత భాగం ఎలా ఉంటుందో మనకు తెలియదు. మన పరిమితులు మనకు తెలుసు. మనం 21వ శతాబ్దపు మానవులను, అంటే మనల్ని మనం తయారు చేసుకుంటాం. మనం కొత్త సాంకేతిక శాస్త్రంతో కొత్త మానవుణ్ణి, కొత్త స్త్రీ,పురుషుణ్ణి తయారు చేయడానికి రోజువారీగా కృషి చేస్తాం.

ప్రజలను సమీకరించి, నాయకత్వం వహించడంలో వ్యక్తుల పాత్ర ఉంటుంది. ప్రజల అత్యున్నత లక్షణాలను, ఆకాంక్షలను ఇముడ్చుకున్నవారు, ఎంచుకున్న మార్గాన్ని విడనాడనివారు అటువంటి పాత్ర నిర్వహించ గలుగుతారు.

మార్గాన్ని సుగమం చేసేది మాత్రం పార్టీ. పార్టీ అంటే అగ్రగామి దళం, మంచివాళ్లలో ఉత్తమోత్తమమైన వాళ్లతో కూడినది.

మన కృషికి మౌలికమైన పదార్థం యువతరం. మనం దానిపై ఆశలు పెట్టుకుంటాం. మన తరువాత పతాకాన్ని చేబూనడానికి వారిని సిద్ధం చేస్తాం.

*- ఎర్నెస్టో చె గువేరా*

PSBH
ప్రజాశక్తి బుక్‌హౌస్

Nava Telangana Publishing House
నవతెలంగాణా పబ్లిషింగ్ హౌస్